V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

సోమవారం
20-01-2025

సంపుటి : 01 | సంచిక : 258 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్





డా॥ కాచం సత్యనారాయణ
CMD




# ఘనంగా పండుగల సాయన్న ముదిరాజ్ విగ్రహావిష్కరణ






**విశ్వంభర, మీర్‌పేట్:** రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపాలిటీ జిల్లెలగూడ చందన చెరువు కట్ట మీద పండుగల సాయన్న ముదిరాజ్ విగ్రహావిష్కరణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మీర్‌పేట్ చౌరస్తా నుంచి ర్యాలీగా చందన చెరువు కట్ట వరకు కాంగ్రెస్ మెదక్ ఎంపీ కాంటెస్టెడ్ కాండిడేట్ నీలం మధు అతిథిగా జై పండుగల సాయన్న జై ముదిరాజ్ నినాదాలతో హోరెత్తింది. అనంతరం చందన చెరువు కట్ట మీద ఏర్పాటు చేసిన పండుగల సాయన్న భారీ విగ్రహం దగ్గరకు చేరుకున్నారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మక్తల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, మేయర్లు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు ముదిరాజ్ సంఘ నాయకులు పులకరం శివశంకర్ ముదిరాజ్, అల్లగొని కుమార్ ముదిరాజ్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, చింతల రాఘవేందర్ ముదిరాజ్, తుమ్మల రమేష్ ముదిరాజ్, బొమ్మకంటి దయానంద్ ముదిరాజ్, ఎం .ప్రకాష్ ముదిరాజ్, టి ముకేశ్ ముదిరాజ్, బి అంజాన్ ముదిరాజ్, పి.చంద్రశేఖర్ ముదిరాజ, పృథ్వీ రాజ్ ముదిరాజ్, జి సత్యనారాయణ ముదిరాజ్ తదితరుల సమక్షంలో ఆవిష్కరణ చేశారు. అనంతరం అతిథుల ప్రసంగం, శాలువాలతో సన్మానం సత్కారాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బీసీ నాయకులతో పండుగ వాతావరణం లాగా సాగింది. ముదిరాజులను బీసీ ఏ చేర్చాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా ఎదగాలని, ముదిరాజ్ పిల్లలు మంచి చదువులు చదవాలని సూచించారు.

## మైసిగండి అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు

**ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన జర్పుల లక్పతినాయక్**



**విశ్వంభర, కడ్తాల్:** మండలంలోని మైసిగండి గ్రామంలోవెలసిన మైసమ్మ ఆలయ అభివృద్ధి కోసం టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ద్వారా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ. 5 కోట్లు మంజూరు చేస్తూ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రొసీడింగ్ ను ఆలయ కార్య నిర్వహణ అధికారి స్నేహలత, ట్రస్ట్ చైర్మన్ శిరోలీ పంతు నాయకు అందజేసిన సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాష్ట్ర సేవాలాల్ సేన కార్యదర్శి జర్పుల లక్పతి నాయక్ కృతజ్ఞతలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం గతంలో ట్రష్టి ఆధ్వర్యం లో ఎన్నో వినతులు అందజేశారు. దీంతో ఎమ్మెల్యే అయిదు కోట్లు మంజూరు చేసినందుకు మండల ప్రజల తరపున అభినందనలు తెలిపారు.

## ఘనంగా చిత్తారమ్మ దేవి స్వర్ణోత్సవ వేడుకలు

**పాల్గొన్న కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి**



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం చిత్తారమ్మ దేవాలయంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న దేవాలయ స్వర్ణోత్సవ వేడుకల కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు వారు మాట్లాడుతూ.. చిత్తారమ్మ దేవి అమ్మవారి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో , సుఖ సంతోషాలతో , అష్టైశ్వర్యాలతో జీవించాలన్నార అన్నారు. భక్తులకు కోరిన కొంగుబంగారంగా సుఖసంతోషాలు ఆయు ఆరోగ్యాలు ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్, కోలన్ శ్రీనివాస్ రెడ్డి ,డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, సిద్దనోల సంజీవరెడ్డి, పాలకృష్ణ, రెడ్డి అవిజె హన్మంతు, శ్రీధర్ వర్మ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్యామలమ్మకు నివాళులర్పించిన ఎమ్మెల్యే

**విశ్వంభర, మహబూబ్‌నగర్:** కౌకుంట్ల మండల కేంద్రంలో ని వెంకటగిరి గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి( అడ్వకేట్ ) మాతృమూర్తి సోమిరెడ్డి శ్యామలమ్మ దశదినకర్మకు దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి హాజరై నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కౌకుంట్ల మండలానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కాల్వ గండి పూడ్చివేత

**సొంత నిధులిచ్చిన ఎమ్మెల్యే మురళీనాయక్**




**విశ్వంభర, ఇనుగుర్తి:** మండలంలోని చిన్ననాగారం శివారు మీట్యా తండా పరిధిలోని మర్రికుంట తండా సమీపం రైతులకు సాగునీరందించే ఎస్సారెస్పీ కాలువ సంక్రాంతి రోజు గండి పడింది. దీనికి మరమ్మతులు చేయాలంటే టెండర్ ప్రాసెస్ జరిగే వరకు ఆలస్యం అవుతుంది. రైతుల పంటలు దెబ్బతినొద్దని భావించిన స్థానిక ఎమ్మెల్యే డా.భూక్య మురళి నాయక్ తన సొంత నిధులతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు.వేసంగి వరి, మొక్కజొన్న, పసుపు మిర్చి తదితర పంటలకు ప్రస్తుత అదును సమయంలో నీరు అందకపోతే పంటలు పాడై రైతులు ఇబ్బందులకు గురవుతారని భావించిన ఎమ్మెల్యే స్పందించి జెసిబి యంత్రంతో తెగిన కాలువలను పూడ్చి వేస్తున్న పనుల పట్ల కర్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతల పట్ల ఎమ్మెల్యే కున్న ప్రేమను రైతులతో పాటు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, సంబంధిత పనులను డిసిసి ఉపాధ్యక్షులు గుగులోతు బాలాజీ నాయక్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పెరుమాండ్ల గుట్టయ్య గౌడ్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మద్ది రాజేష్ పరిశీలించారు. కార్యక్రమంలో సురేష్ నాయక్, భిక్షం పాల్గొన్నారు.

## రెండు రోజులు నీటి సరఫరా బంద్

**విశ్వంభర, మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లాలోని ఉమ్మడి అడ్డాకుల మూసాపేట మండలంలో 20న ఉదయం 8 గంటల నుండి 21న సాయంత్రం 8 గంటల వరకు మొత్తం 36 గంటలు నీటి సరఫరా నిలిపి వేయడం జరుగుతుంది, ఎందుకు అనగా జానంపేట దగ్గర ఎన్ హెచ్-44 బ్లాక్ స్పాట్ల వద్ద రోడ్ వైండింగ్ కారణంగా మిషన్ భగీరథ పైపులైన్ మార్చడం జరుగుతుంది. అందువలన ఇట్టి పని పూర్తి కావడానికి సుమారు 36 గంటలు నీటి సరపరా ఆపివేయడం జరుగుతుంది. మరమ్మత్తుల కారణంగా అడ్డాకల మండల్ లోని 19 గ్రామాలకు మూసాపేట మండలంలో 17 గ్రామాలకు మొత్తం 36 గ్రామాలకు నీటి సరఫరాలో అంతరాయము కలుగును. ఈ విషయమే ప్రజలు సహకరించగలరని కోరుతున్నారు.

## నూతన మండల ఎమ్మార్పీఎస్ కార్యవర్గ నియామకం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల కార్యవర్గం ఆదివారం ఏర్పాటు చేయడం జరిగింది కార్యక్రమనికి ముఖ్య అధితులుగా పెంటనోళ్ళ నర్సింహా మాదిగ. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు.రావుగాళ్ల బాబు మాదిగ హాజరయ్యారు వేల గొంతులు లక్షల డప్పులు మహా ప్రదర్శన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంట నోళ్ళ నరసింహా మాదిగ మాట్లాడుతూ ఫిబ్రవరి 7న మందకృష్ణ మాదిగ తలపెట్టిన వెయ్యి గొంతులు లక్ష డప్పులనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హైదరాబాద్ వచ్చే ప్రతి ఒక్కరు తన సంకకు డప్పు వేసుకొని రావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు మాదిగ సంస్కృతి అయిన మన ఆయుధం డప్పు ఈ డప్పు శబ్దంతోనే వర్గీకరణ వ్యతిరేకుల గుండె ఆగేలా వెయ్యి గొంతులు లక్ష డప్పులతో సమాధానం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం మండలం ఇంచార్జి కిరణ్ పూలె ఆధ్వర్యంలో జరగడం మరియు నూతన మండల కమిటీకీ అభినందనలు తెలిపారు. మండలం అధ్యక్షులు గా అబ్బు రమేష్ మాదిగ, ఉప అధ్యక్షులు గా జి. నరేష్ మాదిగ, మహేందర్ మాదిగ, కార్యదర్శిగా యాదయ్య మాదిగ ఎన్నికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో కిరణ్ పూలె మాదిగ, రంగారెడ్డి జిల్లా సెక్రటరీ. సినియర్ నాయకులు మంగల్లిపల్లి నర్సింహా మాదిగ, గురిగల లక్ష్మయ్య, పోతుగంటి శంకర్ , మంఖి శ్రీను, కంబాలపల్లి అంజి, మంఖి మహేష్ , వగ్గు మహేష్ రాజశేఖర్, జంగయ్య మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## 33 జిల్లాల ఉద్యమకారుల ఆత్మగౌరవ యాత్ర విజయవంతం




**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ రూరల్ అనంతాద్రి దేవస్థానం నుండి భారీ ఎత్తున ఉద్యమకారుల ర్యాలీతో కోర్టు ముందు ఉన్న అమరవీరుల స్థూపం వరకు ముప్పై మూడు జిల్లాలోని 1000 మందితో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ యాత్ర విజయవంతమైంది.తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ పార్లమెంట్ కన్వీనర్ ధరంసోత్ నారాయణ్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు రాష్ట్ర నాయకులు మహబూబాబాద్ జిల్లా ఉద్యమ కారుల ఫోరం గౌరవ సలహాదారులు శంతన్ రామరాజు,కమ్మ గానీ కృష్ణ మూర్తి, రాం నాయక్, భూక్యా రమేష్,రాములు నాయక్,హాజరయ్యారు. అనంతరం ఈ కార్యక్రమంలో ఉద్దేశించి పార్లమెంట్ కన్వీనర్ నారాయణ్ సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు, మేధావుల బలిదానాల పునాదులపై ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు బీఆర్ఎస్ హయాంలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్ ఉద్యమ ద్రోహులను అందలమెక్కించి ఉద్యమకారులను పాతాళానికి నెట్టిందన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యమకారులను గుర్తించి గౌరవించిందన్నారు.ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రతి ఉద్యమకారునికి 250గజాల ఇంటి జాగాతో పాటు ప్రభుత్వ పథకాలు అందజేస్తామని హామీ ఇచ్చిన ఘనత రేవంత్ రెడ్డిదని తెలిపారు.తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీగా ఉద్యమకారులకు న్యాయం చేసిన పార్టీగా చరిత్రపుటల్లో కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందన్నారు.ఈ జూన్ రెండు నాటికి ప్రభుత్వ హామీని నిలబెట్టుకుంటుందని ఆకాంక్షించారు.రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో ఉద్యమరులు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా ప్రభుత్వ హామీలను త్వరగా అమలు పరచాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ కళాకారులకు,రచయితలకు ఇచ్చినట్లుగా మా ఉద్యమ కరులకు కూడా సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర 33 జిల్లాల అధ్యక్షులు పొతి రెడ్డి జ్యోతి,సురేందర్, రజనీకాంత్,యం డి.అక్బర్, తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

**పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి**



**విశ్వంభర, సూర్యాపేట:** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సూర్యాపేట నియోజకవర్గానికి చెందిన వివిధ గ్రామాలకు చెందిన తొమ్మిది మంది లబ్ది దారులకు 4 లక్షల 30 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి మాట్లడతూ భారతదేశంలో సీఎం ఆర్ ఎఫ్ పథకం ద్వారా పేదల ఆరోగ్యానికి అత్యదిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. గత సంవత్సరం కాలంలో 700 కోట్ల రూపాయలు ఈ పథకం ద్వారా పేదలకు సహాయం చేశారని అన్నారు. సీఎం ఆర్ ఎఫ్ పథకం పేదలకు వరమని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు చికిత్స కోసం తమను సంప్రదిస్తే ఈ పథకం ద్వారా సహాయం చేస్తామని అన్నారు. సీఎం ఆర్ ఎఫ్ పథకం ద్వారా నిధుల విడుదలకు సహకరించిన జిల్లా ఇంఛార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర రెడ్డి లకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి తెలియజేశారు.

## మరమ్మతుకు నోచుకోని రహదారి

- ఆందోళనకరంగా ఇనుగుర్తి-చిన్న ముప్పారం రోడ్డు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



**విశ్వంభర, ఇనుగుర్తి:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇనుగుర్తి నుంచి చిన్న ముప్పారం వెళ్లే ఆర్ అండ్ బీ బీటీ రోడ్డు ధ్వంసమైంది. ఇనుగుర్తి సమీపంలోని బంధం ఏరియాలో రోడ్ వరద కోతకు గురై సుమారు 100 మీటర్ల పొడవు దెబ్బతింది. సరపురం దాటిన తర్వాత సైతం చిన్న ముప్పారం వైపు వెళ్లే రోడ్డు ఇదే తరహాలో దెబ్బతింది. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాల్సిన ఆర్ అండ్ బీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. నాలుగు నెలలుగా రాకపోకలు చేస్తున్న ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత ఆర్ అండ్ బీ శాఖ ఇప్పటివరకు రహదారి మరమ్మతులు చేపట్టడంలేదు. ట్రాక్టర్లు, ఫారెస్ట్‌లోని జామాయిల్ కర్ర కోసం వెళ్లే భారీ వాహనాలైన లారీలు రాకపోకలు కొనసాగించడంతో దెబ్బతిన్న రహదారి మరింత పగుళ్లకు లోనవుతోంది. దీంతో ఆ రూట్‌లో వెళ్లే వాహనదారులు, బాటసారులు ధ్వంసమైన రోడ్డు వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖ రోడ్డు రిపేర్ పనులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం ప్రజల సహనాన్ని పరీక్షించడమే అవుతోంది.ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు చేసి రాకపోకలకు ఆటంకం కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరుతున్నారు.

## నేడు బైంసాలో డా.కిరణ్ కొమ్రేవార్ జన్మదిన వేడుకలు



**విశ్వంభర, బైంసా:** ఆపదలో ఎందరికో చేయూతనిచ్చి , వైద్యపరంగా ఎందరికో భరోసా కల్గించిన ముధోల్ నియోజకవర్గ ముద్దుబిడ్డ, బీఆర్ఎస్ పార్టీ సమన్వయ సమితి సభ్యులు డా.కిరణ్ కొమ్రేవార్ జన్మదిన వేడుకలను సోమవారం బైంసా పట్టణ కేంద్రంలో నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీటీసీ బండారి గంగాధర్, బీఆర్ఎస్ యువనాయకులు రావుల పోశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జన్మదిన వేడుకలకు బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, కిరణ్ కొమ్రేవార్ అభిమానులు, శ్రీయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## రైతు ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

**రైతు కూలీ సంఘం డిమాండ్**

**విశ్వంభర, హైదరాబాద్:** ఆదిలాబాద్ జిల్లా బెల మండలం రేణిగూడ గ్రామం రైతు జాదవ్ దేవ్ రావు మరణం ముమ్మాటికి ప్రభుత్వ హత్యనేనని తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం అన్నారు. లక్షల కోట్లరూపాయలు బ్యాంక్ లకు ఎగవేసిన బడా బడా నేతలకు మినహాయింపు ఇచ్చే బ్యాంకులు, పేద రైతును వేధించి ఆత్మహత్యకు పురిగొల్పడాన్ని రైతుకూలీ సంఘం తీవ్రంగా ఖండిస్తుంది.కేవలం 2కిస్తీలు చెల్లించని రైతు పై చూపిన దౌర్జన్యాన్ని కోట్లాది రూపాయలు ఎగవేసిన అదాని,అంబానీ,విజయ్ మాల్య, నీరజ్ మోడీ, పాలక పక్షము, ప్రతి పక్షం రాజకీయ నేతలఆస్తులు ఎందుకు జప్తు చేయడం లేదు అని ప్రశ్నిస్తున్నాం. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక, కల్తీ విత్తనాల వల్ల పంటలు పండక రైతాంగం అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటుంది. బ్యాంకర్లు రైతులపై మానసికవేధింపులు, ఆస్తుల జప్తులు ఆపివేయాలని రైతుకూలీ సంఘండిమాండ్ చేస్తుంది.జాదవ్ దేవ్ రావు కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్ గ్రేసీయా ప్రకటిస్తూ, ఘటనపై న్యాయవిచారణ జరిపి బాద్యులను కఠినంగా శిక్షిం చాలని బ్యాంక్ రుణాన్ని మాపీచేయాలని రైతుకూలీ సంఘం డిమాండ్ చేస్తుంది.రైతాంగం సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలే కాని ఆత్మ హత్యలే శరణ్యం అనుకోరాదు.రైతు జాదవ్ దేవ్ రావు కుటుంబానికి రైతుకూలీ సంఘం ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తుందన్నారు.

## ఘనంగా లోడంగి అశోక్ యాదవ్ జన్మదిన వేడుకలు



**విశ్వంభర, దేవరుప్పల:** జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు లొడంగి అశోక్ యాదవ్ జన్మదిన వేడుకలను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి హైదరాబాద్ బంజారాహిల్స్ నివాసంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసి అశోక్ ను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో నియోజవర్గ యూత్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్ నాయక్, దేవరుప్పుల మండల యూత్ కాంగ్రెస్ పులిగిల్ల వెంకన్న యాదవ్, వేశ్యమైన మధు, మాసంపల్లి సాత్విక్ పటేల్ జనగాం జిల్లా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

## స్టేషనరీ ప్రారంభించిన ఎమ్మెల్యే




**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** చింతల్ డివిజన్ చంద్రానగర్ నందు రాజేష్ కచ్చ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలాజీ మేఘరాజ్ స్టేషనరీ షాపును కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కె వి . వి వే కా న o ద్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సహజమైన సామాన్లు అందరికీ అతి తక్కువ ధరలో అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ, డివిజన్ ప్రెసిడెంట్ ఎర్వ శంకరయ్య, రుద్రా అశోక్, పుప్పాల భాస్కర్, పోలె శ్రీకాంత్, మైనార్టీ నాయకులు మక్బూద్ అలీ, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, సత్యనారాయణ, మహిళా నాయకురాలు మెహరున్నిసా బేగం, కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, సెక్రెటరీ రామకృష్ణ, నాయకులు ఓంకార్, మురుగేష్, ఓంకార్, కరణ్, బాలకృష్ణ, సీతారాం పాల్గొన్నారు.





**కాంచం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు, అనాథలకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం. - విశ్వంభర, చైతన్యపురి**



చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా కుమార్తె నిశ్చితార్థంకు హాజరైన డా.కాచం సత్యనారాయణ సుష్మ దంపతులు.
– విశ్వంభర, చైతన్యపురి

V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

సోమవారం
20-01-2025

సంపుటి : 01 | సంచిక : 258 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




డా|| కాచం సత్యనారాయణ CMD




## ఆంధ్ర అభివృద్ధికి అహర్నిషలు కంకణబద్ధులమై ఉంటాం

- సీఎం చంద్రబాబుకు ప్రధాని మోడీ అండదండలున్నాయి
- వారి నాయకత్వంలో రాష్ట్రంలో మూడింతల ప్రగతి సాధిస్తాం
- ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో అమిత్‌షా వ్యాఖ్యలు
- కేంద్రం సహకారంతో 'వెంటిలేటర్' నుంచి ఏపీ బయటపడింది: సీఎం చంద్రబాబు

10

## పంతంగి టోల్‌ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

- సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లిన వారంతా తిరుగు పయనం
- కిటకిటలాడుతున్న విజయవాడ బస్టాండ్, రైల్వే స్టేషన్..
- సోమవారం కూడా రద్దీ కొనసాగే అవకాశాలు



5

### కుంభమేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక

- అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చింది
- ప్రపంచ దేశాల నుంచి వస్తున్న ఆదరణ ప్రతి భారతీయుడికి గర్వకారణం
- దేశంలోని యువత తమ ఆచార సంప్రదాయాలను తెలుసుకోవాలి
- అప్పుడే మన మూలాలు బలపడతాయి
- ప్రధాని నరేంద్ర మోడీ



9

### నిష్పక్షపాతంగా లబ్ధిదారుల ఎంపిక

- రేషన్ కార్డులకు ఇంకా ఎలాంటి జాబితా తయారు కాలేదు
- ఏ లిస్ట్ అయినా గ్రామాల్లోనే తయారవుతుంది
- అర్హ్వత కలిగిన ప్రతి ఒక్కరికి ఎలాంటి షరతులు లేకుండా పథకాల వర్తింపు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



5



# హైదరాబాద్‌కు పెట్టుబడుల పంట

**రూ.450 కోట్లతో భారీ ఐటీ పార్క్ ఏర్పాటు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్ పర్యటన ముగిసింది. ఆదివారం క్యాపిటల్ ల్యాండ్ ప్రతినిధులతో భేటీ అయ్యింది. హైదరాబాద్‌లో రూ.450 కోట్ల పెట్టుబడికి ఆ సంస్థ ముందుకొచ్చింది. నగరంలో లక్ష చదరపు అడుగుల మేర భారీ ఐటీ పార్కు నిర్మించనుంది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులతో సీఎం బృందం ఎంవోయూ కుదుర్చుకుంది.హైదరాబాద్ ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్య స్థానంగా పరిచయం చేయడమే లక్ష్యంగా నేడు దావోస్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో బృందం పాల్గొననుంది.

### 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అభివృద్ధి

- క్యాపిటల్ ల్యాండ్ కంపెనీతో కుదిరిన ఒప్పందం
- ముగిసిన తెలంగాణ రైజింగ్ బృందం సింగపూర్ పర్యటన
- చివరి రోజు వరుసగా పారిశ్రామికవేత్తలతో భేటీలు
- నేడు దావోస్‌లో ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొననున్న బృందం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం మరో ముందడుగు వేసింది. రాష్ట్రంలో రూ.450 కోట్ల పెట్టుబడులకు క్యాపిటల్ ల్యాండ్ కం పెనీ ముందుకొచ్చింది. హైదరాబాద్ లో అత్యాధునిక ఐటీ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. సింగపూర్ కేంద్రంగా విస్తరించిన ఈ కంపెనీ ప్రపంచ స్థాయి రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఒకటి. హైదరాబాద్ లో 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ ఐటీ పార్క్‌ను అభివృద్ధి చేయనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సింగపూర్ లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో క్యాపిటల్ ల్యాండ్ ఈ నిర్ణయం ప్రకటించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్ రెడ్డి,

మిగతా5లో...

## పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నాం

**ప్రకటించిన విధానంపై తమకు అభ్యంతరాలు ఉన్నాయి**

- ప్రారంభోత్సవాన్ని బీజేపీ కార్యక్రమంలా చేశారు
- ప్రొటోకాల్ పాటించకుండా ప్రారంభించుకున్నారు
- స్థానిక ప్రజాప్రతినిధులకు కూడా సమాచారం ఇవ్వకపోవడం బాధాకరం
- 2014లోనే పసుపుబోర్డుకోసం రెండు సార్లు ప్రధాని మోడీని కలిశా
- ఎంపీ అర్వింద్ గాలి మాటలు మాట్లాడడం మానేయాలి: ఎమ్మెల్సీ కవిత

5



## పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు



- నాలుగేళ్లలో దశలవారీగా అర్హ్వులందరికీ ఇస్తాం
- హౌసింగ్ శాఖను పునరుద్ధరించాం
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుంది
- ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగులు పనిచేయాలి
- హౌసింగ్ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

5

## తల్లి వద్దనుకున్న ఆ బిడ్డే.. ఐఏఎస్ అయ్యింది



- పట్టుదల, సంకల్పంతో అడ్డంకుల్ని అధిగమించింది
- తన కలను సాకారం చేసుకుంది
- యువ అధికారి సంజితా మహాపాత్ర విజయ యాత్ర

5

## ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

అందుకోసం వైశ్యవికాస వేదిక ద్వారా సంపూర్ణ మద్దతు ఇస్తున్నాం

యువతకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో సముచిత స్థానం దక్కాలంటే వర్గీకరణ తప్పనిసరి


ఎస్సీ, బీసీల మాదిరిగానే ఈడబ్ల్యూఎస్‌లో కూడా వర్గీకరణ చేపట్టాలి

డా.కాచం సత్యనారాయణ గుప్త



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఎస్సీ వర్గీకరణ తోనే మాదిగలకు పూర్తి న్యాయం జరుగుతుందని, వైశ్య వికాస వేదిక సంపూర్ణ మద్దతు ఉంటుందని వైశ్య వికాస వేదిక చైర్మన్, వి3 ఛానల్, విశ్వంభర దినపత్రిక సీఎండీ డా. కాచం సత్యనారాయణ గుప్త అన్నారు. ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాదులో జరిగే వేయి గొంతుకలు - లక్ష డప్పుల మహా ప్రదర్శన సన్నాహక కార్యక్రమం ఆదివారం చంపాపేట్ లోని శిల్పి గ్రాండ్ కన్వెన్షన్ హాల్లో సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు,

మిగతా5లో...



### ఆదిలాబాద్ జిల్లాలో ప్రమాదం

- 47 మంది యాత్రికులకు గాయాలు
- మాలేపూర్ ఘాట్‌లో బోల్తాపడిన వాహనం
- సూర్యగూడ గ్రామ ఆదివాసీలుగా గుర్తింపు

5

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

### అంతేగా!



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 122 | ₹ 144 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 209 | ₹ 238 |



## కాంగ్రెస్ ప్రభుత్వం 3 నెలలుగా హైడ్రా పేరుతో హంగామా చేసింది

- పేదలు కొని ఇళ్లు నిర్మించుకుంటే ఈ ప్రభుత్వం కూల్చుతోంది
- బాలాజీనగర్, జవహర్‌నగర్‌లో పేదలు 40 ఏళ్లుగా ఉన్నారు
- మురికివాడల్లో ఉన్న వాళ్లు అక్రమంగా ఉన్న వాళ్లు కాదు
- ఎంపీ ఈటల రాజేందర్

**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం 3 నెలలుగా హైడ్రా పేరుతో హంగామా చేసిందని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ''బాలాజీనగర్, జవహర్‌నగర్‌లో పేదలు 40 ఏళ్లుగా ఉన్నారు. మురికివాడల్లో ఉన్న వాళ్లు అక్రమంగా ఉన్న వాళ్లు కాదు. 5,877 ఎకరాల భూమిని నాటి బ్రిటీష్ ప్రభుత్వం కొనుగోలు చేసింది. బాలాజీనగర్, జవహర్‌నగర్‌లోని భూమి రక్షణశాఖది. అరుంధతినగర్‌లో 1705 మందికి ప్రభుత్వమే భూమి ఇచ్చింది. కుటుంబ నియంత్రణ చేసుకున్న వారికి అప్పుడు భూములిచ్చారు. ప్రస్తుతం అరుంధతి నగర్‌లో భూమాయ కొనసాగుతోంది. పేదలు కొని ఇళ్లు నిర్మించుకుంటే ఈ ప్రభుత్వం కూల్చుతోంది'' అని ఈటల ఆరోపించారు.

# శ్రమజీవుల చెమట కావ్యం కశ్పి

"కశ్పి" అనే పదానికి 'వృత్తి' అని అర్థం. ఇది తెలంగాణ పదం. 'కులకశ్పి', 'కులకస్పి' అనే శీర్షికలతో రెండు కథలు కనిపిస్తాయి. అవి కూడా కులవృత్తుల కథలు. వృత్తుల ప్రస్తావన తెలుగు సాహిత్యం ప్రారంభంలో స్పర్శమాత్రంగా కన్పిస్తుంది. ప్రస్తుతం సాహిత్యంలో ప్రధాన వస్తువే అది. వృత్తులలో కూడా కొన్ని మరిన్ని వృత్తులపై ఆధార పడ్డవే ఎక్కువ. వృత్తులు మానేస్తే మనిషికి మెతుకు లేదు. అయినా ఇప్పుడు కొన్ని వృత్తులు కనుమరుగయ్యాయి. మరికొన్ని మార్పులకు లోనయ్యాయి. ఇంకా కొన్ని పెట్టుబడిదారుల హస్తగతం అయ్యాయి. వృత్తిని నమ్ముకున్న వారు మాత్రం మరోపని చేయడం తెలియక బతుకులు వలసల పాలయ్యాయి. వాటి కష్టసుఖాలను, పూర్వాపాలను, లాభనష్టాలను రాసుకోవల్సిన అవసరం ఉంది. ప్రాచీనసాహిత్యం అత్యధికంగా ఒకటి రెండు వర్ణాల చేతనే రాయబడింది. మిగతవర్గాలు చదువుకు దూరంగ ఉన్నారు కాబట్టి. ఇప్పుడు కొందరి కృషివల్ల అందరు చదువును అందిపుచ్చుకుంటున్నారు. ఇప్పుడు తండ్రితాతలు చేసిన వృత్తిని రాసుకోవాల్సిన అవసరం ఉంది. రాయాలి. అణచివేసిన వారే తిరిగి వారి చరిత్రను రాసే వరకు చూడకూడదు.




ప్రతి బీసీ దళితుల వృత్తులకు ఒక చరిత్ర ఉంది. సకల సౌలభ్యాలను, సుఖాలను అందించిన ఘనత ఉంది. వృత్తికారుల, కులాల ఔన్నత్యాన్ని, శ్రమను ఊరూర గానం చేసారు. వారిని వీరి ఆశ్రిత కులంగా పిలిచారు. ఆశ్రిత గాయకుల, ఆశ్రిత కులాల వారి దగ్గర మౌఖికంగా ఉన్న చరిత్ర అంతా అక్షరబద్ధం చేసుకోవాలి. వారు వాస్తవ జీవితాలను గానం చేసారు. వారిని పోషిస్తున్న వృత్తి కులాలలో గల వీరులను, సాహసాలను, త్యాగాలను, వృత్తి చతురతలను ఎందరికో వినిపించారు. ఒక విధంగా వారు గొప్పవారు. వారిని పోషిస్తున్న వర్గాన్ని వృత్తులను నోరారా ప్రచారం చేసారు. వృత్తి కులాలలో పుట్టి, చదువుకుని వారి పూర్వీకులను, ప్రస్తుత అస్తిత్వాన్ని రాయని వారికంటే ఆశ్రితులు మేలు. అందులో కవులు, రచయితలు, విమర్శకులు, పరిశోధకులుగా రాణిస్తున్న వారందరూ ఎంతో కొంత వారు ఎదిగొచ్చిన మూలాలను గురించి రాయకపోవడం కంటే దుర్మార్గం, మోసం మరొకటి లేదు. ప్రక్రియ ఏదైనా రాయడం ముఖ్యం. ఇప్పటివరకు బీసీ దళిత వృత్తి జీవితాలను గురించి కథ కొంత వరకు వచ్చింది. కవిత్వం మాత్రం అంతగా రాలేదు. ఈ రెండింటిలో దళిత కవిత్వం వచ్చినంతగా బీసీ కవిత్వం రాలేదు. కొందరి మాటలకు 'వెంటాడే కలాలు'తో 2001లో ధైర్యం చేస్తే తర్వాత "సమూహం, బి.సి. కవిత్వం" అనేవి రెండు దశాబ్దాల కాలంలో రెండు సంకలనాలువచ్చాయి. "రుంజ, కుంపటి, అసిపె" వంటివి రెండు మూడు ఒకే కులవృత్తికి సంబంధించిన కవిత గ్రంథాలు కన్పిస్తున్నాయి. మళ్ళీ ఇంతకాలం తర్వాత బహుజన వృత్తి కవిత్వం "కశ్పి" పేరుతో అవుసుల భానుప్రకాశ్ (అన్న) తీసుకురావడం ముదావహం. గౌరవనీయం.

అవుసుల భానుప్రకాశ్ నిత్య కాంతిమంతుడు. బహుముఖీనమైన కార్యక్రమాలతో, రచనలతో ప్రతిభా ప్రకాశాన్ని వెదజల్లుతున్న భానుడు. కొన్ని వర్గాల వారికే పరిమితం అనుకున్న అవధానాన్ని అధ్యయనం చేసి అందులో ఆరితేరినాడు. పద్యం వారి హృద్యం. రకరకాల పద్యాలతో, వివిధ అంశాలపై తాను రాస్తూ, రాయిస్తూ పద్యకావ్యాలు, సంకలన గ్రంథాలు తీసుకొచ్చారు. రుబాయిలు, శతకాలు, వచన కవితలు, గేయాలు, తత్త్వాలు, సాహిత్య చరిత్రలు, వ్యాసాలు, ఈ మధ్య కాలంలో తెచ్చిన మరో కొత్త ప్రయోగం "ట్రెండింగ్ పద్యాలు" వరకు వైవిధ్యమైన ప్రక్రియలతో పుస్తకాలై పూస్తున్నాడు. పరిమళిస్తున్నాడు. వారి రచనలలో ప్రధాన ఆత్మ భారతీయత, తెలంగాణీయత, దేశభక్తి, దైవభక్తి, ప్రకృతి పరిరక్షణ, ఆరాధనలో వివిధ అస్తిత్వాల స్పృహలతో నిరంతరం రాస్తున్న అక్షర శిల్పి. ఇప్పుడు బహుజన వృత్తుల మీద వచన కవిత్వాన్ని రాసి బాధ్యతను నిరూపించుకున్నారు.

ఈ సంపుటిలో మొత్తం 24 కవితలున్నాయి. చివరి కవితను గురించి ముందుగా మాట్లాడుకోవాలి. అది "సబ్బండ వర్ణాలొక్కటైతే..." ఈ సంబండ వర్ణాలంటే ప్రధానంగా బీసీలు, సాహిత్యంలో దళిత, మైనారిటీ వాదాలు పుంజుకుంటున్న సమయంలో బీసీలు కొంత అస్తిత్వ కవిత్వం రాయడం మొదలుపెట్టారు. దాని పేరు బీసీకవిత్వం అన్నారు. అంటున్నారు. అప్పుడు మరొక వాదంవారు బీసీకవులకు ఒక సరైన పేరు పెట్టుకోవడం కూడా చేతకాదు అన్నట్లుగా హేళన చేస్తూ రాశారు. అప్పుడు బీసీ పెద్దలు కొందరు ఏకమై సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశమయ్యారు. వారంతా కలిసి నిర్ణయించిన పేరు 'సబ్బండ సాహిత్యం'. బీసీ అనే ఆంగ్ల అక్షరాలు అయినప్పటికీ, అందరికీ తెలిసినవని వాడుతున్నారు. కవి ఆ స్పృహతోనే చివరగా ఈ కవితతో ముగిస్తాడు. ఇదే కవితలో అందరు ఏకమై 'ఉప్పెనగా ఎగసి ఉక్కుపిడికిలిగా కలివిడిగా నిలబడే రోజొకటి వస్తుంది' అని ఆశావహదృక్పథాన్ని వ్యక్తం చేసాడు. వృత్తికారులనందరిని దేశభక్తులు అంటాడు. వీరే దేశ వైభవాన్ని సమున్నతంగా నిలబెడుతున్నావారని కవి భావన. వృత్తివర్గాల వారిని మోసం చేస్తూ వారిమీద పెత్తనం చేస్తే పనిముట్లను ఆయుధాలుగా మలుచుకోవల్సి వస్తుందని హెచ్చరించాడు. ఈ కవిత ద్వారా రచయిత జాతీయ భావాన్ని అంచనా వేయవచ్చు. అట్లాగే అధికారులకు, పెత్తందారులకు వారు వృత్తి వర్గాల పక్షాన చేసిన హెచ్చరిక హర్షణీయం.

ఈ కావ్యంలో ప్రతి కవితకు పెట్టిన శీర్షికతో కవికి వృత్తికారుల పట్లగల గౌరవాన్ని, అభిమానాన్ని, పూజనీయ భావాన్ని తెలుపుతాయి. 'స్వర్ణకారుడా జయహో', 'పాదరక్షకుడా ప్రణతి', 'కొలిమికారుడికి కైమోడ్పు' అంటూ ప్రతిశీర్షికలో కవితాత్మకమైన వినయాన్ని ప్రదర్శిస్తాడు.విశ్వబ్రహ్మలుగా పిలువబడే ఐదు రకాల వృత్తులను అనుభవపూర్వకంగా చిత్రించన తీరు స్పష్టపడుతుంది. కట్టె, రాయి, ఇనుము, బంగారం, ఇత్తడి, ఇతరలోహాలలో తీరు ఒడాలను చిత్రించే ఆ విశ్వకర్మల వృత్తిని, వారి జీవితాలను, అప్పటి వైభవాన్ని,- ఇప్పటి 1. ఐదు కవితలలో సౌందర్యవంతంగా పొదిగారు. వారు ఉపయోగించే వస్తువులు, దీనత్వాన్ని దీనవి, కొలతలు భానుప్రకాశ్ కవితలలో తప్ప మరో కవి కవితలలో చూడలేం. వీరు ప్రత్యక్షమ పరిచయంతో రాసిన వాక్యాలివి. అవుసుల వృత్తికారున్ని ఔన్నత్యాన్ని పనిచతురతని, ప్రతి స్త్రీకి కాలు మట్టెనుండి మెడలో పుస్తెవరకు మెరిపించి, సంతోషాలను కురిపించిన తీరులను గమనించవచ్చు. ఇప్పుడు వారు ఎదుర్కొంటున్న కష్టాలను, వారి జీవితాలను దెబ్బతీసిన పెట్టుబడిదారులను కూడా వదలకుండా కవిత్వీకరించాడు. 'కిలోల కొద్దీ నగలు చేసిన ) టన్నులకొద్దీ పేదరికం అతనివెన్నంటే!/ నగలు బాగున్నాయన్న నోళ్ళనుండి / పిసరంత భరోసా శూన్యం...'. ఆ వృత్తిని నమ్ముకున్న వారు కూడగట్టుకున్న పేదరికాన్ని, వారికి ఇతరులు అందిస్తున్న భరోసాని నాలుగు పాదాలతో హృదయాలలోకి విసిరాడు. 'ఎంత వేడెక్కించాలో తెలుసాయనకు!/ ఎంత చల్లబరచాలో కూడా తెలుసాయనకు! / రంగును బట్టి కాకను చెప్పే / సజీవ థర్మామీటరాయన!'. ఎలక్ట్రానిక్ పరికరాలు చేసే పనికంటే కూడా కౌశలంగా పనిచేసేవారు. ఆ లోహాల మర్మం, ధర్మం పసిగట్టిన ప్రతిభామూర్తులు వారు. 'ఆయన చెవిలోంచి పెన్సిల్ తీశాడా / చెక్క కళాకృతికి మారుతున్నట్లు!/ లెక్కకందని ప్రతిభ ఆయనది!' అంటూ వడ్రంగి వృత్తికారుని ప్రతిభతో పాటు, పడుతున్న కష్టాలను కూడా తన కవిత ద్వారా కండ్లముందుంచుతాడు.

మట్టిని మర్లేసి పంటను పండించే వృత్తి ఒకటి. ఆ పంటను ఉడికించుకుని తిండిగా మార్చడానికి పాత్రలుచేసే వృత్తి మరొకటి. వారు కూడా మట్టిని పిసికేవారే. మట్టికి మనిషికి ఎంతటి విడదీయరాని సంబంధం ఉందో, కుండతో కూడా అంతే, కవి చెప్పినట్లు 'కూన పెంకల నుండి కంచుళ్ళదాకా.... ' ఇంటిని నీటినుండి రక్షించే పెంక మొదలుకొని ఒంట్లోకి నీరునింపే గురుగుల వరకు. పచ్చికుండను పసిబిడ్డతో, కుమ్మరన్నను తల్లితో పోల్చిన తీరు. అమోఘం. మట్టిలో కుండను ఊహించిన దార్శనికునికి జీవితానికి ఇప్పుడు భరోసానివ్వాల్సిన బాధ్యతుంది. అప్పుడు సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. అందరికీ మెతుకులు పెట్టే రైతన్న ఆత్మహత్య చేసుకునే పరిస్థితిలో దేశం ఉన్న తీరును కవితా పంక్తులలో అందంగా అందించాడు.

కవిలో వున్న కళ కవితలో అవిష్కృతమౌతుందనడానికి 'చాకలమ్మకు జేతు సన్నుతి! కవితే నిదర్శనం. 'ఏ యింటి బట్టలను ఆ యింటికే చేర్చే వస్త్రావధాని చాకలమ్మ ' అంటారు. చాకలమ్మును సాహిత్య ప్రక్రియతో పోల్చిన కవి ఎవరూ కనిపించరు. ఈ కవి అవధాని కాబట్టి ఈ చాకలమ్మలో అవధానత్వాన్ని చూడగలిగాడు. చాకలి వృత్తివారు బట్టలుతకడానికి పరిమితం కాకుండా 'శుభమైనా అశుభమైనా / కౌటుంబిక సంస్కృతిలో మన జీవనవిధానంలో / చాకలమ్మ అంతర్భాగం' అనడం కవికున్న సమానత్వభావననుతెలియజేస్తుంది. మరో సేవక వృత్తి అయిన మంగలి పనిని కళాత్మకమైన కవితతో మనముందుంచాడు. క్షౌరవృత్తే లేకుంటే మానవులకు జంతువులకు మధ్య ఆకారంలో పెద్ద తేడా ఉండేది కాదేమో. వెంట్రుకలను, గోర్లను కత్తిరించడంతో పాటు వారు నిర్వహించేసాంస్కృతిక సేవను గుర్తుచేస్తాడు. 'ఎందరి ముఖాలకో / తను దర్పణమై వెలిగినా/ ఆయన జీవితమెప్పుడూ / పగిలిన అద్దమే!!' అనే ముగింపు వాక్యాలతో పాఠకులను కదిలిస్తాడు కవి. మానవ సంస్కృతికి మొదటి మెట్టు వస్త్రధారణ. ధరించే వస్త్రాల వల్ల విద్యార్థిని, గురువును, నాయకుడిని, భిక్షకుడిని, సన్యాసిని పసిగట్టవచ్చు. కొన్నిసార్లు ప్రాంతాలను కూడా. కట్టని వాడిని పిచ్చివాడి కింద లెక్క చేస్తారు. ఆ వస్త్రం ప్రపంచ శీలాన్ని కాపాడుతున్న నేతన్న స్థితిగతులకు అద్దం పట్టే కవిత 'నేతన్నకు నతులివే'. 'అద్భుత సంస్కృతినంతా / అందంగా చీరలపై దిద్దితీర్చినా / తన జీవితాన్ని మాత్రం / లుంగీ బనీనుతోనే గడిపేస్తాడు'. అన్ని రకాల వృత్తికారులు వారి ఉత్పత్తి చేసే వాటిని వారు సంతృప్తిగా వాడే రోజు ఏనాడు రాలేదు. రాదేమో. రావాలి. కాలానికనుగుణంగా అందిపుచ్చుకోవాలి. నేతన్నల అనుబంధ వృత్తి 'మేర'. అంగాలకు తగ్గ అంగీలకు కత్తిరించి, అతికించి అందించే కళాకారుడు. 'ఆయన బొటన వేలిచివర / పడ్డ గాటునడుగండి / కాయగాసి ఆయన శ్రమకు / సంతకమై కనిపిస్తుంది!' అన్నట్టు వారి పనిలో అవయవాలనే తాకట్టుపెడుతాడు. మేరకారుని వేలిచివర పడ్డ గాటును పట్టుకున్న కవి సమాజాన్ని ఎంత సూక్ష్మంగా పరిశీలిస్తున్నాడో అంచనవేయవచ్చు.

'కాలం మారినా వారిన జీవితగతి మారలే!/ వారు బండలను కరిగించగలరేమో / గుడిబండలా మారిన / దైనందిన కష్టాలను దూరం చేసుకోవడంలో వైఫల్యమే!' అంటూ 'బండబారిన బ్రతుకులు' కవితలో ఒడ్డెరుల జీవితాలను చిత్రించాడు. మత్స్యకారుల జీవితాలను ఊహించడానికి కవితా శీర్షిక చాలు. అది 'చెరువులోంచి బయటపడ్డ చేపలు'. దొమ్మరుల విన్యాసాలను, దుస్థితిని, చులకన భావాన్ని తెలుపుతున్న కవితను కూడా గమనించవచ్చు.

సమాజానికి పౌష్టికాహారాన్ని అందిస్తూ, పాలుపెరుగుతో ఆరోగ్యాలను చక్కబరిచే వృత్తికారుడు కాపరి. వారి జీవితమంతా అడవిమయం. మాంసాన్ని, ఉన్నిని, పాలుపెరుగులను అందిస్తూ... తన మాంసాన్ని కరిగించుకునే వాడు. మూగజీవాలనే చెలికాండ్లుగా మలచుకుని తన భాషను సైతం కొత్తగా సృష్టించుకున్న జీవితత్యాగైన యోగి. అట్లాంటి యాదవుల రూపురేఖలను, అలంకార, ఆకారాలను, కళలను, కన్నీళ్ళను పట్టించే కవిత 'గొల్లమల్లన్నకు శణార్తి!'. 'మందబలం ఆయన బలం / మందిబలం ఆయన బలగం / అయినా బలహీనంగానే / బ్రతుకు వెళ్ళదీస్తున్న / గొల్లకురుమన్న! అనే పంక్తులతో యాదవుల జనాభా శాతాన్ని, వారి దామాషా ప్రకారం వారనుభవించలేకపోతున్నరాయకీయాన్ని గుర్తుచేస్తున్నాడు. అదే గౌడుల గురించిన రాసిన కవితలో మాత్రం 'ప్రజా సేవలో అంతెత్తున / రోజూ నిలబడే గౌండ్లాయన / నిజ జీవితంలో మాత్రం / ఏ మాత్రం ఉన్నతంగా ఎదగడే!' అంటాడు. యాదవ వృత్తిమీద ఆధారపడే కటికవృత్తి కష్టాలను కూడా కవిత్వీకరించాడు.

ఒక పెద్ద చెత్తిరి కింద చెప్పులు కుట్టే వృత్తికారుని జీవితం ఎంత దయనీయంగా ఉంటుందో తెలిపిన కవిత 'పాదరక్షకుడా ప్రణతి!' ఇందులో చెప్పుల గొప్పతన్నాన్ని అదే చెప్పు తెగితే పడే కష్టాలను, అది అతికించుకోవడానికి పోయి డబ్బుదగ్గర పడే ధనవంతుని కక్కుర్తిని కండ్లముందుంచాడు. చెప్పులు కుట్టిన చర్మంతోనే డప్పులు చేసి దరువులు వేయించే కళాకారుడికి దండాలు పెట్టాడు. డప్పొకటే మనిషి కష్టసుఖాలకు. దానిచే పలికించే ధ్వనులు పలురకాలు. చిన్నాపెద్దా కార్యాల నుండి కాటివరకు అన్నింటిలో అదే భాగమైంది. అందుకే కవి 'సంస్కృతికి చిరునామా డప్పుల దరువు!' అంటాడు.

అతితక్కువ కవులు స్పృశించిన వృత్తులను కూడా భానుప్రకాశ్ హృద్యంగా వర్ణించాడు. అవి 'మ్యాదరి, ఎరుకల, బైండ్ల'. వెదురును మలిచి కళాత్మకంగా ఎన్ని వస్తువులను సమాజానికి అందిస్తాడో కాని వారి జీవితాలు మాత్రం ఎప్పుడు కళదప్పి సాగిస్తుంటారు. ఎరుకలు అంతే. 'బైండ్లోళ్ళ జీవితాలు / ముండ్ల తీగలమీద / ఆరేసిన బట్టలాగే!' అంటూ వారి జీవితాలను చూపిస్తూ 'బడుగుల పూజారికి భరోసానిద్దాం!' అంటూ కవి ప్రేరణను కలిగిస్తున్నాడు. ఇందులోని ప్రతీ కవితా చరిత్రను గానం చేస్తుంది. సంస్కృతికి అద్దం పడుతుంది. పాఠకుడిని గతంలోకి పట్టుకెళ్ళి అప్పటి వైభవాన్ని చెప్తూ మురిపించి, వర్తమానాన్ని చూపెడుతూ ఆలోచనకు గురిచేస్తుంది. వృత్తికారుని అంకితభావాన్ని, అమాయకత్వాన్ని తెలియజేస్తూనే పెట్టుబడిదారుల తీరును ప్రపంచీకరణ ప్రభావాన్ని మన ముందుంచుతుంది. వీటిని చదవడం వల్ల వృత్తికారులను ఆదరించాలనే జాలిని కలిగిస్తాయి. కొన్ని వృత్తులకారులకు ప్రత్యామ్నాయాన్ని కనిపెట్టాలనే ఆలోచనను రగిలిస్తాయి.

-డా.అట్టెం దత్తయ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఢిల్లీ యూనివర్సిటీ
94947 15445

# వ్యక్తిని విజేతగా మార్చే అంతర్గత శక్తి

జీవితాన్ని ప్రేమించినప్పుడే జీవన మాధుర్యాన్ని అనుభవించగలం. జీవితాన్ని ద్వేషించే వానికి అందరూ తనలాగే ద్వేషులుగా, విరోధులుగా కనిపిస్తారు. అందుకే జీవితాన్ని ఎప్పటికీ ద్వేషించకూడదు. అలా ద్వేషించిన వాడికి అందరూ శత్రువులే మిగులుతారని అంటాడు ప్రఖ్యాత ఆంగ్ల నాటక కర్త జార్జ్ బెర్నాడ్ షా... జీవన విపంచిని శ్రావ్యంగా శృతి చేయాలంటే.. ముందుగా వ్యక్తి తనలో ఉన్న అంతర్గత శక్తిని తాను తెలుసుకొని, దానిని ప్రయోజనాత్మకంగా వినియోగం చేసుకోవాలి. మనలో ఉన్న శక్తి ఎంత? అని, నిరుత్సాహపడుతున్నారా? మర్రి విత్తనంలో మహావృక్షం ఎలా దాగి ఉందో, మనలోనూ అలాగే అనంతమైన శక్తి దాగి ఉంది. ఈ సమస్త సృష్టికి ప్రాణ ప్రకాశ తేజాన్ని అందించేది మీ యొక్క దేదీప్యమానమైన అంతర్లీనంగా ఉన్న శక్తి, మీలోని మహా ప్రతిభయే.. అంటూ వేదాలు ఘోషిస్తున్నాయి.

ప్రచండ వేగంతో సాగిపోయే జీవితంలో ఆందోళనలకు సంఘర్షణలకు ఎదురు నిలిచి మరింత వేగవంతమైన చైతన్యవంతమైన పురోగతిని సాధించే అద్భుతమైన సామర్థ్యం వ్యక్తిలో ఉంది అట్టి మహాశక్తి ప్రవాహాన్ని సరియైనదారులలో మళ్లించడమే ప్రతి వ్యక్తి చేయవలసిన పని. ప్రతి వ్యక్తిలో పంచ మహాశక్తులు ఉన్నాయని శాస్త్రాలు చెబుతున్నాయి. అవి: 1) సృజనాత్మక శక్తి, 2) యోచనా శక్తి, 3) సహన శక్తి, 4) నిర్మాణాత్మక శక్తి, 5) ప్రేమ శక్తి. ఈ శక్తుల గురించి కొంత ఆలోచిద్దాం!

**సృజనాత్మక శక్తి:**
చుట్టూ ఉన్న ప్రపంచాన్ని పరిశీలిస్తే, మానవుని సృజనాత్మక శక్తి మానవ జీవిత గమనంలో ఎన్నెన్ని అద్భుతాలను సాధించిందో తెలుస్తుంది. మనో బుద్ధులు సృజనాత్మకంగా ఉండాలంటే సంకల్ప శక్తిని పెంచుకోవాలి. మనో మందిరాన్ని నిర్మలంగా మార్చుకోవాలి. ఉపయోగకరమైన భావాలను పెంచుకోవాలి. సంకల్పశక్తిని సృజనాత్మకంగా అభివృద్ధి మార్గంలో నడిపించినపుడు యోచనా శక్తి మన వశం అవుతుంది.



**యోచనా శక్తి:**
యోచనా శక్తి ని వృద్ధి చేసుకోవాలంటే జీవితాన్ని ఎంతగానో ప్రేమించాలి. అలాగని కాలాన్ని వృధా చేయరాదు. కాలగర్భంలోనే జీవన సుగంధం దాగి ఉందనే విషయాన్ని మనమందరం గమనించాలి. రాతి యుగం నుండి ఆధునిక యుగం వరకు క్రమ వికాసం పొందుతూ వచ్చిన మానవుని నిర్వహణ చాతుర్యం యోచనా శక్తి పై ఎలా ఆధారపడి ఉన్నదో విపులంగా అర్థం చేసుకోవాలి. చూచే వాటిని, వినే వాటిని, చదివే వాటిని సక్రమంగా విశ్లేషించుకుంటూ విశ్వాస భావంతో, దురభిమానం లేకుండా, లోపాలు తెలుసుకుంటూ, శాంతంగా యోచించగలగాలి. ప్రపంచ ప్రగతి యావత్తు యోచనాపరుల ఉన్నత ఆశయాల మీద, ఉదాత్త భావ సంపద మీద ఆధారపడి ఉంటుంది అన్న పెద్దల మాటలను మనం మరువరాదు.

**సహన శక్తి:**
ఈ సహన శక్తి వలన మంచి ఫలితాలను అతి తేలికగా పొందవచ్చునని అనుభవజ్ఞులు అంటున్నారు. అందరి భావాలు ఒకటిగా ఉండవు. మన భావాలు మన కెంత ప్రీతికరమైనవో, ఇతరుల భావాలు కూడా వారికి అంతే ప్రియమైనవి కదా! ఇతరుల పట్ల అసమ్మతిని ప్రకటించకుండా, వాదోపవాదాలకు దిగకుండా, సమ్మతి స్వభావాన్ని పెంచుకుంటూ, అందరినీ పరిశీలిస్తూ అందరి నుండి అనేక విషయాలను నేర్చుకోవాలి. అతిశయం లేని సామాన్య జీవితంలో నీపై నీవు నమ్మకంతో అతి సామాన్య జీవితం గడుపుతూ ఎంతో తృప్తిగా సౌజన్యంగా ఉండటం అనే విషయం మనను అత్యున్నత స్థానంలో నిలబెట్టగలదు.

**నిర్మాణాత్మక శక్తి:**
జీవితంలో విజయ పథానికి అవసరమైన సకారాత్మకమైన ధన భావ తరంగాలతో కూడిన నిరంతర పరిశ్రమతో నేర్పును సామర్థ్యాన్ని నిర్మాణాత్మక శక్తిని వృద్ధిపరుచుకోవాలి. మనిషిని ఉద్యమింపజేసేవి ధైర్యం, పౌరుషం, బలం. పిరికితనం దౌర్బల్యం లోపాలే కాదు అవి మహా పాపాలు కూడా. " నేడు సమస్త మానవజాతి నేర్వ వలసింది నిర్భీతి అనే మహా ధర్మం." అన్నారు స్వామి వివేకానందుల వారు. ఈ సమస్యలు కలకాలం ఉండవు. సమస్య సమర్థతకు వన్నెపెడుతుంది. సమస్య రహితమైన జీవితం నిస్సారమైనది. నిరర్థకమైనది. సమస్యలను ఎదుర్కోవటంలో ధైర్యం అనే మహా ధర్మాన్ని అనుసరిస్తే శక్తి ప్రవాహ వినియోగంలో పూర్తిగా సఫలం కాగలం.



**ప్రేమ శక్తి:**
ద్వేష శక్తి కంటే కోట్లాదిరెట్ల ఘనతరమైనది ప్రేమ శక్తి. కర్మ కుశలతను దేదీప్యమానం చేస్తూ మన పాత్ర నిర్వహణలో మనను సఫలం చేయగల మహోన్నత శక్తి ప్రేమ శక్తి. ఈ ప్రేమ శక్తిని భగవంతుడు మనకు సహజంగానే అందించాడు. యావత్ ప్రపంచము ప్రేమ శక్తి ముందు తలను వంచి మోకరిల్ల వలసినదే. క్షుద్రమైన చింతలతో, భయాందోళనలతో, ఆత్మ గౌరవాన్ని కోల్పోరాదు. అనంతమైన మనలో దాగిఉన్న అంతర్గత శక్తిని వెతికి వెలికి తీసి, మన విద్యుక్త ధర్మాలకు వినియోగించాలి. అప్పుడే మనం మన జీవితంలో అఖండ విజయాలను పొందగలం. సనాతన ధర్మం కూడా ఇదే ఆచరించమని ఆదేశిస్తుంది. ఈ విషయాన్ని అందరం గమనిద్దాం! జీవితాన్ని సఫలం చేసుకుందాం!



"సాహిత్య కళా విభూషణ"
- చౌడూరి నరసింహారావు
సాహిత్య, సామాజిక విశ్లేషకులు
చరవాణి:9705100788

## పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**విశ్వంభర, హైదరాబాద్:** కూడు,గూడు గుడ్డ, రీబీ హటావో నినాదంతో ఇందిరమ్మ పేదల గుండెల్లో కొలువైందని, అట్లాంటి ఇందిరమ్మ పాలనలో పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వడమే ఈ ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ఆదివారం మినిస్టర్ క్వార్టర్స్ లో తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఉద్యోగుల డైరీ & క్యాలండర్ ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వచ్చే నాలుగు సంవత్సరాలలో దశల వారీగా రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందని, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగులు పనిచేయాలని సూచించారు. పేదలకు ఇండ్లు నిర్మించే హౌసింగ్ శాఖను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని, ఆ విభాగాన్ని మూసివేసి ఉన్న ఉద్యోగులను ఇతర శాఖలలో విలీనం చేసిందని. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క అడుగు వేస్తూ ఈ శాఖను పునరుద్ధరించి లబ్దిదారుల ఎంపిక నుంచి ఇండ్ల నిర్మాణం, పర్యవేక్షణ వరకు అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకుందని అన్నారు. 326 మంది ఉద్యోగులను తిరిగి నియమించడం ద్వారా హౌసింగ్ కార్పొరేషన్‌ను బలోపేతం చేశామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పే దవారి జీవితంలో వెలుగులు నింపేందుకు ఈ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆరు గారెంటీలు పథకాలలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లక్షలాది మంది నీడలేని పేదలకు ఐదు లక్షల రూపాయల స్కీమ్ తో పక్కా గృహాలు నిర్మించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది అని దానికి గృహనిర్మాణ సంస్థ సిబ్బంది పూర్తిగా సహకరించాలని, మరింత కష్టపడి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వ రవీందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొగ్గుల వెంకట రామిరెడ్డి, సేనియర్ నాయకులు కంది రవీందర్ రెడ్డి వైస్ ప్రసిడెంట్ భాస్కర్ రెడ్డి, కుమార్, రమేష్, రఘు, లింగయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ జిల్లాలో ప్రమాదం..

**విశ్వంభర, ఎదులాపురం:** ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మాలేపూర్ ఘాట్‌లో యాత్రికులు ప్రయాణిస్తున్న వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 47 మంది యాత్రికులకు గాయాలయ్యాయి. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108, ప్రైవేటు వాహనాల్లో వాహనాల్లో రిమ్స్, నార్నూర్, ఉట్నూర్ ఆసుపత్రులకు తరలించారు. భక్తులు కెరమెరి మండలంలోని జంగుబాయి ఆలయానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో వాహనంలో మొత్తం 60 మంది భక్తులు ఉన్నారు. వీరిని గుడిహత్నూర్ మండలం సూర్యగూడ గ్రామ ఆదివాసీలుగా గుర్తించారు.

## నిష్పక్షపాతంగా లబ్ధిదారుల ఎంపిక

**విశ్వంభర, ఖమ్మం:** రేషన్ కార్డులకు ఇంకా ఎలాంటి లిస్ట్ తయారు కాలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఏ లిస్ట్ అయినా గ్రామాల్లోనే తయారవుతుందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులో ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. జనవరి 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు.రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు ఇస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలందరి సమక్షంలోనే నిష్పక్షపాతంగా, పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని చెప్పారు. వ్యవసాయ యోగ్యమైన భూములకు ఎలాంటి షరతులు లేకుండా ఎకరానికి రూ.12 వేలు ఇవ్వబోతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. భూమి లేని నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పారు. ఈ నెల 26 నుంచి మొదలుకానున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామసభల్లో నిష్పక్షపాతంగా ఎంపిక చేస్తారని పునరుద్ఘాటించారు.

## పంతంగి టోల్‌ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

**విశ్వంభర, హైదరాబాద్:** సంక్రాంతి సెలవులు ముగిశాయి. పండుగకు సొంతూళ్లకు వెళ్లిన వారంతా తిరుగు పయనమవుతున్నారు. దీంతో విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై రద్దీ నెలకొంది. వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. చౌటుప్పల్ సమీపంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. సాధారణంగా ఈ టోల్ ప్లాజా మీదుగా రోజుకు దాదాపు 36 వేల వాహనాలు ప్రయాణం సాగిస్తుంటాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఈనెల 9 నుంచి ఇవాళ్టి వరకు ప్రతిరోజూ 70 నుంచి 80 వేల వాహనాలు రాకపోకలు సాగించినట్లు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెబుతున్నారు. సోమవారం కూడా రద్దీ కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**కిటకిటలాడుతున్న విజయవాడ బస్టాండ్, రైల్వే స్టేషన్..**

సంక్రాంతికి వచ్చి తిరిగి వెళ్లే ప్రయాణికులతో విజయవాడ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో రద్దీ నెలకొంది. రద్దీ దృష్ట్యా ఆర్టీసీ అధికారులు పలు ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. విజయవాడ నుంచి ఇవాళ 133 అదనపు బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. సంక్రాంతి అదనపు బస్సుల్లో సాధారణ ఛార్జీలే వసూలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. అదనపు బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సదుపాయం ఉందని ఆర్టీసీ తెలిపింది.

## కాంగ్రెస్ పార్టీకి అది వెన్నతో పెట్టిన విద్య.. కేటీఆర్ సెటైర్లు

**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలకు ఢిల్లీలో ఆ పార్టీ అనుసరిస్తున్న వైఖరే సజీవసాక్ష్యమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అవసరం ఉన్నప్పుడు ఒకలా, అవసరం తీరిపోయాక మరోలా వ్యవహరించడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆప్ అధినేత అర్వింద్ కేజ్రీవాల్ పట్ల ప్రదర్శిస్తున్న వైఖరికి, పార్లమెంటు ఎన్నికల సమయంలో ఇండియా కూటమిలో ఉన్న అదే కేజ్రీవాల్ పట్ల కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వైఖరిని పరిశీలిస్తే అది తెలుస్తుందని తెలిపారు.నిన్నటిదాకా సత్యసంధుడు, వివేకవంతుడు, నీతిమంతుడిగా కనిపించిన కేజ్రీవాల్‌లో ఉన్నపళంగా నేడు అవినీతిపరుడిగా, చెత్తనాయకుడిగా కనిపిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. రాజకీయాల్లో ద్వంద్వ ప్రమాణాలు పాటించే విషయంలో కాంగ్రెస్ పార్టీ ఒక పాఠ్యపుస్తకమని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ తమకు ఇచ్చిన హామీలు అమలు కోసం ఏడాది కాలంగా తెలంగాణలోని విద్యార్థులు, రైతులు, వృద్ధులు, మహిళలు ఏడాదికాలంగా నిరీక్షిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు ఢిల్లీలో కూడా కాంగ్రెస్ పార్టీ అవే తరహాలో హామీలను ప్రజలకు ఇస్తుందని మండిపడ్డారు. ఢిల్లీ ఓటర్లను మోసం చేయడానికి ముందు తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలతో మాట్లాడి, వారి అనుభవాలను తెలుసుకోవాలని సూచించారు.

# హైదరాబాద్‌కు పెట్టుబడుల పంట

**మొదటిపేజీ తరువాయి**

సీఎంవో స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి, క్యాపిటల్ ల్యాండ్ తరఫున ఇండియా ట్రస్ట్ మేనేజ్మెంట్ సీఈవో గౌరీ శంకర్ నాగభూషణం, సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ కియాతానీ తదితరులు పాల్గొన్నారు. క్యాపిటల్ ల్యాండ్ చేపట్టే కొత్త ఐటీ పార్కు హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలు రాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయ పడ్డారు.. క్యాపిటల్ ల్యాండ్ నిర్ణయాన్నిస్వాగతించారు. బ్లూ చిప్ కంపెనీలు కోరుకునే ప్రీమియం సదుపాయాలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల కు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేలా అన్ని సౌకర్యాలను ఈ ఐటీ పార్కులో అందుబాటులో ఉంటాయన్నారు ఈ సందర్భంగా గౌరీ శంకర్ నాగభూషణం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ అన్ని రంగాల్లో సుస్థిరంగా వృద్ధి చెందుతోందని, తమ సంస్థ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించటం ఆనందంగా ఉందని అన్నారు. క్యాపిటల్ ల్యాండ్ సంస్థ ఇప్పటికే హైదరాబాద్ లో అంతర్జాతీయ టెక్ పార్క్ , అవాన్స్ హైదరాబాద్, సైబర్‌పెర్ల్ పార్కులను చేపట్టింది. గతంలో ఈ సంస్థ ప్రకటించిన 25 మెగావాట్ల ఐటీ లోడ్ డేటా సెంటర్ ఈ ఏడాది మధ్యలోనే అందుబాటులోకి వస్తుంది. ఐటీపీహెచ్ రెండో దశ ఈ ఏడాదిలో ప్రారంభమై 2028 నాటికి పూర్తి కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం మూడు రోజుల సింగపూర్ పర్యటన విజయవంతంగా ముగిసింది. అక్కడ నుంచి ఆదివారం రాత్రి సీఎంతో పాటు



మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు దావోస్ కు బయిల్దేరారు. సోమవారం దావోస్ కు చేరుకుంటారు. అక్కడ నాలుగు రోజుల పాటు జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. ప్రపంచ వేదికపై తెలంగాణకు ఉన్న అనుకూలతలను చాటి చెప్పి హైదరాబాద్ ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్య స్థానంగా పరిచయం చేసే భారీ లక్ష్యంతో రాష్ట్ర ప్రతినిధి బృందం దావోస్ పర్యటనకు వెళ్లింది. సింగపూర్ పర్యటన విజయవంతం కావటంతో దావోస్ సదస్సుపై భారీ అంచనాలు పెట్టుకుంది. చివరి రోజున సింగపూర్ పర్యటనలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అక్కడి ప్రధాన వ్యాపార సంస్థల అధినేతలు, సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ ప్రతినిధులతో ముఖాముఖి సంభాషణలు, చర్చలు జరిపింది. ఇండియన్ ఓషన్ గ్రూప్ ఫౌండర్, సీఈవో ప్రదీప్తో బిశ్వాస్, డీబీఎస్ కంట్రీ హెడ్ లిమ్ హిమ్ చౌన్, డీబీఎస్ గ్రూప్ హెడ్ అమిత్ శర్మ, బ్లాక్ స్టోన్ సింగపూర్ సీనియర్ ఎండీ, ఛైర్మన్ గౌతమ్ బెనర్జీ, బ్లాక్ స్టోన్ రియల్ ఎస్టేట్ సీనియర్ ఎండీ పెంగ్ వీ టాన్, మెయిన్ హార్ట్ గ్రూప్ సీఈవో ఒమర్ షాజాద్ తో చర్చలు జరిపింది. హైదరాబాద్ లో పెట్టుబడులు ఉన్న అవకాశాలు, ప్రభుత్వ విధానాలను వారికి వివరించారు.

**విజయవంతమైన సింగపూర్ పర్యటన**

సింగపూర్లో మూడు రోజుల పాటు రాష్ట్ర ప్రతినిధి బృందం బిజీ బిజీగా గడిపింది. వివిధ రంగాల్లో పేరొందిన ప్రపంచ స్థాయి సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కీలక చర్చల్లో పాల్గొంది. ఆశించిన పెట్టుబడుల ఒప్పందాలతో పాటు సింగపూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐటీఈ)తో తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరస్పర అవగాహన కుదుర్చుకోవటం కీలక పరిణామం. హైదరాబాద్ లోని ఫ్యూచర్ సిటీలో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్ ఏర్పాటుకు ఎస్టీ టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్ ముందుకు వచ్చింది. రూ. 3,500 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్ లో భారీ ఐటీ పార్కు ఏర్పాటుకు క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ నిర్ణయం తీసుకుంది. దాదాపు రూ.450 కోట్లతో లక్ష చదరపు అడుగల విస్తీర్ణంలో ఈ పార్కును అభివృద్ధి చేయనుంది. గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, బ్లూ-చిప్ కంపెనీల డిమాండ్‌కు అనుగుణంగా ఈ కొత్త ప్రాజెక్టును చేపట్టనుంది. హైదరాబాద్‌లోని ప్రముఖ బిజినెస్ పార్కులైన ఇంటర్నేషనల్ టెక్ పార్క్ హైదరాబాద్, ఎవ్యాన్స్ హైదరాబాద్, సైబర్ పెరల్ వంటివి క్యాపిటల్ ల్యాండ్ నిర్మించినవే. రాష్ట్రంలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమలు, పెట్టుబడుల అవకాశాలపై సింగపూర్ సెమీ కండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్ తో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి.

# పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నాం

**విశ్వంభర, నిజామాబాద్:** పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నామని, అయితే ఏర్పాటు ప్రకటించిన విధానంపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. పసుపు బోర్డు ప్రారంభోత్సవాన్ని బీజేపీ కార్యక్రమంలా చేశారని మండిపడ్డారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆహ్వానించకుండా, ప్రొటోకాల్ పాటించకుండా కేవలం బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ కూర్చొని ప్రారంభించుకున్నారని విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులకు కూడా సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. నిజామాబాద్‌లో మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పసుపుబోర్డు ఏర్పాటుపై మీడియాతో మాట్లాడారు. 2014లో తాను ఎంపీగా ఎన్నికైన నెల రోజుల్లోనే అప్పటి వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు పసుపు బోర్డు గురించి లేఖ రాసినట్లు గుర్తుచేశారు. ప్రధాని మోడీని రెండు సార్లు కలిశానని చెప్పారు. పసుపు బోర్డుకు ప్రయత్నం చేస్తేనే పసుపు ఆధారంగా రావాల్సిన పరిశ్రమల కోసం కృషి చేశానన్నారు. పసుపుకు రూ.15 వేల మద్ధతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశానని తెలిపారు. ఐదేండ్లు ఎంపీగా త్రిముఖవ్యూహంతో అలుపెరగని పోరాటం చేశానని పేర్కొన్నారు. కేవలం బోర్డు రావడం మాత్రమే సరిపోదని, మద్ధతు ధర ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుందని స్పష్టం చేశారు. ఇతర దేశాల నుంచి నాణ్యతలేని పసుపు దిగుమతి అవుతుందని, దాంతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. పసుపు దిగుమతులను నియంత్రించాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నానని వెల్లడించారు. 2014లో 8 లక్షల



క్వింటాళ్లు దిగుమతవుతే.. ఇప్పుడది రెట్టింపయ్యింది చెప్పారు. ఏటేటా దిగుమతులు పెరుగుతున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేవలం రాజకీయం కోసం పసుపు బోర్డు కాకపోతే.. వెంటనే దిగుమతులపై నియంత్రణ విధించాలని డిమాండ్ చేశారు. వెంటనే పసుపుకు రూ.15 వేల మద్ధతు ధర ప్రకటించాలన్నారు. 'ఎంపీ అర్వింద్‌కు వెకిలి మాటలు మాట్లాడడం అలవాటే. తాము పసుపు బోర్డు డిమాండ్ చేసే నాటికి ఆయన అసలు రాజకీయాల్లోనే లేరు. కాంగ్రెస్ పార్టీలో ఆయన తండ్రిచాటు బిడ్డగా ఉన్నారు. ఎంపీగా గెలిస్తే ఐదు రోజుల్లో పసుపు బోర్డు తీసుకొస్తానని బాండ్ పేపర్‌పై రాసిచ్చిన అర్వింద్.. గెలిచిన తర్వాత పసుపు బోర్డు కంటే స్పైసెస్ బోర్డే బాగుటుందన్నారు. తాము కేంద్రంపై పదేపదే ఒత్తిడి చేయడంతోనే ఆ స్పైసెస్ బోర్డు కార్యాలయం ఏర్పాటైంది. అది కూడా ఆయన గొప్పతనమని అర్వింద్ మాట్లాడడం హాస్యాస్పదం. స్పైసెస్ బోర్డు బెంజ్ కారులాంటిది.. పసుపు బోర్డు అంబాసిడర్ కారులాంటిదని అర్వింద్ అన్నారు. ఒకవేళ బెంజ్ కారు ఉంటే.. అంబాసిడర్ కారు ఎందుకు ఇచ్చినట్లు?. ఎందుకు ఇంత వైరాధ్యంతో రకరకాల మాటలు చెబుతున్నారు?. ఎంపీ అర్వింద్ గాలి మాటలు మాట్లాడడం మానేయాలి. ఎవరు ఏం చేయకున్నా ప్రతి మూడో సంవత్సరం పసుపు ధర పెరుగుతుంది. కానీ అది తన ఘనత అని అర్వింద్ చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. రైతాంగాన్ని బీజేపీ మోసం చేయడం ఆపేయాలి. స్పైసెస్ పార్కు ఏర్పాటుకు వేల్పూర్ వద్ద కేసీఆర్ ప్రభుత్వం 42 ఎకరాలు కేటాయించారు. ఆ పార్కులో పసుపు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి. జాక్రాన్‌పల్లిలో విమానాశ్రయానికి కేసీఆర్ ప్రభుత్వం 800 ఎకరాలు సేకరించింది. అక్కడ ఎయిర్ పోర్టు తీసుకురావాలని' ఎంపీ అర్వింద్‌ను కవిత డిమాండ్ చేశారు.

# ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం


**మొదటిపేజీ తరువాయి**

బీసీ ఐక్యవేదిక కన్వీనర్ చామకూర రాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి డా.కాచం సత్యనారాయణ గుప్త హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్సీల వర్గీకరణ అమలు చేయాలని అన్నారు. ఎస్సీ లోని ఉప కులాల యువతకు విద్య, ఉద్యోగ ,రాజకీయ రంగాలలో సముచిత న్యాయం స్థానం దక్కాలంటే ఏబీసీడీలుగా వర్గీకరణ చేయాలని అన్నారు.మూడు దశాబ్దాలపాటు ఎస్సీ వర్గీకరణ కోసం తెలుగు నేలపై సుదీర్ఘంగా మందకృష్ణ మాదిగ చేస్తున్న పోరాటానికి వైశ్య వికాస వేదిక సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 7న జరిగే వేయిల గొంతులు లక్షల డబ్బుల కార్యక్రమానికి మా వంతుగా సంపూర్ణంగా పాల్గొంటామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ఏబీసీడీ జనాభా ధామాషా ప్రకారం 15 శాతం రిజర్వేషన్ సమానంగా పంచుకోవాలని అన్నారు. 2024 లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి ఎస్సీ వర్గీకరణ ఏబీసీడీకి సహకరించి దళితుల ఐక్యత చాటాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఈడబ్ల్యూ ఎస్ లో వర్గీకరణ చేయాలని కాచం డిమాండ్ చేశారు. బీసీలలో వర్గీకరణ ఉందని, ఇప్పుడు ఎస్సీలలో



జరగనుందని, అదేవిధంగా ఈడబ్ల్యూఎస్ కూడా జరగాలన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ ఫలాలు దక్కాలంటే తప్పనిసరిగా ఎస్సీ, బీసీల మాదిరిగానే ఈడబ్ల్యూఎస్ లో కూడా వర్గీకరణ తప్పనిసరి చేయాలన్నారు. అందుకోసం వైశ్య వికాస వేదిక ద్వారా ఈడబ్ల్యూఎస్ వర్గీకరణ సాధనకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం సుధాకర్ మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుపై ప్రభుత్వము నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం వల్ల ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఎస్సీ యువత ఉద్యోగాలు కోల్పోవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వనరుల పరిరక్షణ సమితి అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్, బీసీ సమన్వయకర్త యాదగిరి నేత, బోసుపల్లి శ్రీరాములు గౌడ్ ,బొమ్మ రఘురాం నేత, నరేందర్, దుర్గయ్య, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు ఆంజనేయులు,శ్రీనివాసులు, మాదిగ జర్నలిస్టు ఫోరం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చిత్రం సైదులు , శ్రీధర్, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రకాష్ మాదిగ,మౌలాలి మాదిగ, వెంకట్ , రాజు , నర్సింగ్ రావు, శేఖర్, రాములు, బైగల రాములు, ఇరుగు రావి , బైగల రాము , స్వామి, శశిధర్ అనీల్ ,కృపానందం తదితరులు పాల్గొన్నారు.

## తల్లి వద్దనుకున్న ఆ బిడ్డే.. ఐఏఎస్ అయ్యింది



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** భూమిపైకి రాగానే కన్నవాళ్లు భారం అనుకున్నారు! బాల్యమంతా ఆర్థిక ఇబ్బందులు. అయినప్పటికీ చదువును అశ్రద్ధ చేయలేదు. పట్టుదల, సంకల్పంతో అడ్డంకుల్ని అధిగమించింది. చివరకు తన కలను సాకారం చేసుకుంది. ఆమే మహిళా ఐఏఎస్ సంజితా మహాపాత్ర. అయినవాళ్లు వద్దనుకున్న దగ్గర నుంచి ఐఏఎస్‌గా ఎదగడం వరకు ఎదుర్కొన్న అవరోధాలను ఆమె ఇటీవల ఓ సమావేశంలో పంచుకుంది. తన బాల్యాన్ని గుర్తుకుతెచ్చుకుంది. ఒడిశాలోని రావూర్కెలాలో ఓ పేద కుటుంబంలో సంజితా మహాపాత్ర జన్మించారు. తల్లికి మొదటి సంతానం అమ్మాయి. రెండోసారి మగబిడ్డ పుట్టాలని తల్లి ఎంతో ఆశించింది. తీరా ఆడపిల్ల పుట్టడంతో భారంగా భావించి.. వదిలేయాలనుకుంది. కానీ సోదరి పట్టుబట్టడంతో విడిచిపెట్టలేకపోయింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కావడంతో సంజితా బాల్యం మొత్తం ఇబ్బందులతోనే గడిచిపోయింది. ఎలాగైనా చదువుకుని తన సంకల్పాన్ని నెరవేర్చుకోవాలనుకునుంది. ఎన్ని సమస్యలున్నా పట్టువిడవలేదు. సామాజిక సంస్థలు, ఉపాధ్యాయులు, స్కాలర్‌షిప్‌ల సహకారంతో చదువు పూర్తిచేసింది. అలా మెకానికల్ ఇంజినీరింగ్‌లో పట్టా పొందింది. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం సంపాదించుకుంది. ఆ సమయంలోనే తల్లిదండ్రులకు వారి గ్రామంలోనే ఇల్లు కట్టుకొనేందుకు సాయం చేసింది. చిన్నతనం నుంచే ఐఏఎస్ అధికారి కావాలనేది ఆమె ఆకాంక్ష. భర్త సాయంతో దాన్ని కూడా సాధించింది. 2019లో తన ఐదో ప్రయత్నంలో యూపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించింది. ప్రస్తుతం అమరావతి జిల్లా పరిషత్ సీఈఓగా ఉన్నారు. మహిళల సాధికారత, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య కోసం కృషి చేస్తున్నారు. స్వయం సహాయక సంఘాల నుంచి వచ్చే ఉత్పత్తులు, బ్రాండింగ్, ప్యాకేజింగ్ వంటి మార్కెట్‌లపై దృష్టి సారించారు. తాను సాధించిన విజయాల పట్ల తల్లిదండ్రులు గర్వపడుతున్నారని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

## మాదాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే లక్ష్యంగా గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

**విశ్వంభర, హైదరాబాద్:** సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే లక్ష్యంగా మాదాపూర్‌లో గంజాయి, హాష్ ఆయిల్ విక్రయిస్తున్న ముఠాను శంషాబాద్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 830 గ్రాముల గంజాయి, 14 గ్రాముల హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులనే లక్ష్యంగా చేసుకుని ఈ ముఠా గంజాయి విక్రయాలు సాగిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. విద్యార్థులకూ గంజాయి అలవాటు చేసి విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది. హైదరాబాద్‌లో గంజాయి విక్రయిస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన రాజు జాట్‌ను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 62 కిలోల గంజాయి స్వధీనం చేసుకున్నారు. రాజు జాట్ ఒడిశాలో గంజాయి కొని తెలంగాణ, మహారాష్ట్రలో విక్రయిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు.



## సయ్యద్ యాకూబ్ అలీ బాబా దర్గాలో ఉర్సు ఉత్సవాలు



**విశ్వంభర, బాగ్ అంబర్‌పేట్:** బాగ్ అంబర్‌పేట్ రహత్ నగర్‌లోని సయ్యద్ యాకూబ్ అలీ బాబా దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు షేక్ జమీర్ దర్గా కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్, టీపీసీసీ సెక్రెటరీ శంభుల శ్రీకాంత్ గౌడ్ పాల్గొని చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం శంభుల ఉషాశ్రీ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి పండుగలలో హిందూ ముస్లిం భాయి భాయి అనే ఆనవాయితీ నడుస్తుందన్నారు.

## ఆది పురుషుడు- ఆది ధర్మం పోస్టర్ ఆవిష్కరణ



**విశ్వంభర, హైదరాబాద్:** మాదిగల పవిత్ర గ్రంథం 'ఆది పరుషుడు, ఆది ధర్మం' అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సాంస్కృతిక అధ్యయన కేంద్రం, శ్రీశ్రీశ్రీ స్వయంభు ఆది జాంబవ మఠం ట్రస్టు ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ ఏకు తిరుపతి రచించిన 'ఆది పురుషుడు- ఆది ధర్మం' మాదిగల పవిత్ర గ్రంథ ఆవిష్కరణపై చర్చ కారక్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ గాలి వినోద్కుమార్, ప్రొఫెసర్ ఏకు తిరుపతి, ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు కృపాకర్, మేరి మాదిగ, ఈటక రాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రొఫెసర్ గాలి వినోదకుమార్, ప్రొఫెసర్ ఏకు తిరుపతిలు మాట్లాడుతూ.. సృష్టికి మూల కారుడు జాంబవంతుడని అన్నారు. పెద్ద కులం మాదిగ కులం అని పేర్కొన్నారు. మాదిగలు ఆదిలోనే ఈ దేశాన్ని ఏలారని, తిరిగి ఈ దేశాన్ని ఏలాలంటే ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని చెప్పారు. మాదిగల పవిత్ర గ్రంథం ఆది పురుషుడు ఆది ధర్మం యొక్క విశిష్టత గుర్చి మాట్లాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వంలో జాంబవంతుని పాత్ర, మానవ సమాజాల నిర్మాణానికి, యుగాలలో జాబవంతుని వంశం ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. త్వరలోనే గ్రంథం ఆవిష్కరిస్తున్నట్లు ప్రొఫెసర్ ఏకు తిరుపతి తెలిపారు.

## ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు

**విశ్వంభర, భూపాలపల్లి:** జిల్లాలో రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు విచారణ ప్రక్రియలో జిల్లా, మండల స్థాయి అధికారులు భాగస్వాములైనందున 20వ తేదిన సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లా, మండల అధికారులు క్షేత్రస్థాయి విచారణ, 21వ తేది నుండి జరుగనున్న గ్రామసభల నిర్వహణ విధులలో నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి 20వ తేదీ సోమవారం ప్రజావాణి దరఖాస్తులు ఇవ్వడానికి కలెక్టరేట్ కు రావొద్దని, అధికారులు అందుబాటులో ఉండరన్నారు.

## వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే



**విశ్వంభర, వరంగల్:** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల పరిధిలోని బొక్కల గూడెం (వెంకట్రావు పల్లె ) గ్రామానికి చెందిన ఎస్. ఎల్.ఐటీ అక్యులోర్ స్టాటిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారి సౌజన్యంతో సుమారు 2 లక్షల రూపాయల వ్యయంతో ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ ను వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు వరంగల్ అర్బన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిన మాటలు పాటిస్తూ పే బాక్ టు సొసైటీ అనే నినాదంతో కంపెనీ ఎస్. ఎల్.ఐటీ అక్యులోర్ స్టాటిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం ముందుకొచ్చిందన్నారు. కంపెనీ ఎంప్లాయ్ అందరు ఒక గొప్ప ఆలోచన పల్లెలో ఉండే ప్రజలకు స్వచ్ఛమైన మంచి నీరు అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి మంచి మంచి కార్యక్రమాలు చేస్తున్నందుకు అందరికీ అభినందించి అలాగే గ్రామంలో ఉన్న చిన్నచిన్న సమస్యలను దశలవారీగా పూర్తి చేస్తానన్నారు. అనంతరం కంపెనీ యాజమాన్యం వారిని ఎంప్లాయ్ లను ఎమ్మెల్యే నాగరాజు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాటర్ ప్లాంట్ దాతలు శివకవి సంతోష్ - మమత, శివకవి లింగమ్మ - చంద్రయ్య, సందీప్ - ప్రత్యూష, సద్దుల రాఘవేందర్- శ్రీలత, కొంతల వంశీ వరప్రసాద్ రెడ్డి, వెలుకుర్తి నవీన్, ఒంటెల సన్నీ రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, రిషికేశ్ రెడ్డి, అక్కల హంసిక, గొల్ల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.73 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

- హౌసింగ్ కాలనీకి అన్ని మౌలిక సదుపాయాలు కల్పన
- త్వరలో లబ్ధిదారుల ఎంపిక
- రాష్ట్రంలోనే ఒక ఆదర్శకాలనిగా తీర్చిదిద్దా
- అన్ని గ్రామాలకు డబుల్ రోడ్లు, సాగునీరు, త్రాగునీరు అందించడమే నా ధ్యేయం
- రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**విశ్వంభర, హుజూర్ నగర్:** హుజూర్ నగర్ నియోజకవర్గంలో రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ముందుగా హుజూర్ నగర్ హౌసింగ్ కాలనీ వద్ద 14 కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఐటీఐ బిల్డింగ్ కు శంకుస్థాపన చేశారు. అనంతరం హౌసింగ్ కాలనీ పనులను పరిశీలించి, అన్ని బ్లాకుల పనులు పూర్తి చేసి సుందరంగా తీర్చిదిద్దాలని హౌసింగ్ అధికారులకు మంత్రి ఆదేశించారు. కాలనీ పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి తెలిపారు. అక్కడి నుండి లింగగిరి గ్రామంలో లింగగిరి నుండి కల్మల్ చెరువు వరకు 26 కోట్ల రూపాయలతో నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అమరవరం గ్రామంలో అమరవరం నుండి అలింగాపురం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి 23 కోట్లతో జరిగే పనులకు శంకుస్థాపన చేశారు. మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామంలో మేళ్లచెరువు నుండి చౌటపల్లి వరకు 10 కోట్ల రూపాయలతో నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోనె ఆదర్శ కాలనీగా హుజూర్ నగర్ హౌసింగ్ కాలనీ ని తీర్చిదిద్దుతానని, కాలనీకి అన్ని మౌలిక వసతులు కల్పించి త్వరలోనే లబ్ధిదారుల ఎంపిక చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ కాలనీ 10 సంవత్సరాలుగా నా తపస్సని త్వరలో అన్ని పనులు పూర్తిచేస్తానని మంత్రి తెలిపారు. జాన్ పాడు, పాలకీడు మండలాలలో 5,560 ఎకరాలకు సాగునీరు అందించడం కొరకై 120 కోట్లతో జరుగుతున్న లిఫ్ట్ పనులను పరిశీలించడమైనదని పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు మంత్రి ఆదేశించారు. నియోజకవర్గంలోని చదువుకున్న యువత కొరకు 40 కోట్ల రూపాయలతో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ పనులు మొదలు పెట్టామని, ఇప్పుడు 14 కోట్లతో బేసిక్ ఐటీఐ బిల్డింగ్ కొరకు శంకుస్థాపన చేయడం జరిగిందని, దీనివలన ఎంతోమంది యువత ఉద్యోగాలు పొందగలుగుతారని మంత్రి అన్నారు. విద్యా , వైద్యం, విద్యుత్తు, అన్ని విషయాలలో ముందుకు పోతున్నామని హుజూర్నగర్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోని మొదటి స్థానాలలో నిలుపుతానని మంత్రి తెలియజేశారు. లింగగిరి నుండి కల్మల్ చెరువు వరకు 13 కిలోమీటర్ల రోడ్డు 26 కోట్ల రూపాయలతో నిర్మించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ రోడ్డు వలన లింగగిరి, సర్వారం, గానుగబండ, గార కుంట తండా మిగిలిన చిన్న చిన్న తండాలకు ఈ రోడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి తెలిపారు. హుజూర్ నగర్ నియోజకవర్గంలో ఎక్కడ కూడా సింగిల్ రోడ్డు ఉండకూడదు అన్ని డబల్ రోడ్లుగా మార్చి ప్రజలకు సౌకర్యవంతంగా చేయాలని మంత్రి పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నాలుగు పథకాలు ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, పథకాలకు క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే నిర్వహించారని లబ్ధిదారుల పేర్లను జాబితాను జనవరి 21 నుంచి 24 తారీకు వరకు జరిగే గ్రామసభలలో ప్రదర్శిస్తారని జాబితాలో తమ పేర్లు లేనియెడల ఆందోళన చెందనఅవసరం లేదని గ్రామ సభలో దరఖాస్తులు అందజేయవచ్చని కలెక్టర్ తెలిపారు. రేషన్ కార్డు జారీకి సంబంధించి అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు కార్డులు అందజేస్తామని అన్నారు. గ్రామ సభల్లో, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించిన వాటిని పరిశీలించి అర్హులకు రేషన్ కార్డులు అందజేస్తామని పేర్కొన్నారు. గ్రామ సభలలో మీ అభిప్రాయాలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భూములేని కూలీలు ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులపాటు పని కి వెళ్లిన వారె అర్హులని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులు, మండల అధికారులు అందుబాటులో ఉంటారని, సమస్యలు ఉంటే ప్రజలు వారిని అడిగి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. జనవరి 26 నుండి 4 పథకాలు అమలు పరుస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కొరకు ఇల్లు లేని వారు గ్రామసభలో దరఖాస్తులు పెట్టుకోవచ్చు అని తెలిపారు. గ్రామ సభలలో ప్రజాభిప్రాయాలు పరిగణములోకి తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఆర్ అండ్ బి సీతారామయ్య, డీఈ, ఏఈ, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



**విశ్వంభర, హైదరాబాద్:** నూతన జాతీయ మార్కెటింగ్‌ను ప్రైవేట్ పరం కేంద్ర ప్రభుత్వం చేసిందని రౌండ్ టేబుల్ సమావేశ అధ్యక్షులు జక్కుల వెంకటయ్య, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి అన్నారు. దానిని ఉపసంహరించుకోవాలని, మూడు వ్యవసాయ చట్టాలు 2021 లో రద్దు చేసిన చట్టాలలో ఇది ఒకటి అని, రద్దు చేసిన చట్టాన్ని దొడ్డిదారిన మళ్లీ తీసుకొచ్చిందని, దీనిని వెంటనే రద్దు చేయాలన్నారు. రైతు డిమాండ్లు అమలుకు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న దేశ రైతు నాయకులు జగీత్ సింగ్ దల్లేవాల్ కు ప్రాణహాని జరగకుండా కాపాడాలన్నారు. ఏమైనా జరిగితే కేంద్ర ప్రభుత్వాన్ని బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలో ఆర్ఆర్ఆర్ వివిధ కంపెనీలను ఏర్పాటు చేస్తూ సన్న, చిన్న కారు రైతు భూముల నుండి వెళ్ల గొట్టే కార్యక్రమాన్ని వెంటనే నిలిపివేయాలన్నారు. నిర్వాసిత రైతులకు ఇంటికి ఇల్లు భూమికి భూమి ఇంటికో ఉద్యోగం ఇచ్చే 2013 సంవత్సరం చట్టాన్ని అమలు చేయాలన్నారు. కౌలు రైతులు రాష్ట్రంలో 23 లక్షల రైతులు ఉన్నారని, వీరికి 2011 సంవత్సరం చట్టాన్ని అమలు చేయాలన్నారు. లేదంటే కుటుంబానికి మూడెకరాల భూమిని ఇవ్వాలని, రాష్ట్రంలో భూమి సమస్యలు పోడు భూముల సమస్యలను పరిష్కారం చేస్తానని, కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి రైతులు గెలిపించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే భూమి, మరియు పోడు భూముల సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో 30 ఇతనాల కంపెనీల వల్ల సన్న, చిన్న కారు రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కనుక ఇథనాల కంపెనీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, రైతు సమస్యలను పట్టించుకోకుండా ఎన్డీఏ కేంద్ర ప్రభుత్వం ఒక రైతు నాయకుడు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జగ్జీత్ సింగ్ దల్లేవాల్ చావు బతుకులలో ఉన్నారన్నారు. కావున వెంటనే దేశ రైతాంగ సమస్యలను పరిష్కారం చేయాలని, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగిరెడ్డి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి గోపాల్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ హైదరాబాద్ కన్వీనర్ రాంబాబు, తెలంగాణ రైతంగ సమితి కార్యదర్శి ఇంద్రసేన, తెలంగాణ రైతాగసమితి నాయకులు లక్ష్మీపతి, సామాజిక తెలంగాణ ఫ్రెండ్ రాష్ట్ర అధ్యక్షులు పరశు రాజు, తెలంగాణ రైతాంగ సమితి జిల్లా నాయకులు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో అవినీతి రహిత పాలన అందాలంటే రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న, అవినీతి, నష్టాలకు, అక్రమాలకు, దోపిడికి.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే కారణమని చెప్పారు. దేశంలో గత పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ కేంద్ర మంత్రులపై, ప్రభుత్వంపై ఒక్క రూపాయి అవినీతి చేసినట్లు కనీసం ఆరోపణలు కూడా రాలేదని అన్నారు. ఆదివారం మధ్యాహ్నం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో వివిధ పార్టీలకు చెందిన కీలక నేతలు, కార్యకర్తలు కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని ఆరోపించారు. అందుకే రాష్ట్ర ప్రజానీకం బీజేపీని ప్రత్యామ్నాయంగా ఎంచుకున్నారని వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఎనిమిది పార్లమెంట్ స్థానాలు ఇచ్చారని గుర్తు చేశారు.

## పటాన్ చేరులో 35వ మైత్రి క్రికెట్ కప్ పోటీలు ప్రారంభం

- క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**విశ్వంభర, పటాన్ చేరు:** నేటి తరం యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. క్రికెట్ అభివృద్ధికి మైత్రి క్రికెట్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. పటాన్ చేరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో మైత్రి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 35వ మైత్రి క్రికెట్ ట్రోఫీని ఆదివారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల చరిత్ర కలిగిన మైత్రి మైదానాన్ని క్రీడారంగానికి కేంద్రంగా తీర్చిదిద్దామని తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం 7 కోట్ల 50 లక్షల రూపాయలతో ఆధునిక వసతులతో మైదానాన్ని తీర్చిదిద్దామని తెలిపారు. గత 35 సంవత్సరాలుగా ప్రతి ఏటా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న ఘనత మైత్రి క్రికెట్ క్లబ్ కి దక్కిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్ చేరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత రెడ్డి, పారిశ్రామికవేత్తలు కె. సత్యనారాయణరెడ్డి, సి. సత్యనారాయణ రెడ్డి, సిఐ వినాయక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహ రెడ్డి, అఫ్జల్ పాల్గొన్నారు.

## నీలకంఠి సంఘం అధ్యక్షుడిగా వీరబత్తిని శంకర్



**విశ్వంభర, హైదరాబాద్:** కాచిగూడలో నీలకంఠి సంఘం హైదరాబాద్ 28వ వార్షిక సర్వ సభ్య సమావేశం, నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం జరిగాయి. నీలకంఠి సంఘం హైదరాబాద్ నియమించిన ఎన్నికల అధికారులు తుమ్మ హరికిషన్, నీలకంఠి శేషాంకమౌళి, గవ్వల శ్రీధర్, వీరబత్తిని కృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు మాత్రమే నిర్వహించబడ్డాయి. అన్ని పదవులకు ఒక్కొక్క అభ్యర్థి మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. కావున అన్ని పదవులకు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి వీరబత్తిని శంకర్ , ప్రధాన కార్యదర్శి అక్కల సుధాకర్, కోశాధికారి బట్టు నాగరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అఖిల భారత నీలకంఠ సమాజం ప్రధాన కార్యదర్శి శంకర్ ద్వారా నూతనంగా ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన ఎన్నికైన వారికి పలువురు సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## అంగరంగ వైభవంగా మాదారం చిత్తారమ్మ జాతర



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం మాదారం గ్రామంలో కొలువై భక్తుల కొంగుబంగారంగా భావించే చిత్తారమ్మదేవి జాతర ఆదివారం అత్యంత వైభవంగా కన్నుల పండుగగా జరిగింది. ఉదయం నుంచే భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. ప్రతి ఏటా సంక్రాంతి తర్వాత వారం చిత్తరమ్మ జాతర అంబేద్కర్ కాలనీవాసులు నిర్వహిస్తారు. జాతరకు ముఖ్య అతిథులుగా జిన్నారం మండల్ కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కాలాల్ రాజు గౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వకాలం నుంచి గ్రామంలో గ్రామదేవతలకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. చిత్తరమ్మ తల్లి జాతర జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. గ్రామానికి ఎలాంటి అరిష్టం జరగకుండా, ప్రజలు ఆరోగ్యంగా, సు:ఖ సంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని గ్రామదేవతకు మొక్కులు చెల్లించుకోవడంతో అంతా మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంబేద్కర్ కాలనీవాసులు అందరూ కలిసి చిత్తారమ్మ జాతర నిర్వహించడంపై ఆయన అభినందించారు. ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి, సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వార్డ్ సభ్యులు రాజేందర్ సింగ్ , కుమార్, మల్లేష్, నరసింహ, లక్ష్మణ్, మంత్రి చంద్రయ్య, మంత్రి అశోక్, దుర్గయ్య, యాదయ్య, వీరేష్, సుదర్శన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతో మరింత అభివృద్ధి

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**విశ్వంభర, వరంగల్:** ప్రజల సహకారంతో మరింత అభివృద్ధి సాధ్యమని 53వ డివిజన్ పర్యటనలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి నియోజకవర్గ పరిధిలోని అన్ని కాలనీలలో వర్షపు నీరు నిలవకుండా చేస్తానని అన్నారు. ఈ మేరకు ఆదివారం 53వ డివిజన్ విజయ గణపతి కాలనీ, విద్యారన్యపురి, శంకర్ నగర్ పర్యటించారు. కాలనీల్లో ప్రధాన సమస్యలుగా ఉన్న సైడ్ డ్రైనేజీ, అంతర్గత రోడ్ల నిర్మాణం పై ప్రత్యేక దృష్టితో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. కాలనీలో ప్రదానంగా ఉన్న మూడు సీసీ రోడ్లకు, సైడ్ డ్రైన్ లను నిర్మించాలని కాలనీ వాసులు కోరగా వెంటనే సంబంధిత అధికారులను అంచనా వేసుకుని ప్రణాళికలు తీసుకురావాలని ఆదేశించారు. స్థానికంగా కాలనీవాసులు కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు సహకరించాలని కోరగా.. నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ. 10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. నగరంలో ఇప్పటికే ప్రధాన కాలనీలలో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ ఆఫీసియల్ మెంబర్ పల్లకొండ సతీష్, డివిజన్ కంటెస్ట్ కార్పొరేటర్ కావ్య మహేందర్,రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పల్లె రాహుల్ రెడ్డి,కమలాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్, నర్సయ్య, రఘుపతి, రవీందర్, చారి, యుత్ నాయకులు మనీషా, అరుణ్, బాన్ని, అనిల్, రాజీర్, అవినాష్, రాజేష్, చందు పాల్గొన్నారు.

## విజిట్ అవర్ మజీద్ ప్రోగ్రాంలో ఎమ్మెల్యే




**విశ్వంభర, టేకుమట్ల:** భూపాలపల్లి నియోజవర్గం టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలో ఆ గ్రామ మజీద్ - ఈ - తవక్కల్ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన విజిట్ అవర్ మజీద్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో ఐక్యత, శాంతి, సామరస్యం మరియు సోదరభావం పెంపొందించడానికి ఇట్టి కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ముఖ్యంగా ఈ కార్యక్రమ ఉద్దేశం ఇస్లాం మరియు ముస్లిం ల పట్ల ఉన్నటువంటి అపోహలు తొలగి, సమాజ శ్రేయస్సుకు అందరినీ ఏకతాటిమీదకి తీసుకువస్తుందని పేర్కొన్నారు.

# మిద్దె తోటల సాగుతో క్యాన్సర్ నివారణ

**జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న**



**విశ్వంభర, మహబూబాబాద్:** ప్రస్తుత పరిస్థితుల్లో పలు రకాల వైరస్‌లు, బ్యాక్టీరియా, తదితర సూక్ష్మజీవులు వలన పలు వ్యాధులు వ్యాపిస్తున్నాయని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. వ్యాధుల బారి నుంచి రక్షణ కోసం పలు రకాల పోషకాలు విటమిన్స్, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు మొదలైనవి అవసరమన్నారు. ప్రతి రోజు పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, మొదలైన వాటి పాటు ఔషధ మొక్కలు, పూలు తదితర వాటిని ప్రతి ఇంటిలో పెరటి ఆవరణలో, మిద్దెల మీద సాగు చేసుకోవాలని, పట్టణాలు, గ్రామాలు పలు ప్రాంతాలు కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్నాయన్నారు. కావున ఇంటి ఆవరణలో, మిద్దె మీద కూరగాయలు, ఆకు కూరలు, మునగ, కరివేపాకు, పండ్లు, పూలు, ఔషధ మొక్కలు తదితర వాటిని పెంచుకోవాలన్నారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్ పట్టణంలో ఇంటి యజమానుల మిద్దె తోటల పెంపకాన్ని పరిశీలించారు. మహబూబాబాద్‌తో పాటు తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, తదితర మండల ప్రధాన కేంద్రాలలో ఇంటి ఆవరణలో, మిద్దెల మీద అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు, మునగ, కరివేపాకు, పండ్లు, పూలు, ఔషధ మొక్కలు సాగు చేస్తున్నారన్నారు. ఈ మిద్దె తోటల సాగును ఎలాంటి రసాయన ఎరువులు, పురుగు మందులు లేకుండా కేవలం సేంద్రియ ఎరువులు అయిన పశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్, వేప పిండి, వేపనూనె, కానుగ పిండి తదితర ఆర్గానిక్ ఉత్పత్తులు వాడడంతో పాటు పలు మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ మిద్దె తోటలు సాగు చేస్తున్నారన్నారు. ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ద్వారా మిద్దె తోటలు పెంచేందుకు అన్ని రకాలుగా సాంకేతిక సూచనలు తెలియజేస్తున్నామని తెలిపారు. మహబూబాబాద్ పట్టణంలో పండ్లకు సంబంధించిన జామ, వాటర్ ఆపిల్, అవకాడో, స్టార్ ఫ్రూట్, స్వీట్ చింత, బార్బొడాస్ చెర్రీస్, మల్బరీ, మామిడి, స్వీట్ లైమ్, దానిమ్మ,టేబుల్ నిమ్మ , బత్తాయి, మియాజకి మామిడి, పునాస మామిడి, అరటి, ఫైన్ ఆపిల్ (అనాస)తో పాటు కూరగాయలైన బెండ, బీర, సొర, కాకర, దొండ, బోడ కాకర, టమాటా, పచ్చి మిర్చి, చిక్కుడు, దోస, పలు రకాల ఆకు కూరలు, సుగంధ ద్రవ్యాలు అయిన పసుపు, ఉల్లి, వెల్లుల్లి, అల్లం, ఔషధ మొక్కలు అయిన అలోవెరా, వాము ఆకు, యాలకు, తులసి, ఆల్ స్పైస్, నిమ్మగడ్డి, పుదీనా, పూలు అయిన బంతి, చామంతి, మల్లె, కనకాంబరం, లిల్లీలు, ఇలా తీరు తీరు మొక్కలు అన్ని రకాల ఇంటి అవసరాలకు సాగు చేస్తున్నారన్నారు. కాగా, మహబూబాబాద్ పట్టణంలోని కంకరబోడు ప్రాంతంలోని , కృష్ణ కాలనీకి చెందిన బానోత్ రామచంద్ర, సునీతలు మిద్దె తోటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఆరోగ్యం, రోగ నిరోధక శక్తి, క్యాన్సర్ రహిత సమాజం కోసం ఇంటి ఆవరణలో, మిద్దె తోటలు సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఈనెల 20న ప్రజావాణి రద్దు

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**



**విశ్వాంభర, మహబూబాబాద్:** ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలకు (రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు) సంబంధించి ఇంటింటి సర్వే నేపథ్యంలో జిల్లాలోని అధికారులందరూ క్షేత్రస్థాయి పరిశీలనలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లా ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయానికి వినతులతో రావొద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## పెరిక కుల క్యాలెండర్ ఆవిష్కరించిన కోట సుధాకర్



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని ఎన్నారం గ్రామంలో జిల్లా పెరిక కుల క్యాలెండర్‌ను జిల్లా పెరిక కుల అధికార ప్రతినిధి కోట సుధాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిక కుల సోదరులందరు కలిసికట్టుగా ఉండాలన్నారు. తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్దిగాంచిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయం యాదాద్రి జిల్లాలో ఉండటం పెరిక కులపు అదృష్టమన్నారు. కావున అక్కడ పెరిక కుల భవన నిర్మాణం చేపట్టాల్సిన బాధ్యత పెరిక కుల సభ్యులకు ఎంతైనా ఉందని తెలిపారు. పెరిక కులస్తులందరూ ఏకతాటిపై ఉండి భవన నిర్మాణం చేపట్టుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు మద్ది రమేశ్, ఉపాధ్యక్షుడు బొట్టు నరహరి, మద్దె పెద్ద క్రిష్ణ, చిన్న క్రిష్ణ, కొక్కు చిత్తరంజన్, బొట్టు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన గర్దాసు యాదగిరి, జిల్లాల సుభద్రలు ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం వారి దశదిన కర్మకు హాజరై, వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



**విశ్వాంభర, దోమ:** పేద ప్రజలకు ఎల్ఓసీ, సీఎం సహాయక నిధి ఒక వరమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన కోనేరు రామచంద్రయ్య గౌడ్ చికిత్స నిమిత్తం ఎల్ఓసీ ఇవ్వాలని ప్రజా సేవకుడు భాస్కర్ గౌడ్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిని కోరారు. దీంతో ఎమ్మెల్యే రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసీని మంజూరు చేయించి చెక్కును ఆదివారం రామచంద్రయ్య గౌడ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి, ఎల్ఓసీ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పేదలందరూ సీఎం రిలీఫ్ ఫండ్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోనేరు జనార్దన్ గౌడ్, నరేందర్ గౌడ్, బాలయ్య గౌడ్, వెంకట్ రాములు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వేను బహిర్గత పరచాలి

**బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు**

**డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్**



**విశ్వంభర, బషీర్ బాగ్:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే వివరాలను తక్షణమే బహిర్గత పరచాలని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్ర సర్వే వివరాలను రాష్ట్ర ప్రభుత్వం నెల రోజులలోపు ప్రకటిస్తామన్నామని చెప్పిందన్నారు. ఇందులో భాగంగానే సమగ్ర సర్వే చేసి రెండు నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సర్వే వివరాలను ప్రకటించకుండా జాప్యం చేస్తుందన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ హామీని కాంగ్రెస్ పార్టీ అమలుపరచాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉన్నవారికి అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడికి ఘన సన్మానం



**విశ్వంభర, షాద్‌నగర్:** ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మలిపెద్ది శ్రీనివాస్ గుప్తతో పాటు ఆర్యవైశ్య సంఘం సభ్యులను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, జగన్ మోహన్ రెడ్డి, సత్యనారాయణ, బుచ్చిగూడ వెంకట్ రెడ్డి, న్యాయవాది రాజశేఖర్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు బచ్చల నరసింహులు, యుగంధర్, సుధీర్, వీరేశం గుప్త, జె. ఆర్. దినేష్ సాగర్, అనుమారి రాజు తదితరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఎంసాని శ్రీనివాసులు,పెద్ది రాం మోహన్, పి.శశిధర్, దండు రాము, అశోక్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## టీబీజీకేఎస్ భూపాలపల్లి ఏరియా నూతన బ్రాంచ్ కమిటీ నియామకం



**విశ్వంభర, భూపాలపల్లి:** తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆదేశానుసారం భూపాలపల్లి ఏరియా టీబీజీకేఎస్ కార్యాలయంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు బడితల సమ్మయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ మేరకు 50 మందితో కూడిన నూతన బ్రాంచ్ కమిటీని ప్రకటించారు. కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులుగా సదానందం, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా దేవరకొండ మధు, బ్రాంచ్ కార్యదర్శులుగా భాషణపెల్లి కుమార్, జి రాంచందర్, వెంకట్రాజ్యం, బి.నరేందర్, అధికార ప్రతినిధిగా సుంకరి గోవర్ధన్, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్‌గా చీకటి వంశీని నియమించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కమిటీ నాయకులు వివిధ గనుల ఫిట్ సెక్రటరీలు నరేష్ నేత, రాజేందర్, బద్దెల వంశీ, నాయకులు రవితేజ, టి. తిరుపతి, బి.కిషన్ నాయక్, రమణారెడ్డి, కన్నా త్రివేది, వనం అనిల్, లింగాల ప్రవీణ్ పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ తనిఖీ



**విశ్వంభర, భూపాలపల్లి:** గోరి కొత్త పల్లి మండలంలోని జగ్గయ్యపేటలో భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతు భరోసా, రేషన్ కార్డుల ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. రేషన్ కార్డులు జారీ అనేది నిరంతర ప్రక్రియ అని, జాబితాలో పేర్లు లేని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గతంలో వచ్చిన దరఖాస్తుల జాబితా, సమగ్ర కుటుంబ సర్వే జాబితాలో టీంలు విచారం జరుపుతున్నారని పేర్లు లేని లబ్ధిదారుల నుంచి గ్రామసభల్లో దరఖాస్తు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రజాపాలన సేవా కేంద్రాల్లో కూడా దరఖాస్తులు ఇవ్వొచ్చని ఆయన సూచించారు. ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ పకడ్బందీగా, పారదర్శకంగా జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. రైతులు, పథకాల లబ్ధిదారులు ఈ ప్రక్రియ ద్వారా తమకు అందే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, మండల ప్రత్యేక అధికారి సునీల్, తహసీల్దార్ శ్వేత, ఎంఏఓలు, ఫీల్డ్ వెరిఫికేషన్ టీములు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు



**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలందరూ బోనాలు చేసి శివసత్తుల ఆటలతో బైండ్ల రాజుల విన్యాసాలతో వాడవాడల కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అందరూ ఆరోగ్యాలతో కలకాలం చల్లగా ఉండాలని దీవించాలని పోచమ్మ తల్లిని వేడుకున్నారు. అనంతరం బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పొన్నం పరశురాములు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**విశ్వంభర, భూపాలపల్లి:** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డ్ లు జారీ చేస్తామని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆదివారం చిట్యాల మండలంలోని లక్ష్మీపూర్ తండా, మొగుళ్లపల్లి మండలం, మొగుళ్లపల్లిలో జరుగుతున్న రైతు భరోసా, రేషన్ కార్డులు జారీకి జరుగుతున్న క్షేత్రస్థాయి విచారణ ప్రక్రియను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ గృహాలు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసిందని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రేషన్ కార్డుల జారీ ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతర ప్రక్రియ అని, చివరి లబ్ధిదారుల వరకు అందిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని తెలిపారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామసభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీచేసినట్లు ఆయన వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి 4 ప్రతిష్టాత్మక పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి అమలుకు శ్రీకారం చుట్టబోతుందని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో దరఖాస్తులను స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు ఒక గ్రామ పంచాయతీలో మాత్రమే గ్రామ సభ నిర్వహించాలని, ఈ గ్రామ సభలకు హాజరయ్యే ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాటు లేకుండా సమర్ధవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. సర్వే నమోదు వివరాలు పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు హేమ, సునీత, చిట్యాల ఎంపీడీవో జయశ్రీ, వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బల్దియా ఉద్యోగులు క్రికెట్ పోటీలు ప్రారంభం

**ఎమ్మెల్యే నాగరాజు, మేయర్ గుండు సుధారాణి**



**విశ్వంభర, వరంగల్:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని రెడ్డిపురం గ్రామ శివారులోని టీవీఎస్ ఎస్ గ్రౌండ్‌లో బల్దియా ఉద్యోగులు, సిబ్బందికి క్రికెట్ పోటీలు నిర్వహించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ మ్యాచ్ పోటీలను వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు, మేయర్ గుండు సుధారాణి కాసేపు క్రికెట్ ఆడి ఉద్యోగస్తులకు ఉత్సాహం నింపారు. అనంతరం డీఆర్ఎఫ్, హార్టికల్చర్, టౌన్ ప్లానింగ్ టీమ్స్‌లను పరిచయం చేసుకొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలకు పెద్దపీట వేయడంతో పాటు క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందిస్తూ ఫుట్ బాల్ క్రీడాకారిణిగా మక్కువ చూపుత్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సూపరింటెండెంట్ ఆనంద్, ఉద్యోగస్తులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**విశ్వంభర, ఆలేరు:** పూర్వ విద్యార్థుల సమ్మేళనం అందరినీ అబ్బురపరిచింది. 40 ఏళ్ల నాటి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ నిర్వహించిన కార్యక్రమం పూర్వ విద్యార్థులను ఆనంద డోలికల్లో ముంచింది. ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1984-85 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ప్రకాష్ గార్డెన్స్‌లో నిర్వహించారు. వివిధ ప్రాంతాలలో నివసిస్తూ వివిధ రంగాలలో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలిసి తమ చిన్ననాటి ముచ్చట్లను జ్ఞాపకం చేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పగడాల రాంబాబు, తిరునగారి శ్రీనివాస్, బజ్జూరి రవీందర్, చోల్లేటి కనక భూషణం, ఉప్పలయ్య, పడిగెల రాజేశ్వర్, సముద్రాల శ్రీనివాస్, కటకం సుభాష్, చిట్టిమల్ల భాస్కర్, ఎండీ అబ్దుల్, సముద్రాల శివ, విజయ్ కుమార్, ఎండీ సీరాజుద్దీన్, ఖలీల్, లుంబా, పద్మలత, పద్మ, అనురాధ, విజయ లక్ష్మి, ఇందిరా, రాజేశ్వర్ రెడ్డి, రాములు, బీరు మల్లయ్య, ఎండీ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాగ రమ్య ఆరో వార్షికోత్సవ వేడుకలు




**విశ్వంభర, హైదరాబాద్:** రాగ రమ్య కల్చరల్, సోషల్ యాక్టివిటీస్ ఆర్గనైజేషన్ ఆరో వార్షకోత్సవం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ మేరకు చిన్నారులు కూచిపూడి భరతనాట్యం నృత్యాలు, శాస్త్రీయ సంగీతం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన శంకర్ నారాయణ మాట్లాడుతూ.. సంగీతం, నృత్యం కలలో భాగమని, పిల్లలకు నేర్పిస్తున్న గురువులతో పాటు ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించాడు. ఇలాంటి కలలు పిల్లల్లో చదువులపై ఆసక్తి పెరగడం, ఆరోగ్యంతో ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్తారన్నారు. అనంతరం శంకరనారాయణ రాసిన లక్ష్మీ శతకం పుస్తక ఆవిష్కరణ చేసిన రమ్య నృత్య గురువులు, నృత్య గురువులను రాగ రమ్య సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు రమ్య శాలువాతో సత్కరించారు. అలాగే నృత్యం చేసిన చిన్నారులను జ్ఞాపికలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో నృత్య గురువులు శ్రీదేవి, లక్ష్మి, లలితరావు, అపర్ణ, పావని, బిందు, కృష్ణ ప్రియ, ఉమ, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**





**విశ్వంభర, మహబూబాబాద్:** రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ఫీల్డ్ వెరిఫికేషన్, గ్రామ సభల పై ఆదివారం ఐడిఓసి లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టొప్పో , సీఈఓ పురుషోత్తం ,ఆర్ డి ఓ,తహసీల్దార్ లు , వ్యవసాయ శాఖ అధికారి , సివిల్ సప్లై, ఎంపిడిఒ, వ్యవసాయ అధికారులు,ఎంపీవో లు, లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సర్వే పురోగతి పై అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామసభ లకు విస్తృత ఏర్పాట్లు చేయాలని గతంలో నిర్వహించిన ప్రజపాలన గ్రామసభల మాదిరిగానే 21 నుండి చేపట్టే గ్రామ సభలను నిర్వహించాలని, ప్రతీ రోజు ఒక గ్రామ పంచాయతీ లో మాత్రమే గ్రామ సభలు నిర్వహించాలని, గ్రామ సభలకు హాజరయ్యే ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డ్ లు జారీ చేయడం జరుగుతుందని రేషన్ కార్డుల జారీ ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరం ప్రక్రియ అని చివరి లబ్ధిదారుల వరకు అందించడం జరుగుతుందని ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ నెల 21 నుంచి 24 వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలన లో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించడం జరుగుతుందని ప్రస్తుతం ప్రచారంలో ఉన్న రేషన్ కార్డ్ ల లబ్ధిదారుల జాబిత కులగణన (సామాజిక) సర్వే ఆదారంగా తయారు చేసిందని ఇది తుది జాబితా కాదని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతుందని , రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో దరఖాస్తులను ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా కూడా కొత్త రేషన్ కార్డులకు లేదా కొత్త సభ్యుల చేర్పులకై దరఖాస్తులు కూడా స్వీకరించడం జరుగుతుందని ఇప్పటికే , గతంలో జరిగిన ప్రజాపాలన సదస్సులలో స్వీకరించిన దరఖాస్తుల జాబితాలో అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పురోగతిలో ఉందని తెలిపారు. ఇంకా మిగిలిన ఫీల్డ్ వెరిఫికేషన్ రేపటి లోగా పూర్తి చేయాలి,గ్రామ సభలో కలెక్ట్ చేసేటప్పుడు హెడ్ ఆఫ్ ద ఫ్యామిలి నంబర్, పేర్లు, ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్ అడ్రస్ తీసుకోవాలి. ఎవరిదైనా పేర్లు మిస్ అయితే ప్రజాపాలన మీ సేవ కేంద్రాల లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.రేషన్ కార్డులకు సంబంధించి ప్రతిదీ రిజిష్టర్ లో నమోదు చేయాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇంటి స్థలం ఉన్న వారి జాబిత ఇంటి స్థలం లేని వారి రెండు జాబితాలను గ్రామ సభలలో ప్రదర్శించాలని, అలాగే కొత్తగా గ్రామ సభలలో వచ్చే దరఖాస్తులను కూడా పరిశీలించాలని సూచించారు.జిల్లాలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులను ఇవ్వడం జరుగుతుందని రేషన్ కార్డుల మంజూరికి దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ నిరంతరం కొన సాగుతుందని స్పష్టం చేశారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతీ భూమికి రైతు భరోసా కల్పించడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ అధికారులు, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా రైతు భరోసా లబ్దిదారులను గుర్తించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కనీసం ఇరవై రోజుల పాటు కూలి పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింప చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ కుటుంబంలో మహిళల బ్యాంకు ఖాతాల కే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్ని బదిలీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓలు గణేష్, కృష్ణవేణి, డిఆర్డిఓ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, డీహెచ్ఓ మరియన్న, డీఎస్ఓ ప్రేమ్ కుమార్, డీపీఓ హరిప్రసాద్, డీఏఓ విజయనిర్మల, వివిధ మండలాల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తహసీల్దార్ లు, ఎం.పి.డి.ఓ.లు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలుకై గ్రామ సభలు

**ఎంపీడీవో మారయ్య**

**విశ్వంభర, నాగారం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుకై గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కే మారయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుండి 24 వరకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కు సంబంధించి పైన చూసిన తేదీలలో గ్రామ సభలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు గ్రామ సభకు హాజరై వారి యొక్క పథకాలకు సంబంధించిన వివరాలను అధికారులకు అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ముగిసిన క్రీడాపోటీలు



**విశ్వంభర, నాగారం:** ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సావిత్రమ్మ జ్ఞాపకార్థం గా నిర్వహించిన గ్రామీణ స్థాయి క్రీడలు ముగియనున్నట్లు మాజీ ఎంపీపీ కూరం మణి వెంకన్న తెలిపారు. చివరి రోజు క్రీడల్లో భాగంగా క్యారం చెస్ స్కిప్పింగ్ కుర్చీలాటలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుంది అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి గ్రామస్థాయి నుండి జిల్లా రాష్ట్ర స్థాయి వరకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబయ్య సైదులు సోమయ్య సత్తయ్య చిరంజీవి భద్రయ్య వెంకన్న అంజి బాలస్వామి పందు అనిల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి రేపు మహాధర్నా

**చలో నల్గొండ మహా ధర్నాలో పాల్గొననున్న కేటీఆర్**



**విశ్వంభర, మిర్యాలగూడ:** రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరికి నిరసనగాలి'నల్గొండలో ఈ నెల 21వ తారీకున మంగళవారం రోజున ఉదయం పది గంటలకు గడియారం సెంటర్ నందు చేపట్టబోయే చలో నల్గొండ మహాధర్నా కార్యక్రమానికిబిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రివర్యులు కేటీఆర్ విచ్చేయుచున్నారని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు తెలిపారు. ఈ మహాదర్నాకు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, విధ్యార్థి నాయకులు, మహిళలు, రైతులు మరియు కే సి ఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని భాస్కర్ రావు పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో పూర్తి స్థాయిలో రుణమాఫీ కానీ రైతులు , రైతు బంధు రాని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ఘట్టు మైసమ్మ జాతర



**విశ్వంభర, ఘట్కేసర్:** ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని గట్టు మైసమ్మ జాతర ఘనంగా జరిగింది ఈవో భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన గట్టు మైసమ్మ జాతరకు మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనం సమర్పించారు ఘట్కేసర్ మున్సిపల్ చైర్మన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అమ్మవారికి బోనం సమర్పించారు కుటుంబ సభ్యులతో క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు భక్తులు మున్సిపాలిటీ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుండి నగర శివారు నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు 170 మంది పోలీస్ బందోబస్తు తో షిఫ్ట్ లా వారిగా పోలీసులు ట్రాఫిక్ నియంత్రిస్తూ భక్తులకు ఎలాంటి ఆటంకం లేకుండా జాతరను దిగ్విజయంగా పూర్తి చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు వాళ్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో సినిమా నటుడు పోసాని కృష్ణ మురళి భక్తులు మున్సిపల్ సిబ్బంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతుడు బోడరాజు కుటుంబానికి అండగా ఉంటాం



**విశ్వంభర, జూలూరుపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని పాపకొలు గ్రామానికి చెందిన బోడ.రాజు గత కొంతకాలం గా అనారోగ్యంతో మరణించాడు విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి 75 కేజీల బియ్యం అందజేసి కాంగ్రెస్ పార్టీ మీ కుటుంబానికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకుడు నవీన్ రాథోడ్. సేవ దళ్ కార్యదర్శి కోదమూరి కోటేశ్వరరావు ఎంపిటిసి బాను స్వాతి సీనియర్ నాయకులు ఒకటి రంగారావు . యాస నరేష్. ముఖ్య అమ్రు నాయక్ శ్రీనివాస్ యాస రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ పట్టాలు చేసుకుని రూ.కోట్లల్లో ప్రజాధనాన్ని కొల్లగొట్టారు



**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం దేశాయిపల్లి గ్రామంలో రైతులతో కలిసి భూములను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ప్రవీణ్ మాట్లాడుతూ. అక్రమ పట్టాలు తీసుకొని కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని తెలియజేస్తూ దేశాయిపల్లి గ్రామ శివారులోని 338 సర్వే నెంబర్లు 150 ఎకరాల భూమి అన్యాక్రతమైందని 550 ఎకరాల భూమిలో2 25 ఎకరాల భూమి ఫారెస్ట్ అధికారులు తీసుకుంటే 60 ఎకరాలు. రైతులు సాగు చేసుకుంటే మిగిలిన భూమి అక్రమంగా గురైందని ఎండ్ల కాలం నుండి సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు లేవు గాని మిగతా వాళ్లకు పట్టాలు ఎలా వచ్చాయని తన అనుమాయిలకు వందల ఎకరాలు అప్పజెప్పడానికి అప్పటి కలెక్టర్ కేటీఆర్ ఆదేశాలు ఇచ్చినాడని భూమిలో కాస్తకు లేకుండా పట్టా పాస్ బుక్ ఎట్లా ఇచ్చారని రైతుబంధు కోసమే అక్రమ పట్టాలు పొందారని అక్రమంగా పొందిన రైతుబంధు తిరిగి ఇవ్వాలని గత ప్రభుత్వంలో అసలైన రైతులను అధికారులు దగ్గరకు పోయిన పట్టించుకోలేదని రైతు బంధు పేరిట ఎంత దోపిడి జరిగిందో తెలియజేయడానికి ఇదొక నిదర్శమని రైతుబంధు ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏ గతాళి చేస్తున్న నాయకులు గత మీ ప్రభుత్వంలో చేసిన అవినీతి మర్చిపోయారా రైతుబంధు సొమ్మును రాబందుల తిన్నారని తిరిగి రైతుబంధు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని గుట్టలు పుట్టలు కు రైతుబంధు ఇచ్చింది మీ ప్రభుత్వం కాదా ఇలా చేశారు కాబట్టే మిమ్మల్ని పక్కకు పెట్టి మార్పు కోరుకున్నారని మీ తొత్తులకు అండగా ఉండేందుకే మీ పరిపాలన సాగిందని మీ తప్పులను బే షరతుగా ఒప్పుకొని అక్రమంగా స్వాధీనం చేసుకున్న భూములను తిరిగి ఇవ్వాలని లేకుంటే గ్రామ గ్రామాన కాంగ్రెస్ నాయకులు బయటకు తీస్తారని సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇప్పించే విధంగా బిసి రవాణా శాఖ మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కేకే మహేందర్ రెడ్డి సహకారంతో సీఎం గారి దృష్టికి తీసుకోవడం జరుగుతుందని తెలియజేస్తూ ప్రజాధనం ఎలా దోచుకున్నారు చూపెట్టడానికి ఇక్కడికి వచ్చామని అక్రమ పట్టాల వెనుక సూత్రధారి కేటీఆర్ అయితే అప్పటి కలెక్టర్ పాత్రధారి అని ఆయన దగ్గర పనిచేసే వ్యక్తి కను సన్నల్లో జరిగిందని ఎప్పటికైనా ప్రభుత్వం తగిన సాక్షాదారులతో బయటకు తీస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు ఇట్టి కార్యక్రమంలో రైతులు ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పొన్నం పరశు రాముడు, జూపల్లి రాజేశ్వరరావు,మునిగల రాజు, శ్రీకాంత్ గౌడ్ , భైరవేణి రాములు, మిరియాల శ్రీనివాస్ యాదవ్ గుగ్గిళ్ళ భరత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

**ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**



**విశ్వంభర, పరిగి:** పరిగిపట్టణంలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదివారం పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26 నుండి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించబోతున్న రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు.వికారాబాద్ జిల్లాకు 5 లక్షల 84 వేల వ్యవసాయ యోగ్యమైన భూమి కి గాను మొదటి విడత 6000 రూపాయల చొప్పున 350 కోట్ల రూపాయల రైతు భరోసా పథకం ద్వారా రైతుల ఖాతాలో జమ చేస్తున్నామని తెలిపారు.పరిగి నియోజకవర్గం లో 1 లక్ష 49 వేల ఎకరాలకు గాను మొదటి విడత సహాయం క్రింద 6000 రూపాయల రైతు భరోసా క్రింద 90 కోట్ల రూపాయలు పరిగి నియోజకవర్గం వికారాబాద్ జిల్లా వరకు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు.అదే విధంగా రేషన్ కార్డు లను మంజూరు చేశామని ఇంకా లబ్ధి దారులకు గ్రామ సభల ద్వారా అభ్యర్థులను స్వీకరించి వారికి మంజూరు చేస్తామని తెలిపారు..ఇందిరమ్మ ఇండ్లను పారదర్శకంగా లబ్ధి దారులను ఎంపిక చేసి మంజూరు చేస్తామని తెలిపారు..అదే కాకుండా రెండు లక్షల రూపాయల వరకు రైతు రుణమాఫీ చేశామని తెలిపారు దాంట్లో భాగంగా పరిగి నియోజకవర్గానికి 300 కోట్ల రూపాయలు మంజూరు అయిందని తెలిపారు. టిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క ఇంటిని గాని మంజూరు చేయలేదు ఇవ్వలేదని తెలిపారు. పరిగి నియోజక వర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎజాజ్, డిసిసి కార్యదర్శి అక్బర్, దోమ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయకుమార్ రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ యాదయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు అశోక్, ఆంజనేయులు, చిన్న నరసింహులు, వెంకటేష్, సాయి రెడ్డి, జగన్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ 50వ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కూన



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలో శ్రీ శ్రీ చిత్తారమ్మ తల్లిని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ వారి కుటుంబ సభ్యులతో కలిసి మూలమంత్ర జపము, దేవతహోమాలు, పూర్ణాహుతి పూజలో పాల్గొన్నారు.అనంతరం వారు వేద పండితుల అర్చనల మధ్య శ్రీ చిత్తారమ్మ తల్లి ఆశీస్సులు తీసుకున్నారు .ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ... చిత్తారమ్మ దేవి 50వ స్వర్ణోత్సవాల జాతరలో భక్తులు అధిక సంఖ్యలో రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అమ్మవారు అనుకున్న కోరికలు తీర్చే కొంగు బంగారంగా కొలుస్తారని భక్తుల నమ్మకం అన్నారు.రానున్న రోజుల్లో చిత్తారమ్మ దేవి జాతర రాష్ట్రం నలుమూలల నుండి దేవదర్శనం కోసం వస్తారన్నారు రమణ రోజుల్లో ఇది మహా పుణ్యక్షేత్రంగా భక్తులకు దర్శనమిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ భక్తులు, కూన అంతయ్యగౌడ్ పాల్గొన్నారు.

## బాధితురాలికి ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**విశ్వంభర, దేవరుప్పుల:** జనగాం జిల్లా దేవరుప్పల మండలం కి చెందిన ఏషబోయిన అనూష వెన్ను పూస నొప్పి తో బాధపడుతుండగా ఆపరేషన్ వైద్య ఖర్చుల నిమిత్తం 5 లక్షల రూపాయలు ఎల్ ఓ సి నీ అందజేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆమె వెంట నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్ నాయక్ దేవరుప్పుల మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న,లొడంగి అశోక్ ,సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాత్విక్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ నాయకులు సునీల్ రెడ్డి జన్మదిన వేడుకలు



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని హనుమాన్ నగర్ ముత్యాలమ్మ టెంపుల్ దగ్గర దాసాయి గూడెంకు చెందిన కాంగ్రెస్ నాయకులు చిలుముల సునీల్ రెడ్డి బర్త్ డే ని ఆదివారం కాలనీవాసులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సునీల్ రెడ్డిని ఆహ్వానించి శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ఏలేటి ప్రవీణ్ రెడ్డి, మంగళపల్లి వీరారెడ్డి, బంగారు శ్రీధర్, గుంటూరు శంకర్, గురులింగం, కాశయ్య, సిరికొండ నరసింహ రావు, బాలు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలి

**నోడల్ అధికారి అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే**



**విశ్వంభర, చిట్యాల:** ప్రభుత్వం ఈ నెల 26 నుంచి నాలుగు కొత్త పథకాలు అమలు చేయనున్న నేపథ్యంలో అర్హుల జాబితాను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలన చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం మధ్యాహ్నం భూపాలపల్లి నియోజకవర్గం చిట్యాల మండలం లక్ష్మింపూర్ తండా గ్రామ శివారులోని చెంచుపల్లిలో జరుగుతున్న నాలుగు పథకాల లబ్ధిదారుల ఎంపికకు సంబందించి ఫీల్డ్ వెరిఫికేషన్ ను ఎమ్మెల్యే ఆకస్మికంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం తీసుకొస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి, గ్రామసభల ద్వారా అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని ఫీల్డ్ విజిట్ ను పరిశీలించి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా, లబ్ధిదారుల జాబితాను రూపొందించడంలో అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టబోతున్న నాలుగు పథకాలల్లో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని, క్షేత్రస్థాయిలో గ్రామాలల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులను సమన్వయం చేసుకొని వివరాలను సేకరించాలని అక్కడున్న అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే చెంచుపల్లి లో ఆకస్మిక తనిఖీ చేసిన సమయంలో నోడల్ అధికారి మండలంలో అందుబాటులో లేకపోకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. నోడల్ అధికారిపై కలెక్టర్కు ఫిర్యాదు చేసే తగు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

## రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

**విశ్వంభర, మహాదేవపూర్:** మహాదేవపూర్ మండలంలో అర్హులుగా ఉన్న ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డు అందే వరకు క్షేత్రస్థాయి విచారణ ప్రక్రియ కొనసాగుతుందని మాదాపూర్ మండల తహసీల్దార్ ప్రమోద్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన చివరి వ్యక్తికి అందే వరకు రేషన్ కార్డుల పంపిణీ కొనసాగుతూనే ఉంటుందని, ఇప్పుడు కొత్త రేషన్ కార్డుల లిస్ట్ లలో పేర్లు రాని వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. కులగణన, సోషియా ఎకనమిక్ సర్వే, పాత రేషన్ కార్డుల ఆధారంగా పేర్లు నమోదు చేయడం జరిగిందని, వీటిల్లో ఎవరికైనా కార్డులు రాని పక్షంలో గ్రామ సభలలో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి రేషన్ కార్డు అందజేస్తామని, ఎవరు ఇప్పుడు కార్డు రాలేదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రస్తుతం మండలంలోని 18 గ్రామపంచాయతీలలో కుటుంబ ఇంటింటి సర్వేలో రేషన్ కార్డ్ లేదు అని పెట్టుకున్న 728 మందితో కూడిన లిస్ట్ ను గత మూడు రోజులుగా వెరిఫికేషన్ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేయడం జరుగుతుందని, వీటితో పాటు 931 ఉన్న రేషన్ కార్డులో అదనపు కుటుంబ సభ్యులను జతపరచడం కూడా వెరిఫికేషన్ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేస్తారని అన్నారు. ఇంకా ఎవరైనా అర్హులు పై రెండు జాబితాలో లేకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ నెల 21 వ తేదీ నుండి 24 వ తేదీల మధ్య జరగబోయే గ్రామ సభల్లో అర్జీ పెట్టుకోవచ్చని ఆయన ప్రజలకు సూచించారు. ఇది నిరంతర ప్రక్రియ, మండలంలో రేషన్ కార్డులు అర్హులైన అందరికి అందజేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు.

# కుంభమేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక: ప్రధాని మోడీ



**ప్రయాగ్‌రాజ్:** ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చిందన్నారు. ప్రపంచ దేశాల ప్రజలు ప్రయాగ్‌రాజ్‌కు వచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారని తెలిపారు. కుంభమేళాకు పెద్ద సంఖ్యలో వస్తున్న యువతను అభినందించారు. దేశంలోని యువత తమ ఆచార సంప్రదాయాలను తెలుసుకున్నప్పుడే మనమూలాలు బలపడతాయన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ప్రపంచ దేశాల నుంచి వస్తున్న ఆదరణ ప్రతి భారతీయుడికి గర్వకారణమని చెప్పారు.మనసులో మాట పేరుతో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగిస్తారు. అయితే.. ఈ నెలలో చివరి ఆదివారం అయిన జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఉండడం వల్ల నేడు(మూడో ఆదివారం) మన్‌కీ బాత్ 118వ ఎపిసోడ్ ప్రసారం చేశారు. "ఈ రిపబ్లిక్ డే చాలా ప్రత్యేకమైనది. ఈ సంవత్సరం భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతుంది. మన పవిత్రమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన రాజ్యాంగ పరిషత్‌లోని గొప్ప వ్యక్తులందరికీ తలవంచి నమస్కరిస్తున్నాను" అని అన్నారు.

### ఎన్నికల ప్రక్రియను ఈసీ పటిష్ఠం చేస్తోంది..

ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆధునీకరించి, పటిష్ఠం చేస్తోందని ప్రధాని కొనియాడారు. ప్రజాశక్తిని బలోపేతం చేయడానికి సాంకేతికతను ఉపయోగిస్తూ.. నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తుందన్నారు. యువత అంకుర సంస్థల వైపు ఆకర్షితులవుతున్నారని ప్రధాని పేర్కొన్నారు. దీంతో స్టార్టప్ ఇండియా రూపుదిద్దుకుంటోందని.. సమాజంలో పరిస్థితులు మారిపోతున్నాయని అన్నారు. దేశం డిజిటల్ యుగంలోకి ప్రవేశిస్తోందని.. దేశాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని వెల్లడించారు. నేటి యువత తమ అభివృద్ధి గురించి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా కృషి చేస్తోందని వెల్లడించారు. దీపక్ నబం అనే వ్యక్తి తాను స్థాపించిన అంకుర సంస్థ ద్వారా నిరాశ్రయులకు సహాయం చేస్తున్నాడని ప్రశంసించారు.

## పారా గ్లైడింగ్ చేస్తూ.. లోయలో పడిపోయి.. పర్యటకురాలు, ఇన్‌స్ట్రక్టర్ మృతి



**పనాజీ:** పారాగ్లైడింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు వంద అడుగుల ఎత్తు నుంచి లోయలో పడిపోవడంతోపర్యటకురాలు, ఇన్‌స్ట్రక్టర్ మృతి చెందారు. ఈఘటన ఉత్తర గోవాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని పుణెకు చెందిన 27 ఏళ్ల మహిళా పర్యాటకురాలు శనివారం సాయంత్రం గోవాలోని కేరి గ్రామానికి వచ్చింది. సుమల్ నేపాలీ (26) అనే ఇన్‌స్ట్రక్టర్ సహాయంతో పారాగ్లైడింగ్‌కు వెళ్లింది. 100 అడుగుల ఎత్తులో వీరు పట్టుతప్పిలోయలో పడిపోయారు. ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అడ్వెంచర్ స్పోర్ట్స్ కంపెనీ చట్టవిరుద్ధంగా పారాగ్లైడింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. కంపెనీ యజమాని శేఖర్ రైజాదాపై కేసు నమోదు చేశారు.

### హిమాచల్ ప్రదేశ్‌లో మరో ఇద్దరు..

శుక్రవారం హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా, కులు జిల్లల్లో 24 గంటల వ్యవధిలో రెండు వేర్వేరు పారాగ్లైడింగ్ ప్రమాదాల్లో ఇద్దరు పర్యటకులు మరణించారు. గార్సా ల్యాండింగ్ సైట్ సమీపంలో ఒక పారాగ్లైడర్ ప్రమాదవశాత్తూ మరో పారాగ్లైడర్‌ను ఢీకొనడంతో తమిళనాడుకు చెందిన వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు.ధర్మశాల సమీపంలోని ఇంద్రునాగ్ సైట్‌లో పారాగ్లైడింగ్ చేసేందుకు టేకాఫ్ అవుతుండగా పట్టుతప్పి పడిపోవడంతో గుజరాత్‌కు చెందిన వ్యక్తి మరణించాడు.

## సైఫ్ అలీఖాన్‌పై దాడి చేసింది బంగ్లాదేశీయుడే..! కీలక వివరాలు వెల్లడించిన ముంబయి పోలీసులు..!



**ముంబయి:** బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి చేసిన నిందితుడు గురించి ముంబయి పోలీసులకు కీలక విషయాలు వెల్లడించారు. ఆదివారం ఉదయం జరిగిన విలేకరుల సమావేశంలో నిందితుడికి బంగ్లాదేశ్‌తో సంబంధాలు ఉండవచ్చని పోలీసులు పేర్కొన్నారు. ఈ నెల 16న తెల్లవారు జామున 2గంటలకు సైఫ్ అలీఖాన్‌పై అతని ఇంట్లోనే దాడి జరిగింది. బాంద్రా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఇప్పటికే ఓ నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి పేరు మొహమ్మద్ షరీఫుల్ ఇస్లాం షాజాద్‌గా పేర్కొన్నారు పోలీసులు. నిందితుడు దొంగతనం చేయాలనే ఉద్దేశంతో ఇంట్లోకి ప్రవేశించాడని.. అతను బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. అతనివద్ద భారత్‌కు చెందిన గుర్తింపు పత్రాలు లేవని డీసీపీ దీక్షిత్ గేదం తెలిపారు. బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన తర్వాత పేరును విజయ్ దాస్‌గా మార్చుకున్నాడని పేర్కొన్నారు.ఐదారు నెలల కిందట ముంబయికి వచ్చినట్లు వివరించారు. మొదట నిందితుడు హౌస్‌కీపింగ్ ఏజెన్సీలో పని చేసే వాడని పేర్కొన్నారు. నిందితున్ని అరెస్టు చేసిన పోలీసులు.. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి, కస్టడీకి కోరనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రస్తుతం కేసు విచారణ జరుగుతుందన్నారు. నిందితుడిని పోలీసులు శనివారం రాత్రి 2.50గంటలకు థానేలోని హిరానంది ప్రాంతంలో అరెస్టు చేశారు. ఈ ప్రాంతంలోనే కార్మికులతో కలిసి నివాసం ఉంటున్నాడు. బంగ్లాదేశ్ నుంచి భారతదేశానికి రావడానికి అనేకసార్లు తన పేరును మార్చుకున్నాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

## డీఎంకేలో చేరిన సినీ నటుడు సత్యరాజ్ కుమార్తె



**చెన్నై:** సినీనటుడు సత్యరాజ్ కుమార్తె దివ్య సత్యరాజ్ డీఎంకేలో చేరారు.తమిళనాడు ముఖ్య మంత్రి, డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్‌సమక్షంలో ఆదివారం ఆమె డీఎంకే తీర్థం పుచ్చుకున్నారు. పోషకాహార నిపుణురాలైన దివ్య సత్యరాజ్ డీఎంకేలో చేరిన విషయాన్ని ఆ పార్టీ 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఈ కార్యక్రమంలో డీఎంకే ఎంపీ టీఆర్ బాలు, పార్టీ నేతల్లు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు తదితరులు పాల్గొ న్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆమె స్టాలిన్‌ను కలిసిన సమయంలో డీఎంకేలో చేరుతున్నట్లు పెద్ద ఎత్తున ఊహాగానాలు వచ్చా యి. అయితే, అది మర్యాద పూర్వక భేటీయే నని, ఇరు కుటుంబాల మధ్య సన్నిహిత సం బంధాలు ఉన్నట్లు అప్పట్లో ఆమె వివరణ ఇచ్చా రు. తాజాగా డీఎంకేలో చేరిన సందర్భంగా దివ్య మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయాలనేది తన కల అన్నారు. చిన్ననాటి నుంచే డీఎంకే విధానాలను ఇష్టపడినట్లు చెప్పారు. ఆ పార్టీలో చేరడానికి అనేక కారణాలున్నాయన్న ఆమె.. తానొక పోషకాహార నిపుణురాలినని, డీఎంకే ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చే పార్టీ అన్నారు. అందుకే రాష్ట్రంలో అల్పాహార కార్యక్రమాన్ని సైతం ప్రారంభించిందని తెలిపారు. మహిళ లను, అన్ని మతాలను గౌరవించే పార్టీ డీఎంకే అని పేర్కొన్నారు.

## బాధ్యతల స్వీకరణ తర్వాత భారత్‌లో ట్రంప్ పర్యటన..?



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ మరికొన్ని గంటల్లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన భారత్‌లో పర్యటించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు చైనాలోనూ పర్యటించే అవకాశాలున్నాయని సమాచారం. ఈమేరకు పలు ఆంగ్లపత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. తాను అధికారం చేపట్టాక చైనా దిగుమతులపై సుంకాలు విధిస్తానంటూ ట్రంప్ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో బీజింగ్‌తో తన సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా బాధ్యతల స్వీకరణ అనంతరం చైనాలో పర్యటించనున్నట్లు సమాచారం. మరోవైపు.. భారత్‌లో పర్యటించే అంశంపైనా సలహాదారులతో చర్చలు జరిపినట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. మరికొద్ది నెలల్లో వైట్‌హౌస్‌లో జరిగే దేశాధినేతల సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోడీని ట్రంప్ ఆహ్వానించే అవకాశముంది. ఈ సమావేశాల అనంతరం ఆయన భారత్‌లో పర్యటిస్తారనేది మీడియా కథనాల సారాంశం. అయితే, దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.ఇటీవల ట్రంప్ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ఫోన్‌లో మాట్లాడిన విషయం తెలిసిందే. ప్రపంచశాంతి కోసం ఇరువురం కలిసి సాధ్యమైనంత మేరకు కృషి చేస్తామని ట్రంప్ తెలిపారు. కాబోయే అమెరికా అధ్యక్షుడి ప్రమాణస్వీకారానికి జిన్‌పింగ్ హాజరుకావడం లేదని చైనా ఇదివరకే పేర్కొంది. తమ ప్రతినిధిగా వైస్ ప్రెసిడెంట్ హాన్ జెంగ్‌ను పంపించనున్నట్లు వెల్లడించింది. భారత్ తరఫున విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్ ప్రమాణస్వీకారానికి హాజరుకానున్న విషయం తెలిసిందే. 47వ అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ సోమవారం ప్రమాణం చేయనున్నారు. క్యాపిటల్ హిల్‌లోని రోటుండా ఇండోర్ ఆవరణలో ఈ కార్యక్రమం జరగనుంది. మరోవైపు ప్రమాణస్వీకార నేపథ్యంలో ట్రంప్, ఆయన సతీమణి మెలానియా, కుమారుడు బారన్ లు డల్లాస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు.

## భారత ప్రధాని మోడీతో పాడ్‌కాస్ట్ నిర్వహిస్తా: లెక్స్ ఫ్రిడ్‌మాన్



**వాషింగ్టన్:** భారత ప్రధాని నరేంద్ర మోడీతో తాను త్వరలో పాడ్‌కాస్ట్ నిర్వహిస్తానని అమెరికాకు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశోధకుడు, పాడ్‌కాస్ట్ హోస్ట్ లెక్స్ ఫ్రిడ్‌మాన్ పేర్కొన్నారు. తాను త్వరలో భారత్‌లో పర్యటించనున్నట్లు వెల్లడించారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.'నేను భారత ప్రధాని నరేంద్ర మోడీతో పాడ్‌కాస్ట్ నిర్వహిస్తా. ఇది ఫిబ్రవరి చివరిలో ఉంటుంది. ఇప్పటివరకు భారత్‌ను ఎప్పుడూ సందర్శించలేదు. అక్కడి శక్తిమంతమైన, చరిత్రాత్మక సంస్కృతి, అద్భుతమైన ప్రదేశాలను సందర్శించేందుకు ఎదురు చూస్తున్నా' అని ఫ్రిడ్‌మాన్ రాసుకొచ్చారు. అయితే, ఈ పాడ్‌కాస్ట్‌పై ప్రధాని కార్యాలయం ఎలాంటి ప్రకటన చేయలేదు.ఫ్రిడ్‌మాన్ 2018 నుంచి 'లెక్స్ ఫ్రిడ్‌మాన్' పేరుతో పాడ్‌కాస్ట్‌లు నిర్వహిస్తున్నారు. సైన్స్, టెక్నాలజీ, స్పోర్ట్స్, రాజకీయ రంగాల్లోని ప్రముఖులతో ఇంటర్వ్యూలు చేస్తున్నారు. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ , అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ , అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీలతో సహా అనేక మందిని ఇంటర్వ్యూ చేశారు. ఆయనకు యూట్యూబ్‌లో 4.5 మిలియన్ల మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు.ఇదిలా ఉండగా.. ప్రముఖ వ్యాపారవేత్త, జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహిస్తున్న పాడ్‌కాస్ట్‌లో ఇటీవల ప్రధాని మోదీ పాల్గొన్న విషయం తెలిసిందే. అందులో రాజకీయాలు, వ్యవస్థాపకత, నాయకత్వ సవాళ్లు వంటి అనేక అంశాలపై ఇరువురూ చర్చించారు.

## యుద్ధాన్ని పునఃప్రారంభించే హక్కు మాకు ఉంది: నెతన్యాహు



**జెరూసలెం:** ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం నేపథ్యంలో తాజాగా కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధాన్ని పునఃప్రారంభించే హక్కు తమకు ఉందంటూ వ్యాఖ్యానించారు. 'అంగీకరించినట్లుగా విడదల చేయనున్న బందీల జాబితాను మేము స్వీకరించే వరకు ముందుకు సాగలేం. ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే ఇజ్రాయెల్ సహించదు. హమాస్ మాత్రమే బాధ్యత వహించాలి' అని ప్రధాని కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. అమెరికా మద్దతుతో యుద్ధాన్ని తిరిగి ప్రారంభించే హక్కు తమకు ఉందని నెతన్యాహు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.గత 15 నెలలుగా ఇజ్రాయెల్- హమాస్ మధ్య పోరుతో గాజా అట్టుడికింది. ఈ నేపథ్యంలో అమెరికా, ఈజిప్ట్, ఖతార్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇది స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 8:30 గంటల నుంచి అమల్లోకి వస్తోంది. మూడు దశల్లో కొనసాగే ఈ ఒప్పందానికి ఇజ్రాయెల్ క్యాబినెట్ సైతం ఆమోదించింది. తొలి దశలో 42 రోజులు తాత్కాలిక కాల్పుల విరమణ కొనసాగుతుంది. ఈక్రమంలోనే తమ చెరలో ఉన్న 33 మంది బందీలను హమాస్ విడుదల చేయనుంది. ఇందుకు ప్రతిగా తమ కారాగారాల్లో ఉన్న 737 మంది పాలస్తీనా ఖైదీలకు ఇజ్రాయెల్ స్వేచ్ఛ కల్పించనుంది. ఖైదీలతో పాటు.. 2023 అక్టోబరు 7న హమాస్ చేసిన దాడులతో సం బంధం లేని 1,167 మంది గాజా వాసులకూ స్వేచ్ఛ కల్పించనుంది. తొలి దశలో జనావాస ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ దళాలు వైదొల గనున్నాయి.భారీస్థాయిలో మానవతా సాయం కూడా గాజాలోకి ప్రవేశిం చనుంది. రెండో దశలో మిగిలిన బందీలను హమాస్ విడుదల చేస్తుంది. అయితే ఇందుకు కాల్పుల విరమణను శాశ్వత కాల్పుల విరమణగా మార్చేందుకు ఇజ్రాయెల్ అంగీకరించాలి.

## నా కుమారుడికి మరణ శిక్ష విధించండి ఆర్జీకర్ కేసు దోషి తల్లి



**కోల్‌కతా:** ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌ను కోల్‌కతా కోర్టు దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై అతడి తల్లి స్పందించారు. తన కొడుకు తప్పు చేస్తే కచ్చితంగా తగిన శిక్ష విధించాలని పేర్కొన్నారు. తన కుమారుడు చేసిన తప్పును ఓ మహిళగా ఎప్పటికీ క్షమించనని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని.. వైద్యురాలు పడిన బాధను.. నరకాన్ని అర్థం చేసుకోగలనని ఆవేదన వ్యక్తం చేశారు."నా కొడుకు చనిపోతే నేను ఏడుస్తానేమో.. కానీ ఓ అమ్మాయి పట్ల ప్రవర్తించిన తీరుకు.. సంజయ్‌కు జీవించే హక్కు లేదు. అతడికి మరణ శిక్ష విధించినా మాకు ఎటువంటి అభ్యంతరం లేదు. వైద్యురాలు నాకు కూతురితో సమానం. కుమార్తెకు ఇటువంటి పరిస్థితి వస్తే ఏ తల్లీ ఊరుకోదు" అని ఆమె అన్నారు.

ఈ కేసుపై సుప్రీం కోర్టుకు వెళ్తారా అని మీడియా అడిగిన ప్రశ్నకు సంజయ్ సోదరి మాటాడుతూ.. ఆ ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. అతడు ఇలాంటి దారుణానికి ఒడిగడతాడని తామెప్పుడూ అనుకోలేదన్నారు. అయితే నేరం జరిగిన ప్రాంతంలో సంజయ్‌తో పాటు మరికొంతమంది ఉన్నట్లు కథనాలు వస్తున్నాయని.. ఈ విషయంపై పోలీసులు, సీబీఐ క్షుణ్ణంగా దర్యాప్తు చేసి.. తగిన శిక్ష విధించాలని కోరారు.దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో ముద్దాయికి ఎంతకాలం శిక్ష విధించబోయేదీ సోమవారం ప్రకటించనున్నట్లు కోల్‌కతాలోని సియాల్దా అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి అనిర్బన్ దాస్ శనివారం తెలిపారు. 31 ఏళ్ల వైద్యురాలి మృతదేహాన్ని గత ఏడాది ఆగస్టు 10న ఆసుపత్రి సమావేశ గదిలో గుర్తించిన విషయం తెలిసిందే. ఘటన జరిగిన 162 రోజుల తర్వాత ఈ కేసులో తీర్పు వచ్చింది.

## కేజ్రీవాల్ కాన్వాయ్‌పై దాడి.. బీజేపీ గూండాల పనే: అతిశీ

**ఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగిన



విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ స్పందించారు. ఈ దాడి బీజేపీ గూండాల పనేనని ఆరోపించారు. దాడి చేసిన వారికి ఆ పార్టీకి చెందిన వ్యక్తులతో సంబంధాలు ఉన్నాయని వెల్లడించారు.రోహిత్ త్యాగి, సాంకీ అనే ఇద్దరి వ్యక్తుల ఫొటోలను అతిశీ విడుదల చేశారు. వారే ఈ దాడికి పాల్పడినట్లు ఆరోపించారు. 'శనివారం అరవింద్ కేజ్రీవాల్ కారుపై దాడి జరిగింది. కాషాయ పార్టీకి చెందిన గూండాలు ఈ దాడికి పాల్పడ్డారు. దాడికి పాల్పడిన రాహుల్ అలియాస్ సాంకీకి బీజేపీ నేత పర్వేశ్ వర్మతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆయన ప్రచారంలోనూ దుండగుడు పాల్గొన్నాడు. అతడిపై హత్యాయత్నం, దోపిడీ వంటి అనేక కేసులున్నాయి. అలాంటి నేరస్థులను కేజ్రీవాల్‌పై దాడికి పంపించినట్లు స్పష్టమవుతోంది. పర్వేశ్ వర్మతో రోహిత్ త్యాగి దిగిన ఫొటోలు ఉన్నాయి. అతడిపైనా తీవ్ర నేరారోపణలు ఉన్నాయి' అని అతిశీ ఆరోపించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శనివారం న్యూఢిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్ ఇంటింటి ప్రచారం చేపట్టారు. అదే సమయంలో కొందరు దుండగులు ఆయన కాన్వాయ్‌పై రాళ్లు రువ్వారు. ఓటమి భయంతోనే భాజపా ఈదాడికి పాల్పడినట్లు ఆప్ ఆరోపించింది. అయితే, ఈ ఆరోపనలను కమలం పార్టీ ఖండించింది. దిల్లీలో ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి.

## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు..

**ఢిల్లీ:** దేశంతోనూ కాంగ్రెస్ పోరాడుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ (చేసిన



వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై గువాహటిలో పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. మోన్‌జిత్ చాటియా అనే వ్యక్తి ఈ ఫిర్యాదు చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వాక్ స్వాతంత్ర్య పరిమితులను దాటాయని, అవి జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగిస్తాయని చాటియా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు అశాంతితో పాటు, వేర్పాటువాద భావాలు కలిగిన వారిని రెచ్చగొట్టే ప్రమాదం ఉందన్నారు. 'ప్రతిపక్ష నాయకుడిగా.. ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత రాహుల్‌కు ఉంది. కానీ, ఆయన అందుకు బదులుగా అబద్ధాలు వ్యాప్తి చేసి దేశ ఐక్యతను, సార్వభౌమత్వాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు' అని చాటియా ఆరోపించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నూతన ప్రధాన కార్యాలయాన్ని ఇటీవల ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'ఆరెస్సెస్ వంటి మా భావజాలం వేల సంవత్సరాల నాటిది. బీజేపీ, ఆరెస్సెస్ దేశంలోని ప్రతి సంస్థను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయి. మేము ఇప్పుడు భాజపా, ఆరెస్సెస్‌తోపాటు భారత దేశంపై కూడా పోరాడుతున్నాం' అని వ్యాఖ్యానించారు. ఈవ్యాఖ్యలను పలువురు కేంద్ర మంత్రులు తప్పుబట్టారు. కాంగ్రెస్ అసలురూపం ఈ వ్యాఖ్యలతో బయటపడిందని బీజేపీ జాతీయాధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా వ్యాఖ్యానించారు.

## గంగా నదిలో పడవ బోల్తా.. ముగ్గురు మృతి, నలుగురు గల్లంతు

పాట్నా: గంగా నదిలో పడవ బోల్తా పడింది. ఈ సంఘటనలో ముగ్గురు మరణించారు. మరో నలుగురు గల్లంతయ్యారు. రెస్క్యూ బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. గల్లంతైన వారి కోసం నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. బీహార్‌లోని కతిహార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం 17 మందితో కూడిన పడవ అమ్దాబాద్ ప్రాంతంలోని గోలాఘాట్ సమీపంలో గంగా నదిలో బోల్తా పడి మునిగింది. అప్రమత్తమైన కొందరు ఈదుకుంటూ నది ఒడ్డుకు చేరుకున్నారు.కాగా, పడవ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు, అధికారులు అక్కడకు చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. నదిలో పడిన పది మందిని రక్షించారు. ఈ సంఘటనలో ముగ్గురు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఇద్దరు మృతులను 60 ఏళ్ల పవన్ కుమార్, 70 ఏళ్ల సుధీర్ మండల్‌గా గుర్తించినట్లు చెప్పారు. మరణించిన మరో వ్యక్తిని ఇంకా గుర్తించలేదన్నారు.మరోవైపు పడవ బోల్తాపడిన ఘటనలో నలుగురు వ్యక్తులు గంగా నదిలో గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. వారి కోసం సహాయక, గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పడవలో ఎక్కువ మంది ప్రయాణించడం వల్లనే బోల్తా పడి మునిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. పడవ ప్రమాదంపై దర్యాప్తునకు ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ మనేష్ కుమార్ మీనా వెల్లడించారు.

# ఆంధ్ర అభివృద్ధికి అహర్నిశలు కంకణ బద్ధులమై ఉంటాం: కేంద్రమంత్రి అమిత్ షా





**విశ్వంభర, అమరావతి :** కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా కృష్ణా జిల్లాగన్నవరం మండలం కొండపావులూరులో రూ.160 కోట్లతో నూతనంగా నిర్మించిన జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ( ఎన్ఐడీఎం), ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ కంకణ బద్ధులై ఉన్నారనివెల్లడించారు.వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఏవిధంగా ధ్వంసం చేసిందో అందరికీ తెలిసిందే. అప్పుడు జరిగిన విధ్వంసం గురించి చింతించకండి. ఏపీ అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబుకు ప్రధాని మోడీ అండదండలు ఉన్నాయి. మోడీ, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో మూడింతల ప్రగతి సాదిస్తామన్నారు. గత ప్రభుత్వం రాజధాని అమరావతిని బుట్టదాఖలు చేసింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతి రాజధాని నిర్మాణానికి 27 వేల కోట్లను హడ్కో, ప్రపంచ బ్యాంక్ ద్వారా రుణాలుగా అందించారని తెలిపారు. విశాఖ స్టీల్ కర్మాగారానికి ఇటీవల రూ.11,440 కోట్లను మంజూరు చేశారని వెల్లడించారు. ఆంధ్రుల ఆత్మగౌరవంతో ముడిపడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ముందుకు తీసుకెళ్తామన్నారు. ఏపీకి జీవనాడి అయిన పోలవరంపై సీఎం చంద్రబాబుతో చర్చించాను.జాతీయ ప్రాజెక్టు పోలవరానికి నిధులు మంజూరు చేసినందున 2028 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పోలవరం జలాలు అందుతాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.విశాఖ రైల్వేజోన్‌ను కూడా పట్టాలెక్కించాం." అని అమిత్ షా అన్నారు.విశాఖపట్నంలో గ్రీన్ పార్కు నిర్మాణానికి రూ. 2లక్షల కోట్లతో పెట్టుబడులతో పనులు ప్రారంభించారని వివరించారు. విశాఖ రైల్వే జోన్‌ను కూడా పట్టాలెక్కించామని ఆయన అన్నారు. దేశంలో ఉన్న జాతీయ విపత్తు బృందం సమర్థవంతంగా సేవలందిస్తుందని పేర్కొన్నారు. నేపాల్, తుర్కియే తదితర దేశాల్లో ఎన్డీఆర్ఎఫ్ సేవలు అందించిందని అన్నారు .ఏపీ ఎన్నికల్లో కూటమికి అనూహ్య విజయం అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. విపత్తుల వేళ ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని చూస్తే ప్రజలు నిశ్చింతగా ఉంటారని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా అన్నారు. ఎన్డీఆర్ఎఫ్ సేవలను ఇతర దేశాల నేతలూ ప్రశంసించారని గుర్తుచేశారు. 'ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు బండి సంజయ్, రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు.

### కేంద్రం సహకారంతో 'వెంటిలేటర్' నుంచి ఏపీ బయటపడింది: సీఎం చంద్రబాబు

**విశ్వంభర, గన్నవరం:** ఏ విపత్తు వచ్చినా ఎన్డీఆర్ఎఫ్ మొదట గుర్తొస్తుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. జపాన్, నేపాల్, తుర్కియేలో ప్రకృతి విపత్తులు వచ్చినపుడు సేవలు అందించిందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర యంత్రాంగం పరిష్కరించలేని సమస్యలను ఎన్డీఆర్ఎఫ్ పరిష్కరించిందని చెప్పారు. విజయవాడ సమీపంలోని కొండపావులూరులో నిర్వహించిన ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో కలిసి చంద్రబాబు పాల్గొన్నారు. "5 రాష్ట్రాలకు శిక్షణ ఇచ్చేలా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ఐడీఎం) ప్రాంగణాన్ని ఏర్పాటుచేశాం.ఎన్డీఆర్ఎఫ్10వ బెటాలియన్,ఎన్ఐడీఎం ప్రాంగణాలకు 50ఎకరాల భూమి కేటాయించాం. వీటిని పూర్తిచేసిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. దేశంలో సమస్యల పరిష్కారానికి అమిత్‌షా పట్టుదలతో కృషిచేస్తున్నారు. శాంతిభద్రతలు కాపాడటం సహా చాలా విషయాల్లో ఆయన వినూత్నంగా ఆలోచిస్తారు. కొన్నిసార్లు అమిత్‌షా పనితీరు చూస్తే నాకు అసూయ కలుగుతుంది. ఏపీపునర్నిర్మాణంలో వినూత్నంగా ముందుకెళ్లాలని అమిత్‌షా సూచించారు. ఎన్నికల్లో 93 శాతం స్ట్రైక్ రేట్‌తో ఘన విజయం సాధించాం.ఎన్నికల సమయానికి రాష్ట్రం వెంటిలేటర్‌పై ఉంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆ స్థితి నుంచి బయటపడింది. ఏపీ ఇంకా కోలుకోలేదు. రాజధాని అమరావతికి కేంద్రం నుంచి రూ.15వేల కోట్లు ఇచ్చారు.. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్ల ఆర్థికసాయం చేసి ప్రాణం పోశారు. ఇటీవల విశాఖ రైల్వేజోన్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు కేంద్రం మద్దతు ఇంకా కావాలి. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకత్వంలో పోలవరం డయాఫ్రమ్ వాల్ పనులు జరుగుతున్నాయి. కేంద్రం మద్దతుతో ఏప్రిల్ 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తాం" అని చంద్రబాబు తెలిపారు.

### మోడీ, అమిత్‌షాకు ధన్యవాదాలు: పవన్

అంతకుముందు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాట్లాడారు. ప్రమాదాల నుంచి లక్షల మందిని ఎన్డీఆర్ఎఫ్ కాపాడిందన్నారు. రాష్ట్రంలో జరిగిన ఎల్జీ పాలిమర్స్, అచ్యుతాపురం సెజ్ ఘటనలు.. విజయవాడ వరదల సమయాల్లో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అందించిన సేవలను పవన్ గుర్తుచేశారు. దక్షిణ భారత్‌కు సంబంధించి ఎన్డీఆర్ఎఫ్ ప్రధాన కేంద్రాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయడంపై ప్రధాని మోదీ, అమిత్‌షాకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# తిరుమల శ్రీవారికి రూ. 6 కోట్ల విరాళం



**విశ్వంభర, తిరుమల:** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి చెన్నైకి చెందిన వర్ధమాన్ జైన్ అనే భక్తుడు భూరి విరాళం సమర్పించారు. రూ.6 కోట్ల మొత్తాన్ని టీటీడీ ట్రస్టులకు ఇచ్చారు. ఎస్వీబీసీ కోసం రూ.5 కోట్లు, గోసంరక్షణ ట్రస్టు కోసం రూ. కోటి విలువైన డీడీలను రంగనాయకుల మండపంలో తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. టీటీడీకి చెందిన వివిధ ట్రస్టులకు ఆయన గతంలోనూ భారీగా విరాళాలు ఇచ్చారు.

## అయోధ్య రాముడికి టీటీడీ పట్టు వస్త్రాలు

అయోధ్య రాముడికి టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు పట్టువస్త్రాలు సమర్పించారు. సతీసమేతంగా అయోధ్య ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ బృందం స్వాగతం పలికింది. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఆలయంలోని వెళ్లి అయోధ్య రాముడికి పట్టువస్త్రాలు సమర్పించారు. తితిదే బృందానికి అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తితిదే బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, హెచ్ డీపీపీ సెక్రెటరీ శ్రీరామ్ రఘునాథ్, శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, అర్చకులు గోపీనాథ్ దీక్షితులు, బొక్కసం ఇన్ ఛార్జి గురురాజ స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గిరిజనులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి: వెంకయ్యనాయుడు



**విశ్వంభర, విజయవాడ:** గిరిజనులు సంఘటితంగా ఉంటూ నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. విజయవాడ తుమ్మలపల్లిలో నిర్వహించిన గిరిజన ఆదివాసీ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. గిరిజన ఉత్పత్తులకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని, వాటికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు.ఆదివాసీల అభివృద్ధికి ప్రధాని మోదీ అనేక పథకాలు తెస్తున్నారన్న వెంకయ్యనాయుడు.. వాటిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు మార్గనిర్దేశం చేయాలన్నారు. తండాల్లో అక్షరాస్యత పెంపునకు పెద్దపీట వేయాలన్నారు. గిరిజనులు వారి స్వభాషతోపాటు తెలుగు, ఆంగ్లం నేర్చుకోవాలని పిలుపునిచ్చారు.

# నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలి: మాజీ ఎమ్మెల్యే వర్మ



**విశ్వంభర, పిఠాపురం:** టీడీపీ సభ్యత్వాలు కోటి చేయించిన ఘనత మంత్రి నారా లోకేశ్‌కే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. తెదేపాకు భవిష్యత్తు లేదన్న వారందరికీ 'యువగళం'తో ఆయన సమాధానం చెప్పారన్నారు. నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని కోరారు. పిఠాపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వర్మ మాట్లాడారు."నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలి. ఎవరి పార్టీ కార్యకర్తల మనోభావాలు వారికి ఉంటాయి. దీనిపై కొన్ని సోషల్ మీడియా, మీడియా ఛానళ్లు వక్రభాష్యం చేయడం సరికాదు. లోకేశ్ కష్టాన్ని గుర్తించాలని క్యాడర్ కోరుకోవడంలో తప్పేముంది? ఓడిపోయి, భవిష్యత్తు ఏంటో కూడా తెలియని జగన్నే సీఎం..సీఎం అంటున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను జనసేన కార్యకర్తలు సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. అలాంటిది పార్టీని బలోపేతం చేసి, కార్యకర్తల్లో ధైర్యం నింపిన లోకేశ్‌ను డిప్యూటీ సీఎం అంటే తప్పేంటి. కరడుగట్టిన తెదేపా కార్యకర్తగా ఆయన డిప్యూటీ సీఎం కావాలని కోరుకుంటున్నా. ఇది నా ఒక్కడి అభిప్రాయం కాదు.. కార్యకర్తల మనసులోని మాట. చివరికి పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు తీసుకునే నిర్ణయమే కార్యకర్తలందరికీ శిరోధార్యం" అని వర్మ అన్నారు.

# ఏపీకి కేంద్రం అందిస్తున్న సాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి: బీజేపీ నేతలతో అమిత్‌షా



**విశ్వంభర,విజయవాడ:** నగరంలోని నోవాటెల్ హెూటల్‌లో ఏపీ బీజేపీ నేతలతో కేంద్రహెూంమంత్రి అమిత్‌షా సమావేశం ముగిసింది. సుమారు గంటన్నరపాటు ఈ భేటీ కొనసాగింది. కీలక అంశాలపై రాష్ట్ర బీజేపీ నేతలకు అమిత్‌షా దిశానిర్దేశం చేశారు. ఏపీకి కేంద్రం అందిస్తున్న సాయం, రాష్ట్ర అభివృద్ధికి చేపడుతున్న చర్యలు, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. అంతర్గత విభేదాలను పక్కన పెట్టి రాష్ట్రంలో భాజపా బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. 'హైందవ శంఖారావం' సభ విజయం పట్ల పార్టీ, వీహెచ్‌పీ నేతలకు అమిత్‌షా అభినందనలు తెలిపారు. తిరుమల తొక్కిసలాట ఘటనపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. దీనిపై కేంద్రహెూంశాఖ దృష్టిపెట్టిందని అమిత్‌షా చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నేతలు ముందుకెళ్లాలని ఆయన సూచించారు.

# కూటమి నేతలు తిరుమల టికెట్లు అమ్ముకుంటున్నారు భూమన కీలక వ్యాఖ్యలు



**విశ్వంభర,తిరుమల :** ఏపీ కూటమి నేతలపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మున్నెన్నడూ లేని విధంగా తిరుమలలో దురాగతాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆదివారం తిరుపతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు టికెట్లు అమ్ముకుంటు సంపదను సృష్టించుకుంటున్నారని విరుచుకుపడ్డారు.కూటమి అధికారంలోకి వచ్చాక తిరమలలోఏదో ఒకటి అపచారం జరుగుతుందని, అధికారుల అలసత్వం, అవినీతి విచ్చల విడిగా కనిపిస్తోందని ఆరోపించారు. కూటమి నాయకుల అండ చూసుకుని ఎర్రచందనం స్మగ్లింగ్ జోరుగా జరుగుతుందని, ఇటీవల నాలుగుసార్లు తిరుమలలో ఎర్రచందనం దొరికిందని పేర్కొన్నారు. ఏడుకొండల స్వామి కొలువుదీరిన ప్రాంతంలో మద్యం , బిర్యానీలు లభ్యమవుతున్నాయని, మాడ వీధుల్లో కూడా చెప్పులు వేసుకుని తిరుగుతున్నారని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని విమర్శించారు.అధికారంలోకి వచ్చాక తిరుమలను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని చెప్పి ఆలయ పవిత్రతను సర్వనాశనం చేస్తున్నారని కేంద్రం గుర్తించిందని అన్నారు. తిరుమలలో జరుగుతున్న వరుస ఘటనల నిగ్గు తేల్చేందుకు కేంద్ర హెూంశాఖ కార్యదర్శి దర్యాప్తుకు ఆదేశించగా రాత్రికి రాత్రే ఈ ఉత్తర్వులను వెనక్కి తీసుకుందని ఆరోపించారు.

# విజయవాడలో అమిత్ షాకు గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ వామపక్షాల నిరసన

**విశ్వంభర, అమరావతి :**
కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాకు విజయవాడలో వామపక్షాల నుంచి నిరసనలు తగిలాయి. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానపరిచినందుకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తు అమిత్ షా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు.సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ పార్లమెంట్ వేదికగా అంబేద్కర్‌ను అవమానపరిచిన అమిత్ షాకు ప్రధాని నరేంద్ర మోదీ మద్దతు ఇవ్వడం దారుణమని అన్నారు.
కేంద్రమంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని సీపీఎం నాయకుడుఉమా మహేశ్వరరావు డిమాండ్ చేశారు.ఏపీ కాంగ్రెస్ ఆధ్వర్యంలోనూ రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో నిరసనకార్యక్రమాలను నిర్వహించారు.
కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా గన్నవరం మండలం కొండపావులూరులో రూ. 160 కోట్లతో నూతనంగా నిర్మించిన జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ( ఎన్ఐడీఎం) జాతీయ విపత్తు ప్రతి స్పం దన దళం 10వ బెటాలియన్ కేంద్రాలను ఆదివారం ప్రారంభించేందుకు విజయవాడకు వచ్చారు.



# చంద్రబాబు భజనను పెంచిన పవన్‌కల్యాణ్ : అంబటి సంచలన వ్యాఖ్యలు

**విశ్వంభర, అమరావతి :** ముఖ్యమంత్రి చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ భజన పెంచారని వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. నారా లోకేష్ తండ్రి భజనను తగ్గించగా పవన్‌కల్యాణ్ పెంచారని విమర్శించారు. ఆదివారం తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో అంబటి రాంబాబు మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు.రాష్ట్రంలో అసమర్థపాలన కొనసాగుతుందని, , ప్రభుత్వానికి దేనిపైనా కూడా కంట్రోల్ లేదని విమర్శించారు. కేంద్ర మంత్రి అమిత్ షా పర్యటన సందర్భంగా రాష్ట్రంలో అనేక సమస్యలుండగా వైఎస్ జగన్ ప్యాలెస్‌లోపై ఆరోపణలు చేయడం దౌర్భాగ్యకరమని పేర్కొన్నారు. సందు దొరికితే చాలు వైఎస్ జగన్‌పై బురద చల్లాలనే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.
చంద్రబాబు మాదిరిగా క్విడ్‌ప్రోకు పాల్పడి ఇళ్లను తీసుకోలేదని విమర్శించారు. విశాఖ ప్లాంట్ ప్రైవేటీకరణ రద్దు గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన తరువాత ఎన్నో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, తెలంగాణ నుంచి రూ. 8 వేల కోట్ల విద్యుత్ బకాయిలున్నాయని, వాటి గురించి ఎందుకు మాట్లాడలేదని అన్నారు. చంద్రబాబు అవివేకం వల్లే పోలవరం డయాఫ్రం వాల్ దెబ్బతిందని మరోసారి ఆరోపించారు.తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ముమ్మాటికి మానవతప్పిదంతోనే జరిగిందని దుయ్యబట్టారు. గతంలో ఎప్పుడూ కూడా తిరుమలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదని వెల్లడించారు. తిరుమలలో జరుగుతున్న మానవతప్పిదాలపై ఎన్డీయే ఎందుకు విచారణ జరిపించడం లేదని అంబటి నిలదీశారు.



### నారా లోకేష్‌పై అమిత్ షా ఫిర్యాదు..

రాష్ట్రంలో చంద్రబాబు తనయుడు, మంత్రి నారా లోకేష్ ప్రవర్తన తీరుపై అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తమ వద్ద సమాచారం ఉందని అంబటి రాంబాబు పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎక్కడపడితే అక్కడ వసూళ్ల కార్యక్రమాన్ని చేస్తున్నారని , ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని , లోకేష్‌ను కంట్రోల్‌లో పెట్టాలని అమిత్ షా చంద్రబాబుకు సూచించారని తెలిపారు. చంద్రబాబుకు గత్యంతరం లేకనే పవన్‌ను డిప్యూటీ సీఎంగా చేశారని విమర్శించారు.

# అనంతపురం జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

విశ్వంభర, అమరావతి : అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ద్విచక్ర వాహనదారులు అక్కడికక్కడే మృతి చెందారు. రెండు ద్విచక్ర వాహనాలు ఎదురుగా వచ్చి ఢీ కొనడంతో ఇద్దరూ కిందపడ్డారు. అదే సమయంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.మృతులు శెట్టూరు మండలం లక్ష్మ%శీ%పల్లి గ్రామానికి చెందిన ఫరూక్ (25), నాసిర్ (18)గా గుర్తించారు. సంఘటనా స్థలానికి కళ్యాణదుర్గం పోలీసులు చేరుకుని మృతదేహాలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

# నెల్లిమర్ల మిమ్స్ కళాశాలలో వైద్య విద్యార్థి ఆత్మహత్య

విశ్వంభర, నెల్లిమర్ల: విజయనగరం జిల్లా నెల్లిమర్ల మిమ్స్ వైద్య కళాశాల విద్యార్థి అటుకూరి సాయిమణిదీప్(24) బలవన్మరణానికి పాల్పడ్డాడు. వసతిగృహంలోని తన గది తలుపులు తీయకపోవడంతో తోటి విద్యార్థులు తలుపులను తెరిచి చూసేసరికి సాయిమణిదీప్ అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే మిమ్స్ యాజమాన్యానికి సమాచారం అందించారు. అనంతరం పోలీసుకులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. సాయిమణిదీప్ రెండో ఏడాది ఎంబీబీఎస్ పరీక్ష తప్పడంతో మానసికంగా ఆందోళనకు గురైనట్లు ఎస్ఐ తెలిపారు. తోటి విద్యార్థులంతా చదువు పూర్తి చేసి వెళ్లిపోతారని, తీవ్ర మనస్తాపానికి గురైన విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థి స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు.



# ఆంధ్ర, తమిళనాడు సరిహద్దు జిల్లాల్లో ఏనుగులు బీభత్సం.. ఏనుగుల దాడిలో టీడీపీ నేత మృతి

విశ్వంభర, తిరుపతి : ఆంధ్ర, తమిళనాడు సరిహద్దు జిల్లాల్లో ఏనుగులు బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. ఏనుగుల దాడిలో మరో వ్యక్తి మృతి చెందడం కలకలం రేపుతుంది. ఏపీలోని తిరుపతి జిల్లా చంద్రగిరిలో ఏనుగుల దాడిలో టీడీపీ యువనేత రాకేశ్‌చౌదరి మృతి చెందాడు.కందులవారిపల్లి ఉపసర్పంచ్‌గా, టీడీపీ మండల అధ్యక్షుడిగా ఉన్న రాకేశ్ చిన్న రామాపురం కొంగరవారిపల్లిలో ఏనుగుల గుంపు ఉందన్న సమాచారంతో తోటలోకి వెళ్లాడు. ఏనుగుల రాకను గమనించకపోవడంతో కాళ్లకింద పడి మృతి చెందాడు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని అర్ధరాత్రి ఘటనాస్థలానికి చేరుకుని స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాకేశ్ మరణం టీడీపీకి తీరనిలోటని, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



## అండర్-19 ప్రపంచకప్‌లో వెస్టిండీస్‌ను చిత్తు చేసిన భారత అమ్మాయిలు

**కౌలాలంపూర్:** అండర్-19 టీ20 ప్రపంచ కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత అమ్మాయిలు తొలి మ్యాచ్‌లోనే అదరగొట్టారు. ఆదివారం వెస్టిండీస్‌తో జరిగిన పోరులో భారత్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన విండీస్.. భారత బౌలర్ల ధాటికి 13.2 ఓవర్లలోనే 44 పరుగులకే కుప్పకూలింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ 4.2 ఓవర్లలోనే ఒక వికెట్ కోల్పోయి సునాయసంగా ఛేదించింది. తెలుగమ్మాయి గొంగడి త్రిష (4) నిరాశపర్చగా.. కమిలిని (16*), సానికా చాల్కే (18*) పరుగులు చేశారు. విండీస్ బ్యాటర్లలో అసబి క్యాలెండర్ (12), కెనికా కాసర్ (15) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. టీమ్ఇండియా బౌలర్లలో పరుణికా సిసోదియా 3, జోషిత 2, ఆయుషి శుక్లా 2 వికెట్లు పడగొట్టారు.

# దేశవాళీ క్రికెట్ ఆడడంలో ప్రయోజనం ఉందా?

## కరుణ్ నాయర్‌ను ఎంపిక చేయకపోవడంపై బజ్జీ ఆగ్రహం!



**ముంబయి:** మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ టీమిండియా సెలక్షన్ కమిటీపై మండిపడ్డాడు. చాంపియన్స్ ట్రోఫీకి కరుణ్ నాయర్‌ను ఎంపిక చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. విజయ్ హజారే ట్రోఫీలో కరుణ్ నాయర్ 700 కంటే ఎక్కువ పరుగులే చేశాడు. ఇందులో ఐదు సెంచరీలు ఉన్నాయి. ఫామ్, ప్రదర్శన ఆధారంగా ఆటగాళ్లను ఎంపిక చేయనప్పుడు దేశవాళీ క్రికెట్ ఆడడంలో ఏదైనా ప్రయోజనం ఉందా? అంటూ ట్విట్టర్ వేదికగా ప్రశ్నించాడు. కరుణ్ నాయర్ విజయ్ హజారే ట్రోఫీ చరిత్రలో ఒక సీజన్‌లో ఐదు సెంచరీలు బాదిన రెండో బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. దాదాపు 400 సగటుతో 779 పరుగులు చేశాడు. లిస్ట్-ఏలో టోర్నమెంట్‌లో ఎనిమిది.. అంతకంటే ఎక్కువ మ్యాచులు ఆడిన ఏ బ్యాట్స్‌మన్‌కైనా ఇదే అత్యుత్తమం. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత వన్డే జట్టులో మార్పు చేసే కరుణ్ నాయర్‌కు అవకాశం ఉంది. చాంపియన్స్ ట్రోఫీకి రోహిత్ శర్మ కెప్టెన్‌గా, శుభ్‌మాన్ గిల్ వైస్ కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. అయితే, ప్రస్తుతం రిజర్వ్ ఆటగాళ్ల గురించి టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచించడం లేదని తెలుస్తున్నది. టీమిండియా గురించి మాట్లాడితే ఈ సారి చాంపియన్స్ ట్రోఫీలో యువ ఆటగాడు యశస్వి జైస్వాల్‌కు అవకాశం దక్కింది. దాదాపు 14 నెలల విరామం తర్వాత మహ్మద్ షమీ తిరిగి వన్డే జట్టులోకి చేరాడు. ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌ను సెలక్షన్ కమిటీ పక్కన పెట్టింది. జట్టులో నలుగురు ఆల్‌రౌండర్లకు చోటు కల్పించింది. ఇదిలా ఉండగా మాజీ ఫాస్ట్ బౌలర్ ఇర్ఫాన్ పఠాన్ సైతం చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేసిన జట్టుపై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. జట్టులో గాయపడిన ఆటగాళ్లు ఉన్నారని తెలిసిన సమయంలో జట్టులో మరో ఫాస్ట్ బౌలర్‌ను తీసుకోవచ్చని చెప్పాడు. శుభ్‌మాన్ గిల్ కెప్టెన్సీకి సరైన మార్గంలోనే ఉన్నాడని.. వన్డేల్లో అద్భుతంగా రాణిస్తున్నాడని తెలిపాడు. సిరాజ్‌ను తీసుకోకపోవడానికి కారణం పనిభారం కావచ్చొని చెప్పాడు. అయితే, వన్డేల్లో సిరాజ్ గణాంకాలు బాగున్నాయని గుర్తు చేశాడు. సంజు శాంసన్ విషయంలో నిరాశకు గురైనట్లు తెలిపాడు. సెలెక్టర్లు నితీశ్‌కుమార్ రెడ్డిని సైతం పరిగణలోకి తీసుకోవాల్సిందని పేర్కొన్నారు. మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా సైతం స్పందించాడు. జట్టు బౌలింగ్ విభాగం బలహీనంగా ఉందని పేర్కొన్నారు. ముగ్గురు ఫాస్ట్ బౌలర్లను మాత్రమే ఎంపిక చేశారని.. వారిలో ఇద్దరు ఫిట్‌నెస్ సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. దుబాయి వేదికగా జరిగే టోర్నీకి తానయితే స్పిన్ ఆల్‌రౌండర్‌కు బదులుగా సిరాజ్‌ను తీసుకునేవాడినని చెప్పారు.



## దేశం కోసం జట్టు వెళుతుండగా.. వెంట వారెందుకు?

### యువీ తండ్రి వివాదస్పద వ్యాఖ్యలు

**ముంబయి:** ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ టోర్నీ కోసం బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే భారత మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ తండ్రి యోగ్‌రాజ్ సింగ్ స్పందించారు. ''ఈ టోర్నీ కోసం మంచి ఆటగాళ్లను బీసీసీఐ ఎంపిక చేసింది. అందుకు బీసీసీఐతో పాటు సెలక్టర్లను నేను అభినందించాలనుకుంటున్నా. రోహిత్ శర్మ కెప్టెన్‌గా.. శుభమన్ గిల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. గిల్ భవిష్యత్తులోనూ మంచి నాయకత్వం వహించగలడు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో వరుసగా జరిగిన రెండు టెస్టు సిరీసుల్లో పరాజయం తర్వాత బీసీసీఐ జట్టును మరింత పటిష్టంగా మారుస్తోంది. అందుకు కఠిన మార్గదర్శకాలను రూపొందించింది'' అని యోగ్‌రాజ్ సింగ్ పేర్కొన్నారు. ''బీసీసీఐ నిబంధనల్లో ఆటగాళ్ల కుటుంబాలపై కూడా ఆంక్షలు ఉన్నాయి. మ్యాచ్ కోసం జట్టు ప్రయాణిస్తున్నప్పుడు వారి భార్యలు, పిల్లలు ఉండాల్సిన అవసరం ఏంటి? రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత వారితో కావాల్సినంత సమయం గడపవచ్చు. కానీ, దేశం కోసం ఆడేటప్పుడు వీరంతా అదనపు భారమే అవుతారు. అలాంటప్పుడు వారు మీతో (ఆటగాళ్లను ఉద్దేశిస్తూ) ఎందుకు ఉండాలనుకుంటున్నారు..? ఇప్పుడు జట్టే మీ కుటుంబం'' అని అన్నారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ ఏలో భారత్, పాకిస్థాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ జట్లు ఉన్నాయి. బంగ్లాదేశ్‌తో ఫిబ్రవరి 20న, పాక్‌తో ఫిబ్రవరి 23న, న్యూజిలాండ్‌తో మార్చి 2న టీమ్ఇండియా దుబాయ్ వేదికగా తలపడనుంది. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఈ ఐసీసీ టోర్నీ జరగబోతోంది. దాయాది దేశం పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. భారత్ ఆడే మ్యాచ్‌లు మాత్రం యూఏఈలో జరగనున్నాయి.

**ఛాంపియన్స్ ట్రోఫీ.. భారత జట్టు ఇదే**

రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, హార్దిక్ పాండ్య, కుల్‌దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, షమీ, అర్ష్‌దీప్ సింగ్.

## రోహిత్ బాటలో భారత స్టార్ క్రికెటర్లు



**ముంబయి:** దేశవాళీ క్రికెట్‌కు మళ్లీ స్టార్ కల రానుంది. అంతర్జాతీయ మ్యాచ్‌లు లేని సమయంలో అందుబాటులో ఉంటే ఆటగాళ్లు తప్పకుండా దేశవాళీ లీగ్‌ల్లో ఆడాలని ఇటీవల బీసీసీఐ స్పష్టం చేసింది. ఇందులో స్టార్ ఆటగాళ్లకూ మినహాయింపులు ఉండవని పేర్కొంది. దేశవాళీ క్రికెట్‌కు ప్రాధాన్యం పెంచడం కోసం బోర్డు ఈ చర్యలు చేపట్టింది. దీంతో అగ్రశ్రేణి ఆటగాళ్లు సైతం దేశవాళీ క్రికెట్ బాటపడుతున్నారు. టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ 2015 తర్వాత తొలిసారి రంజీ మ్యాచ్ ఆడబోతున్నాడు. గురువారం జమ్ముకశ్మీర్‌తో ఆరంభమయ్యే మ్యాచ్‌లో ముంబయికి ప్రాతినిథ్యం వహిస్తానని పేర్కొన్నాడు. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కూడా రంజీ ట్రోఫీ బరిలో దిగనున్నాడు. ఈ విషయాన్ని సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జయ్‌దేవ్ షా ఆదివారం పేర్కొన్నారు. జనవరి 23 నుంచి రాజ్‌కోట్‌లో ఢిల్లీతో జరగనున్న మ్యాచ్‌లో జడేజా ఆడనున్నాడు. జడ్డూ 2023 జనవరిలో చివరగా రంజీ ట్రోఫీలో ఆడాడు. యువ ఆటగాళ్లు యశస్వి జైస్వాల్ (ముంబయి), శుభ్‌మన్ గిల్ (పంజాబ్), రిషభ్ పంత్ (ఢిల్లీ) కూడా రంజీ ట్రోఫీలో ఆడనున్నారు. రోహిత్‌తో కలిసి యశస్వి ముంబయి తరఫున బరిలోకి దిగనున్నాడు. భారత స్టార్ కోహ్లి మాత్రం రంజీలో ఢిల్లీ ఆడే తదుపరి మ్యాచ్‌కు దూరమయ్యాడు. మెడనొప్పి కారణంగా సౌరాష్ట్రతో ఢిల్లీ మ్యాచ్‌కు అతను అందుబాటులో ఉండటం లేదని డీడీసీఏ సీనియర్ ప్రతినిధి తెలిపాడు. మరోవైపు మోచేతి నొప్పి నుంచి కోలుకుంటున్న కేఎల్ రాహుల్ కూడా పంజాబ్‌తో కర్ణాటక మ్యాచ్‌కు దూరమయ్యే అవకాశముంది.

## ఆటగాళ్ల ఎంపికలో గంభీర్, రోహిత్ మధ్య అభిప్రాయభేదాలు?

**ముంబయి:** ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్, ఛాంపియన్స్ ట్రోఫీ కోసం అజిత్ అగార్కర్ సారథ్యంలోని బీసీసీఐ సెలక్షన్ కమిటీ శనివారం జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. వచ్చే నెల 6న ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్, ఫిబ్రవరి 19న ఛాంపియన్స్ ట్రోఫీ మొదలవుతుంది. ఈ ట్రోఫీ కోసం రోహిత్ నాయకత్వంలో 15 మంది ఆటగాళ్లతో జట్టును ఎంపిక చేశారు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు అదనంగా పేసర్ హర్షిత్ రాణాకు చోటునిచ్చారు. శుభ్‌మన్ గిల్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు. అయితే, కొంతమంది ఆటగాళ్ల ఎంపిక విషయంలో కోచ్ గౌతమ్ గంభీర్ , కెప్టెన్ రోహిత్ శర్మ మధ్య అభిప్రాయభేదాలు తలెత్తినట్లు వార్తలొస్తున్నాయి. హార్దిక్ పాండ్యకు వైస్ కెప్టెన్ బాధ్యతలు కట్టబెట్టాలని గంభీర్ అనుకున్నాడట. అయితే, శుభ్‌మన్ గిల్‌ను ఉప సారథిగా నియమించాలని రోహిత్ శర్మ, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పట్టుబట్టారట. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో రాణించిన సంజు శాంసన్‌కు జట్టులో చోటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. శాంసన్‌ను తీసుకోవాలని గంభీర్ భావించాడట. కానీ, రోహిత్, అగార్కర్ మద్దతుతో పంత్ ఎంపికయ్యాడని సమాచారం. విజయ్ హజారే టోర్నీ సందర్భంగా కేరళ నిర్వహించిన శిబిరానికి దూరంగా ఉండటం, దేశవాళీ జట్టులో ఆడకపోవడం శాంసన్‌కు ప్రతికూలంగా మారాయి.

**కేసీఏపై శశిథరూర్ విమర్శలు..**

మంచి ఫామ్‌లో ఉన్నా సంజు శాంసన్ భారత జట్టుకు ఎంపికకాకపోవడంతో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కేరళ క్రికెట్ అసోసియేషన్‌పై విమర్శలు గుప్పించారు. 'సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హాజారే ట్రోఫీ టోర్నమెంట్‌ల మధ్య శిక్షణా శిబిరానికి హాజరుకాలేకపోయినందుకు చింతిస్తూ శాంసన్ కేసీఏకి ముందుగానే లేఖ రాశాడు. అయినా జట్టు నుంచి తొలగించారు. ఇప్పుడు అది శాంసన్‌ను జాతీయ జట్టు నుంచి తప్పించడానికి దారితీసింది' అని ట్విటర్ (ఎక్స్)లో పోస్ట్ చేశాడు. మంచి ఫామ్‌లో ఉన్నా క్రికెట్ పాలకుల ఈగో వల్ల శాంసన్ కెరీర్ నాశనమైందని శశిథరూర్ విమర్శించాడు.




## అమెరికాలో టిక్‌టాక్ బంద్!

**వాషింగ్టన్:** ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ అమెరికాలో తన సేవల్ని నిలిపివేసింది. ఈ విషయాన్ని కంపెనీ స్వయంగా ప్రకటించింది. ఈ మేరకు ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకు తన సేవలను మూసివేస్తున్నట్లు సందేశాలు పంపిస్తోంది. టిక్‌టాక్‌పై నిషేధం అమలులోకి రానున్న వేళ కంపెనీ మాతృసంస్థ బైట్‌డ్యాన్స్ ఈ నిర్ణయం తీసుకుంది. ''అమెరికాలో టిక్‌టాక్‌ను నిషేధించేందుకు తీసుకొచ్చిన చట్టం జనవరి 19 నుంచి అమల్లోకి రానుంది. దీంతో ఈ సేవల్ని తాత్కాలికంగా నిలిపివేయనున్నాం'' అంటూ టిక్‌టాక్ తన యూజర్లకు సందేశం పంపింది. ఇదిలా ఉండగా.. 2017లో ప్రారంభమైన టిక్‌టాక్‌ను భారత్ సహా అనేక దేశాలు నిషేధించాయి. అమెరికాలోని కొన్ని రాష్ట్రాలూ దీని వినియోగంపై ఆంక్షలు పెట్టాయి. ఈ నేపథ్యంలో ఇటీవల అమెరికా ప్రతినిధుల సభ ఓ బిల్లుకు ఆమోదం తెలిపింది. చైనా యాజమాన్యాన్ని వదులుకోకపోతే నిషేధం ఎదుర్కోవాల్సిందేనది బిల్లులోని సారాంశం. అనంతరం అమెరికా సుప్రీంకోర్టు కూడా టిక్‌టాక్ మాతృసంస్థ బైట్‌డ్యాన్స్‌కు డెడ్‌లైన్ ఇచ్చింది. జనవరి 19లోగా యూఎస్ టిక్‌టాక్‌ను విక్రయిస్తారా? లేదా నిషేధాన్ని ఎదుర్కొంటారా? నిర్ణయించుకోవాలని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో టిక్‌టాక్ సేవల్ని ఆపివేస్తున్నట్లు సంస్థ యూజర్లకు సమాచారం అందించింది. అయితే ట్రంప్ అధికారంలోకి వచ్చాక టిక్‌టాక్ పునరుద్ధరణకు ప్రయత్నించేందుకు చర్చలు జరుపుతామని టిక్‌టాక్ ఈ సందర్భంగా తెలిపింది.




# యూఎస్ డాలర్ బలోపేతం

## భారత్ ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.44,396 కోట్ల ఉపసంహరణ!





**ముంబయి:** దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) ఈ నెలలో రూ.44,396 కోట్ల విలువైన షేర్లు విక్రయించారు. దేశీయంగా కార్పొరేట్ సంస్థల తృతీయ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బలహీనంగా ఉంటాయన్న అంచనాల మధ్య అమెరికా డాలర్, యూఎస్ బాండ్లు బలోపేతం కావడంతో విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు ఉపసంహరిస్తున్నారు. గత నెలలో రూ.15,446 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టారు. దేశీయ, అంతర్జాతీయ ఒడిదొడుకుల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీన పడింది. మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ ఇండియా మేనేజర్ రీసెర్చ్- అసోసియేట్ డైరెక్టర్ హిమాన్షు శ్రీవాత్సవ స్పందిస్తూ 'ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ పతనం కొనసాగుతున్నా కొద్దీ దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు ఉపసంహరిస్తూనే ఉంటారు. ఆర్థిక వృద్ధిరేటుపై అనిశ్చితి, బలహీన ఆర్థిక ఫలితాలు దీనికి దోహద పడతాయి' అని వ్యాఖ్యానించారు. ఈ నెల 17 వరకూ ఎఫ్‌పీఐలు రూ.44,396 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ఈ నెల రెండో తేదీ మినహా ఎఫ్‌పీఐలు నిత్యం ఈక్విటీ మార్కెట్లలో షేర్లు విక్రయిస్తూనే ఉన్నారు. జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటర్జిస్ వీకే విజయకుమార్ మాట్లాడుతూ 'అమెరికా డాలర్ బలోపేతం కావడం, యూఎస్ బాండ్ల విలువ పెరగడం వల్ల ఎఫ్‌పీఐలు నిత్యం ఈక్విటీ మార్కెట్లలో వాటాలను విక్రయించడానికి కారణం. యూఎస్ డాలర్ ఇండెక్స్ 109 ఎగువన, పదేండ్ల గడువు గల యూఎస్ బాండ్ల విలువ 4.6 శాతం వృద్ధి చెందడం వల్లే భారత్ వంటి అత్యంత ఖర్చుతో కూడుకున్న మార్కెట్ నుంచి ఎఫ్‌పీఐలు వాటాలను ఉపసంహరించడానికి కారణం' అని చెప్పారు. యూఎస్ బాండ్లు ఆకర్షణీయంగా ఉండటంతో డెట్ మార్కెట్ నుంచి కూడా ఎఫ్‌పీఐలు నిధులు ఉపసంహరిస్తున్నారు. డెట్ మార్కెట్లో సాధారణ పరిమితి రూ.6,176 కోట్ల నుంచి ఎఫ్‌పీఐలు రూ. 4,848 కోట్లు ఉపసంహరించారు. దేశీయంగా వినియోగం వృద్ధి చెందడంతోపాటు మౌలిక వసతుల ప్రాజెక్టులపై పెరుగుతున్న పెట్టుబడులు, జీడీపీ వృద్ధి, కార్పొరేట్ త్రైమాసిక ఆర్థిక ఫలితాల్లో వృద్ధి ఉంటే దేశీయ మార్కెట్లోకి ఎఫ్‌పీఐ పెట్టుబడులు వస్తాయని వాటర్ ఫీల్డ్ అడ్వైజర్స్ లిస్టెడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ సీనియర్ డైరెక్టర్ విపుల్ భోవర్ అంచనా వేశారు. విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్లలో పెట్టుబడులపై ఆచితూచి స్పందించే వైఖరి అనుసరిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ కేవలం రూ.427 కోట్ల విదేశీ పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. గతేడాది రూ.1.71లక్షల కోట్ల ఎఫ్‌పీఐ పెట్టుబడులు వచ్చాయి. అమెరికా, బ్రిటన్, ఈయూ వంటి కేంద్రీయ బ్యాంకులు వడ్డీరేట్లు పెంచిన 2022లో దేశీయ మార్కెట్ల నుంచి రూ.1.21లక్షల కోట్ల పెట్టుబడులను ఎఫ్‌పీఐలు ఉపసంహరించారు.

## పని గంటల కంటే.. నాణ్యత ముఖ్యం

### భారత్‌పే సీఈవో

**ముంబయి:** ఉద్యోగులు వారానికి 90 గంటలు పని చేయాలని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దీనిపై పలువురు ప్రముఖులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఈ అంశంపై భారత్‌పే సీఈవో నలిన్ నెగీ స్పందించారు. పని గంటల సంఖ్య కంటే.. ఉత్పాదకత నాణ్యత ముఖ్యమన్నారు. ''వారానికి 90 గంటలు పని చేయడం అంటే చాలా కష్టం. ఎన్ని గంటలు పని చేశామనే దాని కంటే.. దాని నుంచి వచ్చే ఉత్పాదకత నాణ్యత ముఖ్యమని నా అభిప్రాయం. మా సంస్థను ప్రారంభించి ఆరేళ్లు పూర్తయింది. 'భారత్‌పే' ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉండే కంపెనీగా నిలవాలన్నదే మా అభిమతం. ఒక కంపెనీ ఉద్యోగాలు ఇవ్వడం మాత్రమే కాదు.. ప్రజలకు మంచి భవిష్యత్తును ఇచ్చేదిగా ఉండాలి. ప్రస్తుతం దాని పైనే మా దృష్టి కేంద్రీకరించాం'' అని ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నలిన్ నెగీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

''వారానికి 90 గంటలు పని చేయడంపై నాకు నమ్మకం లేదు. ఎందుకంటే, ఒక ఉద్యోగి సంతోషంగా పని చేస్తే.. దాని వల్ల సంస్థకు చాలా లాభం ఉంటుంది. వారు చేయాలని తమంతట తాము భావిస్తే చాలు.. వేరొకరి సూచన అవసరం లేదు'' అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. 'ఇంట్లో కూర్చొని ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారు? ఇంట్లో తక్కువ, ఆఫీసులో ఎక్కువగా ఉంటామని భార్యలకు చెప్పాలి. అవసరమైతే ఆదివారాలు కూడా పనిచేయాలి' అంటూ ఎల్ అండ్ టీ ఛైర్మన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. కార్మిక సంఘాలతో పాటు వ్యాపారవేత్తల నుంచీ విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వ్యాఖ్యలు విస్తృత ఆశయాన్ని ప్రతిబింబిస్తాయని, అసాధారణ ఫలితాలకు అసాధారణ కృషి అవసరమంటూ తమ ఛైర్మన్ వ్యాఖ్యలను ఎల్ అండ్ టీ సమర్థించే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలోనే స్పందించిన నలిన్ నెగీ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.



విశ్వంభర V3 NEWS




# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న 'సంక్రాంతికి వస్తున్నాం' టీమ్

**తిరుమల:** 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ఈ పండుగకు సూపర్ హిట్‌ను అందుకున్నాడు నిర్మాత దిల్ రాజు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన చిత్రమిది. మీనాక్షి చౌదరి , ఐశ్వర్యా రాజేశ్ కథానాయికలుగా నటించారు. జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్ అందుకోవడమే కాకుండా హౌస్ ఫుల్ బోర్డ్‌తో నడుస్తుంది. మహిళా ప్రేక్షకులు అధిక సంఖ్యలో థియేటర్లకు వెళ్లి ఈ సినిమాను చూసి ఎంజాయ్ చేస్తున్నారు. అయితే ఈ చిత్రం ఇంతటి ఘన విజయం సాధించిన సందర్భంగా చిత్రబృందం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. ఆదివారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో నిర్మాత దిల్ రాజుతో పాటు అతడి భార్య అనిత.. శిరీష్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్లు ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షి చౌదరి తదితరులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వీరికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. దర్శనం అనంతరం బయటకి రాగా.. అభిమానులు వీరితో ఫోటోలు దిగేందుకు ఆసక్తి చూపారు.

# ధనుష్‌తో సినిమా చేసి.. అది నాది కాదని చెప్పిన దర్శకుడు



ధనుష్ హీరోగా గౌతమ్ వాసుదేవ్ మేనన్ తెరకెక్కించిన తమిళ చిత్రం 'ఎనై నోకి పాయుమ్ తోట'. మేఘా ఆకాశ్ కథానాయిక. ఇదే చిత్రాన్ని తెలుగులో 'తూటా' పేరుతో విడుదల చేశారు. 2019లో విడుదలైన ఈ చిత్రాన్ని ఉద్దేశించి తాజాగా గౌతమ్ మేనన్ చేసిన కామెంట్స్ చర్చకు దారి తీశాయి. తన తదుపరి సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన్ని 'ఎనై నోకి పాయుమ్ తోట' గురించి విలేకరి ప్రశ్నించాడు. ప్రశ్న పూర్తి కాకుండానే స్పందించిన ఆయన.. ''మీరు ఏ సినిమా గురించి మాట్లాడుతున్నారు? ఆ సినిమా గురించి నేను మర్చిపోయాను. దాని గురించి నాకు ఏమీ గుర్తు లేదు. అందులోని ఒక పాట మాత్రమే గుర్తుంది. అది నా సినిమా కాదు. వేరే ఎవరిదైనా అయి ఉండొచ్చు'' అని తెలిపారు. గౌతమ్ మేనన్ అలా చెప్పడానికి కారణమేమిటా? అని నెటిజన్లు మాట్లాడుకుంటున్నారు. యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్‌గా 'ఎనై నోకి పాయుమ్ తోట' తెరకెక్కింది. ఈ సినిమాలోని తొలి భాగాన్ని గౌతమ్ ఎంతో ఫోకస్ పెట్టి తెరకెక్కించారు. చిత్రీకరణ దశలో ఉండగానే విడుదల తేదీ ప్రకటించడంతో అనుకున్న సమయానికి దానిని పూర్తి చేయాలని ఒత్తిడి రావడంతో త్వరితంగా రెండో భాగాన్ని పూర్తి చేశారని అప్పట్లో వార్తలు వచ్చాయి. అంతేకాకుండా ధనుష్ కూడా దర్శకత్వం చేశాడని అందరూ అనుకున్నారు. తాజాగా గౌతమ్ చేసిన వ్యాఖ్యలు ఆనాటి కథనాలకు నిజం చేకూర్చినట్లు అవుతోంది. గౌతమ్ తెరకెక్కించిన తాజాగా చిత్రం 'డొమినిక్'. మమ్ముట్టి ప్రధాన పాత్రలలో నటించారు. త్వరలో ఇది విడుదల కానుంది. ప్రేక్షకులకు విభిన్న సినిమాటిక్ అనుభూతిని అందించడం కోసమే తాను దీనిని రూపొందించానని ఆయన చెప్పారు. తాను సినిమాల్లో యాక్ట్ చేయడంపై మాట్లాడుతూ.. ''కెమెరా ముందుకు రావాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. అది నాకు ఏమాత్రం నచ్చదు. అనివార్య కారణాల వల్ల యాక్టర్ అయ్యా. కొంతమంది దర్శకనిర్మాతలతో నాకు మంచి అనుబంధం ఉంది. యాక్టర్ అయ్యాక వాళ్లు తమ ప్రాజెక్టుల్లో అవకాశాలు ఇవ్వడంతో నో చెప్పలేకపోయా. అందుకే యాక్టింగ్ ఇంకా కొనసాగిస్తున్నా'' అని చెప్పారు.



## వివాదాస్పద సీన్‌పై స్పందించిన

# నటి అభినయ

'శంభో శివ శంభో'తో తెలుగు వారికి చేరువైన నటి అభినయ. ఆమె ప్రధాన పాత్రలో నటించిన తాజా మలయాళ చిత్రం 'పని' . నటుడు జోజూ జార్జ్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ప్రస్తుతం ఓటీటీ వేదికగా అందుబాటులో ఉంది. ఇందులో హీరోయిన్‌పై చిత్రీకరించిన అత్యాచార సన్నివేశం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. జోజూ జార్జ్ మేకింగ్‌ను పలువురు తప్పుపట్టారు. దీనిపై తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అభినయ స్పందించారు. దివ్యాంగురాలైన ఆమె.. సైన్ లాంగ్వేజ్‌తో తన అభిప్రాయాన్ని తెలిపారు. ''తన సినిమాలో ఎలాంటి సన్నివేశాలు పెట్టాలి? ఎలా తెరకెక్కించాలి? అనేది పూర్తిగా దర్శకుడి నిర్ణయం. కాబట్టి దాని గురించి నేను పెద్దగా ఏమీ మాట్లాడాలనుకోవడం లేదు. ఏది ఏమైనా దర్శకుడి మాటే తుది నిర్ణయం. జోజూ గొప్ప నటుడు. ఎన్నో భాషల్లో, ఎంతోమంది పేరు పొందిన దర్శకులతో వర్క్ చేసిన అనుభవం ఆయన సొంతం'' అని అభినయ తెలిపారు. మిగిలిన భాషలతో పోలిస్తే మలయాళంలో యాక్ట్ చేయడం కాస్త భిన్నమైన అనుభూతిని అందించిందని ఆమె చెప్పారు. చిత్రీకరణ సమయంలో జోజూ తనకు ఎంతో సాయం చేశారన్నారు. ''యాక్టింగ్ గురించి ఆయన సలహాలు ఇచ్చేవారు. ఆయనతో పని చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా ఈ సినిమాతో అది నెరవేరింది. మలయాళ నటుడు టొవినో థామస్ నటన నాకెంతో ఇష్టం. ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఉంది. దర్శకుల విషయానికి వస్తే రాజమౌళి అంటే అభిమానం. ఆయన సినిమాలో ఒక్కసారైనా



నటించాలని అనుకుంటున్నా'' అని చెప్పారు. తాను ఈ స్థాయికి చేరడానికి కుటుంబ సభ్యులే కారణమని అభినయ ఇప్పటికే ఎన్నో సందర్భాల్లో చెప్పారు. తన కలను వారు అర్థం చేసుకున్నారని.. కథ ఎంపిక, చిత్రీకరణ ఇలా అన్ని విషయాల్లో అండగా నిలిచారని గతంలో తెలిపారీ భామ.

## ఏఐ మాయ.. 'స్క్విడ్ గేమ్'లో

# బాలీవుడ్ మాజీ జంటలు

ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నెట్‌ఫ్లిక్స్ వెబ్ సిరీస్ 'స్క్విడ్ గేమ్' . హ్వాంగ్ డాగ్ హ్యూక్ దర్శకత్వంలో వచ్చిన ఈ కొరియన్ సిరీస్‌లో డబ్బు కోసం సగటు మనిషి ఆడే నెత్తుటి ఆటను ఆసక్తికరంగా చూపించారు. ఆటలు ఆడేందుకు వచ్చిన 456 మందిని ఒక దీవికి తీసుకువెళ్లి అక్కడ చిన్నపిల్లలు ఆడుకునే రెడ్‌లైట్, గ్రీన్‌లైట్, టగ్ ఆఫ్ వార్ వంటి ఆటలు నిర్వహిస్తారు. ఇందులో నటించిన వాళ్లంతా గ్రీన్ డ్రెస్సులు ధరించి కనిపిస్తారు. ఇప్పటికే రెండు భాగాలుగా వచ్చిన ఈ వెబ్ సిరీస్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో ఈ 'స్క్విడ్ గేమ్' ఏఐ వెర్షన్‌లో ఇండియన్ సినీ స్టార్స్ పాల్గొంటే ఎలా ఉంటుందో చూపించే వీడియో ఇటీవలే వైరల్ అయిన విషయం తెలిసిందే.తాజాగా ఈ గేమ్‌లో బాలీవుడ్ మాజీ ప్రేమికులు పాల్గొన్న వీడియో నెట్టింట ట్రెండ్ అవుతోంది. హృతిక్ రోషన్ – కంగన రనౌత్, సల్మాన్ ఖాన్ – ఐశ్వర్య రాయ్, రణ్‌బీర్ కపూర్ – కత్రినా ఖైఫ్, షాహిద్ కపూర్ కరీనా కపూర్,..



టైగర్ ష్రాఫ్ – దిశా పటానీ, జాన్ అబ్రహం- బిపాస బసు.. బిగ్ బీ అమితాబ్ బచ్చన్ – రేఖ జంటలు ఈ గేమ్‌లో పాల్గొన్నారు. అయితే ఇందులో విలన్‌లుగా.. అమితాబ్ బచ్చన్ భార్య జయ బచ్చన్.. అలీయా భట్, సైఫ్ అలీఖాన్, దీపికా పదుకోనే, వివేక్ ఒబెరాయ్ నటించారు. కాగా.. ఏఐ ఆధారంగా సృష్టించిన ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట ట్రెండ్ అవుతోంది.

# స్కూల్ టీచర్‌పై నాకు క్రష్ ఉండేది

## మీనాక్షి చౌదరి

నటి మీనాక్షి చౌదరిఈ మధ్య వరుసగా హిట్లు అందుకుంటుంది. గతేడాది విజయ్ గోట్, లక్కీ భాస్కర్‌తో హిట్లు అందుకున్న ఈ భామ తాజాగా సంక్రాంతికి వస్తున్నాం అనే సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా వచ్చిన ఈ సినిమాను అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. ఈ సందర్భంగా మూవీ సక్సెస్‌కి సంబంధించి ఇంటర్వ్యూ నిర్వహించింది చిత్రయూనిట్.అయితే ఈ ఇంటర్వ్యూలో మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. తనకు స్కూల్ టైంలో ఒక టీచర్ మీదా క్రష్ ఉండేదని చెప్పుకోచ్చింది. మనందరికీ స్కూల్ లేదా కాలేజీ టైంలో క్రష్ ఉంటుందని.. ఇది అబ్బాయిలకే కాదు అమ్మాయిలకు కూడా ఇలా ఉంటుంది. నాకు కూడా నా స్కూల్ టైంలో ఒక టీచర్ మీదా క్రష్ ఉండేదని అతడంటే చాలా ఇష్టమని మీనాక్షి తెలిపింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

## వరుణ్‌తేజ్ దర్శకుడు మేర్లపాక గాంధీతో కొత్త ప్రాజెక్ట్

**హైదరాబాద్:** సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న నటుడు వరుణ్ తేజ్ భిన్నమైన కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. దర్శకుడు మేర్లపాక గాంధీతో కొత్త సినిమాకు సంతకం చేశారు. ఆదివారం వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఈ ప్రాజెక్ట్ వివరాలను ప్రకటించింది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా దీనిని నిర్మిస్తున్నాయి. 'ఇండో - కొరియన్ హారర్ కామెడీ ఫిల్మ్'గా ఇది రూపుదిద్దుకోనుంది. తమన్ స్వరాలు అందించనున్నారు. వరుణ్ తేజ్ 15వ చిత్రంగా తెరకెక్కనుంది. 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఏక్ మినీ కథ' వంటి చిత్రాలను మేర్లపాక గాంధీ తెరకెక్కించిన విషయం తెలిసిందే.



## అమ్మకు పద్మ అవార్డుకు ప్రయత్నించినా ఫలితం లేదు: నరేశ్

**హైదరాబాద్:** 46 చిత్రాలను తెరకెక్కించిన ఏకైక మహిళ దర్శకురాలిగా తన తల్లి విజయ నిర్మల రికార్డు సృష్టించారని, ఆమెకు పద్మ అవార్డు కోసం ఢిల్లీ వరకూ వెళ్లినా ఫలితం లేదని నటుడు నరేశ్ పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎదురైన ప్రశ్నపై స్పందించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. అవార్డుకు విజయ నిర్మల పేరు రికమెండ్ చేశారని తెలిపారు. తన తల్లికే కాకుండా చాలామంది గొప్పవారికి పద్మ అవార్డులు రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భాజపా ప్రభుత్వం అర్హులకు ఇస్తుండడం సంతోషంగా ఉందన్నారు. తనయుడిగానే కాకుండా చిత్ర పరిశ్రమ వ్యక్తిగా మరోసారి ఆ పురస్కారం కోసం ప్రయత్నిస్తానని చెప్పారు. విజయ నిర్మలసహా చిత్ర పరిశ్రమకు విశేష సేవలందించిన వారికి అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. తదుపరి చిత్రాల గురించి మాట్లాడుతూ.. ''ఇటీవల 40 రోజుల్లో 22 కథలు విన్నా. వాటిలో నాకు నచ్చినవి ఎంపిక చేసుకున్నా. రెండు సినిమాల్లో లీడ్ రోల్స్ చేస్తున్నా. ఓటీటీల్లోనూ మంచి అవకాశాలు రావడం సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు.''కథలు రాస్తుంటా. ఓ కథను నిర్మాతలు ఓకే చేసి సెట్స్‌పైకి వెళ్లేలోపు వేరే బాధ్యతతో దాన్ని ఆపేశా. తప్పకుండా త్వరలోనే డైరెక్షన్ చేస్తా. నటుడిగా సెకండ్ ఇన్నింగ్స్‌లో ఫుల్ బిజీగా ఉన్నా. చిత్రం భళారే విచిత్రం, శ్రీవారికి ప్రేమలేఖ పార్ట్ 2 స్టోరీలు ప్రారంభించా. అమ్మ బయోపిక్ చేయాలనే ఆలోచన ఉంది. నా బయోపిక్ గురించి నువ్వు రాయి అని అమ్మ అంటుండేది. మూడు పేజీలు రాశా'' అని తెలిపారు.పవిత్ర రాకతో జీవితంలో వచ్చిన మార్పులేంటనే ప్రశ్నకు సమాధానమిస్తూ.. టైటానిక్ ఒడ్డుకు చేరిందన్నారు. సోమవారం తన పుట్టినరోజు సందర్భంగా పవిత్రతో కలిసి నరేశ్ కేకు కోసి సెలబ్రేట్ చేసుకున్నారు.



రిపోర్టర్స్ కావలెను V3 NEWS లక్ష్యం సమాజహితం తెలుగు దినపత్రిక విశ్వంభర అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com